



మహాభారతం


విచారణ

మహా భారతంలో ఆదర్శ పాత్రలు








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్థం మహానుభావులైన **ద్వారకాదీష్ వాస్తు** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **ద్వారకాదీష్ వాస్తు** వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

http://dwarkadheeshvastu.com



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

విషయ సూచిక

॥ శ్రీ హరిః ॥

శ్రీకృష్ణ భగవానుడు

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।
అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్ ॥

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

(గీత. 4/7 -8)

ఓ భరతవంశీ! ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియు అధర్మమునకు వృద్ధియు కలుగునో, అప్పుడప్పుడు (ఆయాసమయాల్లోనే) మాత్రమే నన్నునే సృష్టించుకొందును. సాకార రూపంలో జనులముందు బహిర్గతమగుచుందును.

సాధుపురుషులనుద్ధరించుట కొరకు, పాపకృత్యములు చేయువారిని నశింపజేయుటకు మరియు ధర్మమును చక్కగా స్థాపింపజేయుట కొరకు నేను యుగయుగమునను అవతరించుచుందును.

శ్రీకృష్ణుడు విశుద్ధజ్ఞానస్వరూపుడు. భగవద్గీతలో భగవానుడు ఏది తన స్వరూపమని తెలియజెప్పడం జరిగిందో అదే అతని వాస్తవస్వరూపం. ఆ విషయాన్ని ప్రమాణీకరించే అంశాలు ఎన్నో మహాభారతంలో వేలు వేలు తావులలో లభిస్తాయి.

(1)

జగన్నియంత, దేవాధిదేవుడు, అఖిలలోకేశ్వరుడూ, భగవానుడూ అయిన శ్రీమన్నారాయణుడే వాసుదేవుడుగా శ్రీకృష్ణుని రూపంలో భూమిమీద అవతరించాడనే విషయాన్ని భాగవతమూ ఒప్పుకుంటోంది. భారతమూ ఒప్పుకుంటోంది. (ఆదిపర్వం 64వ అధ్యాయం చూడండి!) ధర్మరాజు అయిన యుధిష్ఠిరుడు రాజసూయయాగం చేసినప్పుడు అందులో పాల్గొనడం కోసం ఎందరో మహర్షులూ, నారదుడూ, మహారాజులూ విచ్చేశారు. వారితో బాటు శ్రీకృష్ణభగవానుడు కూడ సభామండపాన్ని అలంకరించి ఉండడం

చూచి భగవానుడైన శ్రీమన్నారాయణుడు భూమండలం మీద ఆ రూపంలో అవతరించాడు అన్న తలంపు యుధిష్ఠిరునకు కలుగుతుంది. (సభాపర్వం 36/12) అతడు పుండరీకాక్షుడైన శ్రీహరిని మనస్సులోనే స్తుతించడం మొదలు పెడతాడు. అనంతరం ఆ సభకు విచ్చేసిన మహానుభావులలో ప్రప్రథమ పూజనీయులు ఎవరు అన్న ప్రశ్న ఉదయిస్తుంది. అప్పుడు కురుకులవృద్ధుడు, వీరశిరోమణి, మహాత్ముడు అయిన భీష్ముడు లేచి నిండు సభలో శ్రీకృష్ణుడు ప్రప్రథమ పూజలను అందుకోదగినవాడు అని తెలుపుతూ ఈ క్రింది విధంగా అతని మహత్త్వాన్ని ఉగ్గడిస్తాడు -

శ్లో॥ కృష్ణ ఏవ హి లోకానాముత్పత్తిరపి చాప్యయః ।
కృష్ణస్య హి కృతే విశ్వమిదం భూతం చరాచరమ్, ॥
ఏష ప్రకృతిరవ్యక్తా కర్తా చైవ సనాతనః ।
పరశ్చ సర్వభూతేభ్యః తస్మాత్ పూజ్యతమో హరిః ॥

(సభా. 38/23-24)

అనగా వాసుదేవుడే ఈ చరాచర విశ్వానికి అంతకూ సృష్టికర్త, ప్రళయస్వరూపుడూను. ఈ చరాచర విశ్వంయొక్క అస్తిత్వానికి మూలం ఆ పరమపురుషుడే. అతడే అవ్యక్తప్రకృతి. అతడే సనాతనకర్త. అతడే సమస్త ప్రాణులకు అధీశ్వరుడు. కావున అతడు పరమపూజ్యుడు అని భావము.

దేవర్షియైన నారదుడు కూడ ఈ ప్రస్తావాన్ని సమర్థించాడు. (సభా. 39/8) అంతేకాదు ఈ ప్రస్తావాన్ని ఆమోదించిన సహదేవునిమీద ఆ సమయంలో -

శ్లో॥ తతో పతత్ పుష్పవృష్టిః సహదేవస్య మూర్ధని ।
అదృశ్యరూపా వాచాశ్చాప్య బ్రువన్ సాధు సాధ్వితి ॥

(39/6-7)

ఆకాశం నుండి పుష్పవృష్టి కురిసింది. సాధు! సాధు! మేలు! మేలు! అంటూ ఆకాశవాణి కూడా వినవచ్చింది.

ప్రత్యక్షంగా శ్రీకృష్ణుని బాల్యచరిత్రవర్ణనం మహాభారతంలో లభించదు. అందుకు ఆ చరిత్రలతోటి మహాభారతంలోని ప్రధానకథకు సంబంధం

లేకపోవడమే కారణం. మహాభారతానికి అనుబంధించిన హరివంశపర్వంలో మాత్రం ఈ లోపం పూర్తిచేయబడింది. అయినా ప్రాసంగికంగా మహాభారతానికే చెందిన వివిధ పాత్రలద్వారా శ్రీకృష్ణుని బాల్యలీలా చరిత్రం అక్కడక్కడ వివరించబడింది. భీష్మపితామహుడు సభాముఖంగా శ్రీకృష్ణుని ప్రథమపూజ్యతను ప్రతిపాదిస్తాడు. ఆ తరుణంలో శ్రీకృష్ణునకు బాల్యం నుండి విరోధి చేదిదేశపురాజు అయిన శిశుపాలుడు ఉన్నాడు. రుక్మిణీహరణం అయిననాటినుండి అతడు కృష్ణునిమీద మరింత ద్వేషం పూనియున్నాడు. అతడు వెంటనే లేచి శ్రీకృష్ణుడు చిన్నతనంలో పూతన, వరుసగా బకాసురుడు, కేశిరాక్షసుడు, కంసుడు, శకటాసురుడు మున్నగువారిని సంహరించిన విషయాలను, గోవర్ధనగిరిని ఎత్తిన విషయాలను సభాముఖాన వివరిస్తాడు. (సభా. **41/4,7,-11**) ఆ వివరణం అంతా కేవలము శ్రీకృష్ణుని నిందించాలనే తలంపుతోనే సాగింది. అయినా అతడు ఆ లీలలలోని సత్యాన్ని సమ్మతించినవాడే అయ్యాడు. శత్రువుల ద్వారా వర్ణింపబడిన యీ అలౌకిక చరిత్రలవలన శ్రీకృష్ణుని లోకోత్తరత్వం ఎట్లాగో వ్యక్తం అవుతుంది. దానితో బాటు భారతకృష్ణుడు వేఱు, భాగవతకృష్ణుడు వేఱు అని వారికి తమ అభిప్రాయంమీద పునర్విమర్శ చేసుకోవడానికి తగిన ఆధారం కూడా లభిస్తుంది. సరే! ఆ విషయాన్ని అలా ఉంచండి! ఆ సందర్భంలో శిశుపాలుడు శ్రీకృష్ణుని, అతనిని ప్రశంసించిన భీష్మపితామహుని దారుణంగా పరుషోక్తులు ఆడాడు. కాని శ్రీకృష్ణుడు ఆ మాటలను అన్నిటినీ ఓరిమి వహించి సహించేడు. సభాసదులు వారిస్తున్నా వినక శిశుపాలుడు నిందించడం కొనసాగిస్తున్న దశలో కడపట శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని స్మరిండాడు. (సభా **45/21**) అందరూ చూస్తూ ఉండగా ఆ సుదర్శన చక్రం శిశుపాలుని కుత్తుకను ఉత్తరించివేసింది. ఆ సమయంలో ఆ శిశుపాలుని శరీరంనుండి ఒక గొప్ప తేజః పుంజం బహిర్గతమై వచ్చి జగద్వంద్యుడైన శ్రీకృష్ణపరమాత్మకు ప్రణమిల్లి అతనిలో లయం చెందింది. ఈ మాటలకు ప్రమాణభూతాలైన శ్లోకాలు

శ్లో॥ తతశ్చేదిపతేర్దేహాత్తేజోఽగ్ర్యం దదృశుర్నృపాః ।
ఉత్పతంతం మహారాజ గగనాదివ భాస్కరమ్ ॥

తతః కమలపత్రాక్షం కృష్ణం లోకనమస్కృతమ్ ।
వవందే తత్తదా తేజో వివేశ చ నరాధిప ॥
తదద్భుతమమన్యంత దృష్ట్వా సర్వే మహీక్షితః ।
యద్ వివేశ మహాబాహుం తత్తేజః పురుషోత్తమమ్ ॥

(సభా. 45/26-28)

ఈ అలౌకిక సంఘటనవలన శ్రీకృష్ణుడు సాక్షాత్తూ భగవానుడు అనే విషయం ఎలాగూ ప్రమాణితం అవుతూనే ఉంది. దానితో బాటు అక్కడ చేరియున్న జనులకు ఎల్లరకునూ కూడ లోకంలో ఎవడు ఎంతటి మహాపాపియైనా భగవానునిచేత సంహరింపబడినప్పుడు చంపబడినవానికి సాయుజ్యముక్తి లభిస్తుంది. అనే మాటకూ, అతడు భగవత్స్వరూపంలో లయం చెందుతాడని చెప్పేమాటకు ప్రత్యక్షప్రమాణం లభించింది. ఆ పరమపురుషుడు తనచేత సంహరింపబడిన వారికి కూడ ముక్తిని కలిగిస్తాడు. ఇక పాండవులవలె తనను గాఢంగా ప్రేమించేవారు ఎవరు ఉన్నా వారి చేతులలో ఆ భగవానుడు అమ్ముడు పోతాడనడంలో ఆశ్చర్యం ఏముంది?

(2)

దుష్టుడైన దుశ్శాసనునిచేత అవమానింపబడేవేళ అసహాయురాలైన ద్రౌపది శ్రీకృష్ణుని - "గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ. హే నాథ! హే రమానాథ వ్రజనాథార్తినాశన" (సభా. **68/41-42**) అని సంబోధిస్తూ స్మరిస్తుంది. ఈ సంబోధనలవల్ల బృందావనకృష్ణుడు, ద్వారకా కృష్ణుడు వేఱు కాదు. ఒకరే అన్న విషయం స్పష్టం అవుతోంది. సరే! ఆ విషయం అలా ఉంచండి! ద్రౌపదియొక్క ఆర్త నాదాన్ని ఆలకించినంతనే కరుణామయుడైన కేశవుడు ద్వారకనుండి పరుగిడి వచ్చి ధర్మరూపంతో ఆమె వస్త్రంలో దాగియుండి ఆమె గౌరవాన్ని కాపాడుతాడు. (సభా**68/45-49**) ఏమి? ఈ విధంగా ఏ మానవుడైనా దూరంగా ఉన్న తన భక్తులను అలౌకికమైన రీతిలో రక్షింపగలడా? లేడు.

(3)

ధర్మాత్ములైన పాండవులు జూదంలో తమ సర్వస్వమూ కోల్పోయి వనవాస కష్టాలను భరిస్తూ ఉన్నారు. శ్రీకృష్ణుడు కూడ అక్కడకు విచ్చేశాడు.

ఆ సమయంలో మహాతపశ్శాలి, చిరంజీవి అయిన మార్కండేయ మహర్షి అక్కడకు రావడం జరుగుతుంది. అప్పుడు అతడు పాండవులతో శ్రీకృష్ణుని మహత్త్వాన్ని ఉగ్గడిస్తాడు. ప్రాసంగికంగా ప్రళయకాలమందలి తన అనుభవాన్ని వివరిస్తూ -

శ్లో॥ యస్సదేవో మయా దృష్టః పురా పద్మాయతేక్షణః ।
స ఏష పురుషవ్యాఘ్రః సంబంధీ తే జనార్దనః. ॥
అస్యైవ వరదానాద్ధి స్మృతిర్న ప్రజహాతి మామ్, ।
దీర్ఘమాయుశ్చ కౌంతేయ స్వచ్ఛందమరణం మమ. ॥

(వన. 189/52-53)

అంటాడు. దీని అర్థం అనంతజలరాశిమీద వటపత్రముపై శయనించిన అద్భుత శిశురూపంలో నాకు పూర్వం దర్శనం ఇచ్చిన పరమాత్మయే యీ మీ సంబంధితుడైన శ్రీకృష్ణుడు. నాడు ఈ మహాపురుషుడు ఇచ్చిన వరప్రభావం చేతనే నాకు అఖండమైన స్మరణశక్తి, వేలాది సంవత్సరాల ఆయుష్షు, స్వేచ్ఛామరణ సామర్థ్యము ప్రాప్తించాయి.

ఒక మాఱు పాండవులకు అహితం కలిగించే తలంపుతో దుర్యోధనుడు చండకోపనుడైన దుర్వాసమహామునిని వారి చెంతకు అతిథిగా పంపించాడు. ఆ మహర్షి తన పదివేలమంది శిష్యులను వెంటబెట్టుకొని పాండవుల నివాసస్థానానికి వచ్చాడు. అప్పటికే సూర్యభగవానుని వలన యుధిష్ఠిరుడు అక్షయపాత్రను పడసియున్నాడు. ఆ పాత్రయొక్క మహత్త్వం ఎలాంటిది అంటే అందు పక్వమైన యన్నముతో ఎంతమంది అతిథులకైన కడుపునిండ భోజనాలు పెట్టవచ్చును. ద్రౌపది భోజనం చేసేంతవఱకు మాత్రమే ఆ పాత్ర ఆ విధంగా ఆహారసమృద్ధిని ప్రసాదిస్తుంది. దుర్యోధనుని కుట్ర కారణంగా దుర్వాసుడు ద్రౌపదితో సహా పాండవులందరి భోజనాలు ముగిసిన మీదటనే వారి నివాసస్థలానికి వచ్చాడు. అతిథివత్సలుడూ ధర్మాత్ముడూ అయిన యుధిష్ఠిరుడు అతనిని, అతని శిష్యవర్గాన్ని భోజనాలకు ఆహ్వానించాడు. అప్పుడు ఆ మహర్షి నిత్యకర్మానుష్ఠానం కోసం గంగాతీరానికి వెళ్ళాడు. అలాంటి వేళకాని వేళలో వేలాదిగా ఉన్న బ్రాహ్మణులకు భోజనాలు పెట్టి తృప్తి పరచటానికి మార్గం ఏదీ కానక ద్రౌపది మానసికంగా ఎంతో

చింతించింది. అప్పుడు ఆమె తమకు అత్యంత హితుడు. పరమాప్తుడూ అయిన శ్రీకృష్ణుని స్మరించింది. తోడనే భగవానుడు అక్కడకు పరుగిడి వచ్చాడు. రాగానే అతడు సోదరీ! నాకు చాలా ఆకలిగా ఉంది. తినడానికి ఏమైనా పెట్టు! అని ద్రౌపదిని అడిగాడు. ఇప్పుడే నేను భోజనం ముగించుకొని వచ్చాను. పాత్రలో ఏమీ మిగల లేదు అని ఆమె బదులు చెప్పింది. ఆమె మాటను కాదని శ్రీకృష్ణుడు ఏది ఆ పాత్రను ఇటు తీసుకొనిరా! నేను చూస్తాను" అన్నాడు. ఆమె పాత్రను తెచ్చి యిచ్చింది. శ్రీకృష్ణుడు దానిని చూచాడు. ఆ పాత్రమూతివద్ద కూరకు సంబంధించిన ఆకు ఒకింత అంటుకొని ఉంది. దానినే తీసుకుని అతడు తననోట పెట్టుకుంటూ-

శ్లో॥ ఉపయుజ్యాబ్రవీదేనామనేన హరిరీశ్వరః ।
విశ్వాత్మా ప్రీయతాం దేవస్తుష్టశ్చాస్త్వితి యజ్ఞభుక్. ॥

(వన. 263/25)

అని పలికాడు. ఈ పత్రంతో యజ్ఞభోక్త, విశ్వాత్ముడూ అయిన భగవానుడు శ్రీహరి తృప్తి చెందుగాక! అని ఆ పలుకుటలోని భావం, అనంతరం అతడు మునివర్గాన్ని భోజనానికి పిలుచుకొని రమ్మని సహదేవునితో చెప్పేడు. సహదేవుడు గంగాతీరానికి పోయి చూడగా అక్కడ ఎవరూ లేరు. ఇంతకూ జరిగిన విషయమేమంటే భగవానుడు కూరలోని ఆకును నోటపెట్టుకొని సంకల్ప పఠనం చేసిన వెంటనే అక్కడ గంగాజలంలో నిలిచి అఘమర్షణమంత్రం జపిస్తూ ఉన్న దుర్వాసునకూ అతనిశిష్య వర్గానికి కూడ పీకలవరకు అన్నంతో కడుపు నిండిపోయినట్టి అనుభవం కలిగింది. అప్పుడు వారు అందఱూ తమలో మనకు ఇక్కడే కడుపులు నిండిపోయాయి. ఇక మనం పాండవుల వాసస్థానంలో ఏమి తినగలము. వారు సిద్ధం చేసిన వంటకాలు అన్నీ వ్యర్థం కావడం తప్పదు. దానితో వారి ఆగ్రహానికి మనం గురి కాక తప్పదు అని తర్కించుకొని మౌనంగా అటునుండి అటే వెళ్ళిపోయారు. పాండవులు భగవద్భక్తులని వారు ఎరుగుదురు. అంబరీషుని యింట దుర్వాసుని సుదర్శన చక్రం వెంబడించినప్పటి నుండి వారికి భగవద్భక్తులంటే భయం కలుగడం మొదలయింది. గంగా తీరాన ఎవరూ కానరాక సహదేవుడు మఱలి

వచ్చాడు. ఈ విధంగా శరణాగతవత్సలుడైన శ్రీహరి తన ఆశ్రితులను అందరినీ రక్షించాడు. ఇట్టి చరితలవలన శ్రీకృష్ణుడు భగవానుడు సర్వవ్యాపి అన్న విషయం స్పష్టం అవుతుంది.

(4)

సంజయుడు ధృతరాష్ట్రుని మంత్రి, ప్రభుని కృపకు పాత్రుడైనవాడు. అతడు కౌరవపక్షం వారి దూతగా ఉపప్లవ్యంలోని పాండవులవద్దకు వెళ్ళి వారితో సంభాషించి వారి సందేశాన్ని మరలి వచ్చి ధృతరాష్ట్రునకు తెలియజేసాడు. ఆ సందర్భంలో అతడు శ్రీకృష్ణుని మహత్త్వాన్ని ఉగ్గడిస్తూ - "మహారాజా! శ్రీకృష్ణుడు తలచుకొంటే సంకల్పమాత్రాన ఈ సమస్త ప్రపంచాన్ని కాల్చి భస్మం చేసివేయగలడు. కాని లోకం అంతా ఏకం అయినా అతనిని భస్మం చేయజాలదు" అని అంటాడు. సత్యం, ధర్మం, లజ్జా సంకోచాలు, సారళ్యము, ఎక్కడ ఉంటే అక్కడ శ్రీకృష్ణుడు ఉంటాడు. అతడు ఎక్కడ ఉంటే అక్కడ జయం ఉంటుంది. భగవానుడగు శ్రీకృష్ణుడు తన యోగబలంతో కాలచక్రాన్ని, జగచ్చక్రాన్ని, యుగచక్రాన్ని రేయింబవళ్ళు త్రిప్పుతూ ఉంటాడు. కాలానికి, మృత్యువునకూ, చరాచరప్రపంచానికి అతడు ఒక్కడే ప్రభువు. ఇది సత్యము ఈ మాటలకు ప్రమాణభూతాలైన శ్లోకాలు ఇవిగో! ఇవి -

శ్లో॥ భస్మకుర్యాజ్జగదిదం మనసైవ జనార్దనః ।
న తు కృత్స్నం జగచ్ఛక్తం భస్మకర్తుం జనార్దనమ్, ॥
యతస్సత్యం యతోధర్మో యతో హ్రీరార్జవం యతః ॥
తతో భవతి గోవిందో యతః కృష్ణస్తతో జయః ॥
కాలచక్రం జగచ్చక్రం యుగచక్రం చ కేశవః, ॥
ఆత్మయోగేన భగవాన్ పరివర్తయతేఽనిశమ్. ॥
కాలస్య చ హి మృత్యోశ్చ జంగమస్థావరస్య చ, ॥
ఈశతే భగవానేకః సత్యమేతద్బ్రవీమి తే. ॥

(ఉద్యోగ. 68/8-9,12-13)

మహాభారతాన్ని రచించిన వేదవ్యాసుడు కూడ అప్పుడు అక్కడే ఉన్నాడు. అతడు కూడ సంజయుని మాటలను సమర్థిస్తూ -

**శ్లో॥ జానాత్యేష హృషీకేశం పురాణం యచ్చవైపరమ్ ।
శుశ్రూషమాణమేకాగ్రం మోక్ష్యతే మహతో భయాత్ ॥**

(ఉద్యోగ. 69/12)

అనగా రాజేంద్రా! సంజయుడు చెప్పినమాట పరమసత్యం. మాయను వశీకరించుకొన్నవాడు. పురాణ పురుషుడు, సర్వాంతర్యామి అయిన శ్రీకృష్ణుని స్వరూపాన్ని ఇతడు బాగుగా ఎరుగును. ఏకాగ్రతతో నీవు ఇతని మాటలను ఆలకిస్తూ ఉంటే ఇతడు నిన్ను సంసార బంధభీతినుండి విముక్తుని గావిస్తాడు అని అంటాడు.

శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన రాయబారిగా కౌరవుల కొలువులో ప్రవేశించినప్పుడు పరశురాముడు, నారదుడు మొదలైన వారెందరో మహర్షులు, దేవర్షులూ అక్కడ చేరియుండి మంత్రముగ్ధులవలె ఆ పరమ పురుషుని దివ్యవాక్కులను ఆలకిస్తారు. ధర్మబద్ధమైన భగవానుని ప్రసంగం ముగిసిన వేళ వారు అందరూ ఆ ప్రసంగాన్ని తాము అంగీకరిస్తూ నీవు కూడ అంగీకరించుమని దుర్యోధనునకు నచ్చజెప్పడమే కాక అతనికి ఆ భగవానుని మహత్త్వాన్ని కూడ తెలియజేస్తారు. దుర్యోధనా! శ్రీకృష్ణుడు సాధారణ పురుషుడు కాడు, సమస్త జగత్తునూ సృష్టించినవాడు, సర్వమునకూ ప్రభువు, సర్వ కర్మలకూ సాక్షీభూతుడూ అయిన శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణుని రూపంలో ఆవిర్భవించాడు అని వారు అతనికి నొక్కిచెపుతారు. అయినా కాలదేవత నెత్తిమీదకు ఎక్కి తాండవిస్తూ ఉండడం చేత దుర్యోధనుడు వారి మాటలను పెడచెవిని పెట్టడమే కాక శ్రీకృష్ణునిమీద క్రోధం వహించి అతనిని బంధించడానికి ఉపాయం ఆలోచించడం మొదలుపెడతాడు. అతని కుతంత్రం కృష్ణునకు హృదయంగమం అయిపోతుంది. అప్పుడు అతడు - ఓరి దుర్మార్గుడా! నేను ఒంటరివాడను అసహాయుడను అని నీవు అనుకొంటున్నావు. నన్ను అవమానించి బంధింపజూస్తున్నావు. కాని పాండవులు, అంధకులు, వృష్ణివంశమువారు, ఆదిత్యులు, రుద్రులు, వసువులు, మహర్షులు ఎల్లరూ ఇక్కడే ఉన్నారన్న సంగతిని ఎఱుగకున్నావు. అని పలికి పకాలున నవ్వుతాడు. తోడనే అతని శరీరావయవములందు విద్యుత్ప్రభాసమానులై బ్రహ్మాది దేవలు ప్రకటం అవుతారు. ఆ దేవతల

శరీరాలు అంగుష్ఠ పరిమాణములై అగ్నికణాలను ప్రకటిస్తూ ఉంటాయి. శ్రీకృష్ణుని ఫాలభాగాన బ్రహ్మ, వక్షస్థలాన రుద్రుడూ, భుజాలయందు ఇంద్రాది దిక్పాలకులూ విరాజిల్లుతారు. అంతేకాదు అగ్నులూ, ఆదిత్యులూ, సాధ్యులూ, వసువులూ, అశ్వినిదేవతలు, మరుద్గణాలూ, విశ్వేదేవులూ, యక్ష, కిన్నర, గంధర్వాదులు ఎల్లరూ అక్కడకు చేరి నిలిచి ఉంటారు. శ్రీకృష్ణుని కుడి భుజమునుండి అర్జునుడు, ఎడమ భుజమునుండి హలాయుధం పూనిన బలరాముడు ప్రకటం అవుతారు. యుధిష్ఠిరుడు, భీమసేనుడు, నకులుడూ, సహదేవుడూ, ప్రద్యుమ్నుడూ మొదలుగా గల అంధకవంశమువారూ, వృష్ణివంశమువారూ అయిన యాదవులు ఎల్లరూ అతని వీపునుండి ప్రత్యక్షమై అతని పక్షాన శస్త్రాస్త్రపాణులై నిలుస్తారు. శంఖము, చక్రము, గద, శక్తి, శార్ఙ్గధనువూ, ఖడ్గమూ మొదలైన జ్వలజ్జ్వాలాభీషణములైన ఆయుధాలు అతని భుజములను అలంకరిస్తాయి. అతని కన్నులనుండి, నాసికారంధ్రాలనుండి కర్ణరంధ్రాలనుండి నిప్పురవ్వలూ, రోమకూపాలనుండి సూర్యకిరణాల వంటి కిరణాలు బహిర్గతములు అవుసాగుతాయి.

శ్రీకృష్ణుని ఆ భయంకరస్వరూపాన్ని చూచి అచ్చట చేరియున్న మహారాజులు ఎల్లరూ భయకంపితులై కన్నులు మూసుకుంటారు. ద్రోణాచార్యుడు, భీష్మపితామహుడు, మహాత్ముడైన విదురుడు, సంజయుడు, తపోధనులైన మహర్షులు ఎక్కడున్నవారు అక్కడే స్తంభించిపోతారు. వారికి ఎల్లరకునూ భగవానుడు దివ్యదృష్టిని ప్రసాదించాడు. ఆ సమయంలో దేవతలు దుందుభులు మ్రోగింప మొదలుపెడతారు. ఆకాశమునుండి పూలవానలు కురియ నారంభిస్తాయి. ధృతరాష్ట్రుడు కోరగా అతనికి కూడ భగవానుడు దివ్యదృష్టిని కలుగజేసాడు. వారు ఎల్లరూ కూడ భగవానుని అత్యద్భుతమైన దివ్యమంగళ మయమూర్తిని చూసి ఆశ్చర్యచకితులు అవుతారు. ఇంతలోనే భగవానుడు తన దివ్యస్వరూపాన్ని ఉపసంహరించుకొంటాడు. అప్పటికప్పుడు సభాభవనాన్ని వీడి వెడలిపోతాడు. (ఉద్యోగ. **131/1-24**) శ్రీకృష్ణుడు భగవానుడు అనడానికి ఇంతకంటే ప్రబలమైన ప్రమాణం వేఱు ఏమి కావాలి?

(5)

భగవద్గీత భీష్మపర్వంలోనిది. అందు శ్రీకృష్ణ భగవానుని మహత్త్వం సంపూర్ణంగా నిండియున్నది. అందు ఆ పరమ పురుషుడు తాను అజన్ముడను అని, వినాశరహితుడైన యీశ్వరుడనని, దుష్టశిక్షణము, శిష్టరక్షణము ధర్మసంస్థాపన కోసం అప్పుడప్పుడు భూమి మీద అవతరిస్తూ ఉంటానని స్వయంగా తన దివ్య ముఖారవిందాన అర్జునునకు ఉద్బోధం చేస్తాడు. (గీత. 4/6-8) అంతేకాదు తన జన్మ - కర్మలు దివ్యములైనవని తాత్త్వికంగా తెలుసుకొన్నవారు జననమరణ వలయాన్నుండి శాశ్వతంగా విముక్తిని పొందుతారు అని కూడ ఉగ్గడిస్తాడు (4/9) దీనిని బట్టి శ్రీకృష్ణుడు మనవలె పుట్టి గిట్టే సాధారణమానవమాత్రుడు కాడు అని తేటతెల్లం అవుతోంది. మాటిమాటికి పుడుతూ చస్తూ ఉండే సాధారణ మానవమాత్రుల జన్మరహస్యాన్ని తెలుసుకొన్నవారికి ఆ విధంగా జనసమరణ వలయంనుండి విముక్తి కలుగుతుందా? కలుగదు కదా! గీతలో భగవానుడు తనవలననే సమస్త జగత్తూ ఆవిర్భవించిందనీ, మరల తనయందే లీనం అయిపోతుందని, తనకంటే భిన్నమైనది ఏదీ లేదని ఇంతకు ముందే అర్జునునకు ఉద్బోధిస్తాడు. (7/6-7) తాను యోగమాయ సాయంతో తన భగవత్తత్త్వాన్ని మఱుగు పఱచుకొంటానని, ఆకారణంగా మూఢులు తనను గుర్తించలేరని, అవినాశీ అజన్ముడను అయిన తనను జనన మరణవలయంలో చిక్కిన సాధారణ మానవమాత్రునిగానే వారు భావిస్తారని కూడ అతడు అర్జునునకు చెబుతాడు. (7/25) అతడు దివ్య శరీరంతో భూమిపై అవతరించియున్న కాలంలో కూడ కంసుడు, జరాసంధుడు, శిశుపాలుడు దుర్యోధనుడు మొదలైనవారు ఎందరో అతనిని సాధారణ మానవ మాత్రునిగా భావించి అవహేళనం చేస్తూ ఉండేవారు. అట్టి పరిస్థితిలో అతడు అవనిమీద నిలిచియుండడని యీ కాలంలో జనులు అతనిని గూర్చి అభూతకల్పనలు, అసంగత చర్చలు, తమ అజ్ఞానానికి అద్దం పట్టే కుతర్కాలూ చేస్తున్నారు అంటే అందులో ఆశ్చర్యం ఏమి ఉంటుంది?

అంతియే కాదు. తన అద్వితీయమహిమను వెల్లడి చేయనెంచి భగవానుడు సదయుడై అర్జునునకు తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు.

అప్పుడు అర్జునుడు కన్నులారా ఈ అంశాలను చూస్తాడు. ఆ భగవానుని దివ్యదేహమునుండి వేనవేలు సూర్యుల ప్రభలవంటి ప్రభలు వెలువడడం మొదలవుతుంది. (11/12) సమస్తదేవతలు, మహర్షులు, ఇతరేతర జీవుల సముదాయాలూ ఆస్వామి శరీరంలో విరాజిల్లుతూ ఉంటాయి. (11/15) ఆ స్వామికి ఎన్నో బాహువులు, ఉదరాలు, ముఖాలు, నేత్రాలు ఉంటాయి. అన్నిదిశలనుండియు అతడు అనంతుడుగా ప్రకాశిస్తూ ఉంటాడు. అతనికి ఆది, మధ్యము, అంతయు ఏదీ ఉన్నట్లు కానరాదు. (11/16) అంతేకాదు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, ఆదిగాగల కౌరవ పక్షపు యోధానుయోధులు అందఱూ ఆ పరమపురుషుని భీషణ దంష్ట్రలలో (కోరల) చిక్కి నలగిపోవుచుండుటను కూడ అర్జునుడు పరికిస్తాడు. (11/27) లోకాలు అన్నీ ఆ స్వామి ముఖంలో విలీనములు కావడం కూడ అతడు చూస్తాడు (11/30) శ్రీకృష్ణుని ఆ కరాళరూపాన్ని చూచి భయభీతుడై అతనిని స్తుతించడం మొదలుపెడతాడు. అప్పటివరకు మిత్రుడన్న భావముతో తన సాటివానిగా తలచి తాను అతనితో వ్యవహరించిన విధమును గూర్చి అతనిని క్షమాభిక్ష వేడుకొంటాడు. (11/41, 42, 44) అర్జునుడు భయకంపితుడు కాగా చూచి భగవానుడు తన ఆ విరాడ్రూపాన్ని ఉపసంహరించివేస్తాడు. మఱల శ్యామసుందరరూపంలో అతని ముందు ప్రకటం అవుతాడు. (11/51) ఈ విధంగా భగవానుడు తానే త్రిభువన మోహనాకారుడైన శ్యామసుందరుడనని తానే జగద్రూపంలో వెలుగొందుచుండువాడనని తానే యీ జగత్తునకు అతీతంగా ఉండి దాని సృష్టిసంహారక్రియలను సాగించువాడనని అర్జునునకు ప్రత్యక్షంగా చూపి హృదయంగమం చేస్తాడు. ఆ స్వామిని యీ విధంగా యథార్థరూపంలో చూడడము, అర్థం చేసుకోవడము, అనేది కేవలమూ అతని యెడల భక్తిని అవలంబించడం వలననే సాధ్యం అవుతుంది. (11/54) కాబట్టి ఆ స్వామి కడపట అర్జునునకు - అర్జునా! నీవు నన్నే చింతిస్తూ ఉండు! నన్నే ప్రేమించు! నన్నే భజించు! నన్నే పూజించు! ఇతరమగు సమస్తం మీద ఆధారపడుట మాని నన్నే శరణు పొందు! అని ఉపదేశిస్తాడు(18/65-66).

భగవద్గీత మనకు అందించే కడపటి ఉపదేశం ఇదే. ఆ గ్రంథంలో వ్యక్తం అయిన స్వరూపమే భగవానుని యథార్థస్వరూపం. అతడు జగత్తుకు అతీతంగా ఉండే కూటస్థమగు ఆత్మకంటెను మిన్నయగు పూర్ణతమ పురుషోత్తముడు. (15/18) అనన్యభావంతో అతనిని శరణుపొందినప్పుడే అతని యీ స్వరూపం అనుభవపూర్వకంగా తెలియవస్తుంది. కాబట్టి శ్రీకృష్ణుడు అంటే ఏమి? అనే విషయం తెలియాలి అంటే మనం మన బుద్ధిగతమైన అభిమానాన్ని వీడి ఆ భగవానుని శరణు పొందాలి. అలా శరణుపొందిన మీదట అర్జునునికి విదితం చేసిన విధంగా ఆ స్వామి తన స్వరూపాన్ని మనకు విదితం చేస్తాడు. అప్పుడు అర్జునునిలాగే మనం కూడ - "ప్రభూ! మీ దయవలన మా అజ్ఞానం అంతరించింది. మీ నిజస్వరూపం హృదయంగమం అయింది. మా సందేహాలన్నీ తీరిపోయాయి. ఇప్పుడు మీరు ఏమి చెప్పినా దానిని కన్నులు మూసుకొని ఆచరించుటకు సిద్ధంగా ఉన్నాము అని ముక్తకంఠంగా పలుకగలుగుతాము (18/73). అటుపిమ్మట మనం ఏమి చేసినా అది యీ ప్రభుని ప్రేరణను అనుసరించిన చర్యయే అవుతుంది. మనం ఏమి చేసినా ఏమి చేయనివారమూ నిర్లేపులమూ అవుతాము. ఇదియే భగవద్గీతలో వ్యక్తం అయ్యే పరమనైష్కర్మ్యసిద్ధి విధం. ఈ సిద్ధిని పొందినవారిని ఉద్దేశించియే భగవానుడు వారు సమస్త లోకసంహారం కావించినా ఏమి చేసినా వారు చేసినట్లు కాదని తెలిపియున్నాడు(18/17). అట్టివారు భగవానుని చేతియంత్రముల వంటి వారు అయిపోతారు.

(6)

కురువృద్ధుడైన భీష్మపితామహుడు కూడ ఆ విధముగా భగవానుని చేతియంత్రం అయినవాడే. అతడు అర్జునుని బాణములచేత మర్మాహతుడై అంపశయ్యమీద పడియుండి స్వేచ్ఛామరణసామర్థ్యం కలవాడైన కారణంచేత ఉత్తరాయణ పుణ్యకాలంకోసం నిరీక్షిస్తూ ఉన్నాడు. యుద్ధం ముగిసి, ధర్మరాజు యుధిష్ఠిరునకు రాజ్యపట్టాభిషేకం జరిగిపోయింది. అప్పుడు ఒకనాడు శ్రీకృష్ణుడు పాండవులను అందరినీ వెంటపెట్టుకొని వారికి భీష్ముని చేత ధర్మోపదేశం చేయించడం కోసం కురుక్షేత్రానికి తీసుకొనివస్తాడు.

శ్రీకృష్ణపరమాత్మరాకను చూచి భీష్ముడు సంతోషంతో పులకించి ప్రేమాతిశయంతో భగవానుని స్తుతింపమొదలుపెట్టాడు. శ్రీకృష్ణుడు కూడ ఆ భీష్ముని ఎంతగానో కొనియాడుతూ -

"అముం చ లోకం త్వయి భీష్మ యాతే జ్ఞానాని సంక్ష్యంత్యఖిలేన వీర"

(శాంతి. 51/17)

"ఓయి వీరవరా! దేహత్యాగం చేసి నీవు ఈ లోకాన్ని వీడుటతోడనే జ్ఞానాలు అన్నీ వీడిపోతాయి కాబట్టి యిప్పుడు పాండవులకు ఒకింత జ్ఞానోపదేశం చేయుము" అని అతనిని కోరుతాడు.

అప్పుడు భీష్ముడు ఇలా అంటాడు - "ప్రభూ! నా మనస్సు ఇప్పుడు బాణాల పీడ కారణంగా భిన్నమై ఉంది. నాలోని ప్రతిభాశక్తి లోపించి పోయింది. నాకు ప్రత్యంగమూ వేదనాగ్రస్తమై యుంది. వాక్కు రుద్ధమై పోయింది. ఈ పరిస్థితిలో నేను ఏమి ఉపదేశం చేయగలను? నాకు ఇప్పుడు దిక్కుల పరిజ్ఞానం కూడలేదు. నేను కేవలమూ మీ శక్తివలననే జీవించియున్నాను. కాబట్టి స్వామీ! మీరే పాండవులకు ఏదైనా ఉపదేశం చేయండి. నన్ను క్షమించి విడిచిపెట్టండి! కారణం ఏమిటంటే శాస్త్రాలకు అన్నిటికీ ఉద్గమస్థానం మీరే. మీ ముందు మాటలాడడానికి బృహస్పతికి కూడ సంకోచమే కలుగుతుంది. ఇతరుల విషయం వేరుగా చెప్పనేల? గురువు చెంతనుండగా శిష్యుడు ఉపదేశం చేయలేడుకదా! అలాగే మీరు ఎదుట ఉండగా నేను ఏమి ఉపదేశం చేయగలను? (శాంతి. 3/13)

ఈ మాటలు విన్నవెంటనే భగవానుడు భీష్మునకు ఇక గ్లాని, మూర్ఛ, తాపమూ, వేదన, ఆకలి దప్పిక ఏవీ కలుగకుండునట్లు వరం ఇచ్చాడు. తనకృపవలన సమస్త జ్ఞానాలూ అతని స్ఫురణలో ఉంటాయని, బుద్ధి నిరంతరం సత్త్వగుణంలో నెలకొని ఉంటుందని కూడ మాట యిచ్చాడు.

తతస్తే వ్యాససహితాః సర్వ ఏవ మహర్షయః,
ఋగ్యజుస్సామసహితైర్వచోభిః కృష్ణమార్చయన్,
తతస్సర్వార్తవం దివ్యం పుష్పవర్షం నభస్తలాత్,
పపాత యత్ర వార్ష్ణేయః సగాంగాయః సపాండవః.

(శాంతి. 52/22,23)

అప్పుడు వ్యాసాది మహర్షులు ఎందరో అక్కడ చేరియున్నారు. వారందఱూ భగవానుని వేదమంత్రాలతోనూ, స్తోత్రాలతోనూ స్తుతించారు. ఆకాశంనుండి ఆ పరమపురుషుని మీద ఎల్ల ఋతువుల పుష్పాలు వర్షించాయి.

ఆ మఱునాటి నుండి భీష్ముడు ఉపదేశం ఆరంభించాడు. శ్రీకృష్ణుని దయవలన అతని తాపమూ, మోహమూ, అలసట, వేదన తీరిపోయాయి.

శ్లో॥ దాహో మోహః శ్రమశ్చైవ క్లమో గ్లానిస్తథా రుజా, ।
తవ ప్రసాదాద్ వార్ష్ణేయ సద్యః ప్రతిగతాని మే. ॥

(శాంతి. 54/17)

అతని వాక్కు పటిష్ఠం అయింది. మనస్సు సబలం అయింది. అప్పుడు అతడు వర్ణాశ్రమధర్మాలు, రాజధర్మాలు, ఆపద్ధర్మాలు, మోక్షధర్మాలు, శ్రాద్ధధర్మాలు, దానధర్మాలు, స్త్రీ ధర్మాలు మొదలైన అనేక ధార్మికవిషయాలను గూర్చి ఎడతెగకుండ ఎన్నో దినములవరకు ఉపదేశం చేసాడు. కడకు మహానుభావుడైన ఆ భీష్ముడు సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించిన మీదట శ్రీకృష్ణుని సమక్షంలో యోగబలంతో దేహత్యాగం చేసి దివ్యలోకమునకు వెడలిపోయాడు. ఆ సమయంలో దేవతలు దుందుభులు మ్రోగించారు. ఆకాశమునుండి పూలవానలు కురిసాయి. పాండవులు యథావిధిగా అతనికి ఔర్ధ్వదైహిక సంస్కార విధులను ఆచరించారు.

(7)

ఈ విధంగా ధర్మరాజును హస్తినాపురరాజ్యానికి అధిపతిని గావించి శ్రీకృష్ణ భగవానుడు ద్వారకకు మఱలి వచ్చాడు. తిరిగి వస్తున్నప్పుడు అతనికి త్రోవలో మహాతేజశ్శాలియైన ఉత్తంకుడు ఎదురయ్యాడు. అతడు గొప్ప మహర్షి. శ్రీకృష్ణుని నోట కౌరవుల నాశనవార్త విని అతనికి ఎంతగానో ఆగ్రహం కలిగింది. అప్పుడు అతడు - "శ్రీకృష్ణా! కౌరవులు నీకు ప్రేమ పాత్రులైన బంధువులు, సమర్థుడవై యుండియు నీవు వారిని రక్షింపక ఊరకున్నావు. నీవు వారిని బలవంతముగా యుద్ధమునుండి నిరోధింపక తటస్థవైఖరి వహించావు. అందుచేత నేను నిన్ను శపిస్తున్నాను". అని పరుషోక్తులు ఆడాడు. అప్పుడు శ్రీకృష్ణుడు - "మహాత్మా! ఏ పురుషుడును కూడ తన తపోబలముతో నన్ను తిరస్కరింపజాలడు. కాబట్టి మీరు మీ

క్రోధమును ఉపసంహరించుకొనుడు. మీరు మహాతపోధనులు, గురుభక్తి పరాయణులు అని నేను ఎరుగుదును. అందుచేతనే నేను మీ తపశ్శక్తిని హరింపక మిమ్ము విడిచిపెట్టుచున్నాను" అని బదులు చెప్పాడు. అనంతరం అతడు ఆ ఉత్తంకునిపై దయ వహించి అతనిలో ఇలా అన్నాడు - "మహానుభావా! ఈ సమస్త ప్రాణికోటిని సృష్టించువాడను, సంహరించువాడను కూడ నేనే, యుగపరివర్తనం సంభవించినప్పుడు నేనే అప్పుడప్పుడు ప్రజాక్షేమం కోరి వేఱువేఱు యోనులలో జన్మించి ధర్మసంరక్షణం చేస్తూ ఉంటారు, ఎప్పుడు ఏ యోనిలో ఆవిర్భవింతునో అప్పుడు ఆ యోనికి అనుగుణంగా వ్యవహరిస్తూ ఉంటాను. ఇప్పుడు నేను మానవయోనిలో ఆవిర్భావమును అందియున్నాను. కావున మానవుని వలె వ్యవహరిస్తున్నాను. మానవునివలె నేను దీనంగా "సంధికి ఒప్పుకోడి" అని కౌరవులను అర్థించాను. వారికి భయమును చూపేను. అయినను మోహగ్రస్తులై యున్న కారణంగా వారు నా మాటలను లెక్క చేయలేదు. అందుచేతనే వారందరూ నిహతులు అయ్యారు. అయినను యుద్ధములో మరణించినవారు అగుటచేత వారికి ఉత్తమగతి ప్రాప్తించినది. (అశ్వమేధికపర్వం. 54/15-21) ఈ మాటలు విని ఉత్తంకుడు హర్షం పొందాడు. అతడు కోరగా శ్రీకృష్ణుడు అతనికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. అనంతరం ద్వారకకు మరల వచ్చాడు.

(8)

ఉత్తంకుని క్రోధానికి గుఱియైన విధంగానే శ్రీకృష్ణుడు ఒకసారి గాంధారి కోపమునకు కూడ గురి కావలసి వచ్చింది. యుద్ధం ముగిసిన పిమ్మట ఆ యుద్ధంలో మరణించిన వారికి దహనసంస్కారములు జరపడానికి, వారికి తర్పణాలు వదలడానికి ధృతరాష్ట్రుడు పాండవులను, గాంధారి, కుంతి, ద్రౌపది మున్నగు కురువంశమువారైన స్త్రీలను ఎల్లరను వెంట బెట్టుకొని కురుక్షేత్రపు యుద్ధభూమికి చేరాడు. అక్కడ వారు అందరూ నేలమీద పడియున్న తమ బిడ్డలు, సోదరులు, భర్తలు, తండ్రులు మున్నగువారి శవాలను, వారి మాంసమును పీకుకొని తినుచున్న వివిధ పశుపక్ష్యాదులను చూచిరి. ఆ భయంకర దృశ్యం చూచి కురువంశమువారైన ఆ స్త్రీలు ఎల్లరును తెలివి తప్పి పడిపోయారు. ఉండి ఉండి హాహాకారాలు చేయసాగారు.

పతిపరాయణురాలైన గాంధారి కూడ శోకావేగాన్ని సైపలేక నేలమీదకు వాలిపోయింది. కొంత తడవు అయిన మీదట ఆమె తెలివిలోనికి వచ్చి రోషావేశాలతో ఎరుపెక్కిన నేత్రాలతో శ్రీకృష్ణుని వంకకు చూస్తూ ఇలా పలికింది - "శ్రీకృష్ణా! నీవు తలచుకొంటే యీ నరసంహారకాండను నిరోధింపగలవాడవే. సమర్థుడవై యుండి కూడ నీవు నిరోధింపక ఉపేక్షవహించావు. కావున ఇంతకాలమూ పతిసేవ చేసి నేను సాధించుకొన్న తపస్సు యొక్క ప్రభావంతో నిన్ను శపిస్తున్నాను. ఈనాడు కౌరవనాశనాన్ని ఉపేక్షించిన విధంగానే నీయాప్త బంధుజనవర్గము విషయంలో కూడ ఉపేక్ష వహించి వారి నాశనానికి కారణభూతుడవు అయ్యేదవు గాక! నేటినుండి ముప్పది అయిదు ఏండ్లు గడచిన మీదట ముప్పది ఆరవ యేట నీ సజాతీయులైన మంత్రిపుత్రాదులు ఎల్లరూ అంతరించిపోగలరు. నీవు కూడ స్వయంగా వనంలో సంచరిస్తూ ఉన్నవేళ ఒక సాధారణమైన అపాయముచేత అనాథునివలె హతుడవయ్యేదవు గాక! నాడు నీ యీ దశను జనులు కూడ ఎరుగలజారు".

ఈ మాటలువిని శ్రీకృష్ణుడు ఊరకున్నాడు. అతడు తలచుకొంటే ఆగాంధారి శాపాన్ని కూడ వమ్ము చేయగలవాడే. కాని అతడు అట్లు చేయలేదు. కారణం ఏమంటే యాదవవంశనాశనం అతనికి అభీష్టమైనది. మహాభారతయుద్ధంతో అతని అవతారలక్ష్యం అయిన భూభారహరణ కార్యక్రమమంతా ఒకింత శేషంతో పూర్తి అయింది. యాదవ సంహారం కూడ చేయించి అతడు ఆ నరసంహారయజ్ఞాన్ని పూర్తి చేయవలసి ఉంది. కాని అతడు సజీవుడై యుండగా ఎవ్వడూ యాదవులకు ఎలాటి అపాయమునూ గలిగింపలేడు. అందుచేతనే అతడు గాంధారి యిచ్చిన శాపాన్ని నిమిత్తం గావించి పరస్పరం యుద్ధంలో స్వంతబంధుజనవర్గాన్ని అంతమొందించడం ఉచితమని భావించాడు. ఆ భావన కారణంగానే అతడు అసాధారణ పాతివ్రత్యనిష్ఠతో కూడబెట్టుకొన్న గాంధారియొక్క తపశ్శక్తిని గౌరవించి ఆమె యిచ్చిన శాపాన్ని సంతోషంగా స్వీకరించాడు. (స్త్రీ పర్వ. 25/48-50) సమయం ఆసన్నం కాగా చూచి పరస్పర యుద్ధదశను కల్పించి యాదవవంశాన్ని అంతనూ అంతరింపజేసాడు.

(9)

ఈ విధంగా తన అవతారలక్ష్యం నెఱవేరడంతో భగవానుడు తన లోకానికి వెడలిపోవుటకు నిశ్చయించుకున్నాడు.

"స సంనిరుద్ధేంద్రియవాఙ్మనాస్తు శిశ్యే మహాయోగముపేత్య కృష్ణః"

(మౌసల **4-21**)

గాంధారి యిచ్చిన శాపాన్ని సఫలం చేయడంకోసం అతడు ఇంద్రియాలను, వాక్కును, మనస్సును నిరోధించుకొని సమాధిస్థితిని పొందాడు. ఆ సమయంలోనే ఆ పరమపురుషుని ప్రేరణ చేతనే 'జర' అను పేరుగల ఒకవేటగాడు తాను వేటాడదగిన లక్ష్యాన్ని అన్వేషిస్తూ ఆ ప్రాంతానికి వచ్చాడు. అతడు మృగము అన్న భావంతో నిశ్చేష్టుడై పడియున్న శ్రీకృష్ణుని అఱికాలిమీద బాణప్రయోగం చేసేడు. చెంతకు చేరి చూడగా అతనికి తన తప్పిదం తెలియవచ్చింద. అప్పుడు అతడు భయకంపితుడై శ్రీకృష్ణుని పాదాలు పట్టుకొని పరితపించాడు. అంతట శ్రీకృష్ణుడు వానిని ఊరడించి తన అనుపమాన ప్రభాపుంజములు భూనభోంతరాళములందు విస్తరిల్లుచుండగా తన దివ్యధామమునకు వెడలిపోయెను. ఆ సమయంలో ఇంద్రుడు, అశ్వినీదేవతలు, రుద్రుడు, ఆదిత్యులు, వసువులు, విశ్వేదేవులు, మునులు, సిద్ధులు, అచ్చరమచ్చెకంటులు, ప్రముఖ గంధర్వగణము మున్నగువారు అందరూ అతనిని తోడ్కొని పోవుటకు ఎదురుగా వచ్చారు. (మౌసల. **4/22-26**) ఈ విధముగా శ్రీకృష్ణపరమాత్మ జగత్కల్యాణకారణములూ, పరమపావనములూ అయిన తనదివ్య చరితలతో భక్తులను ఆనందభరితులను గావిస్తూ దుష్టులను సంహరించే నెపంతో వారిని ఉద్ధరిస్తూ తన అవతారలీలను పరిసమాప్తం చేసాడు.

అక్కడ పాండవులు యాదవుల నాశన వార్తను, శ్రీకృష్ణుని పరమధామగమనవార్తను ఆలకించి యెంతయో విలపించారు. వారు కూడ అభిమన్యుని కుమారుడు, తమ మనుమడు అయిన పరీక్షిత్తును రాజ్యసింహాసనం మీద ప్రతిష్ఠించి, ధృతరాష్ట్రతనయుడైన యుయుత్సుడు అనువానిని అతనికి అండగా నిలిపి హిమాలయాలకు పయనమై వెళ్ళారు.

క్రమంగా వారు హిమాలయాలను అధిగమించి మేరుపర్వతం దిక్కుగా పయనం సాగిస్తూ ఉండగా మార్గమధ్యంలో ఆయువు సమాప్తం అయిన కారణాన ద్రౌపది, నకులుడు, సహదేవుడు, భీముడు, అర్జునుడును నేల గూలి అసువులను బాసారు. అటుపిమ్మట ధర్మరాజు ఒక్కడూ ఒక కుక్కను వెంట బెట్టుకొని ముందునకు సాగి సశరీరంగా స్వర్గం చేరాడు. అక్కడతడు దేవనదియైన గంగలో స్నానమాచరించి అచ్చటనే తన మానవశరీరాన్ని పరిత్యజించి దివ్యదేహం ధరించి భగవానుని పరమధామానికి వెడలిపోయాడు. అక్కడ అతడు పరబ్రహ్మస్వరూపం (చిన్మయశరీరము) దాల్చి వెలుగొందుచున్న శ్రీకృష్ణపరమాత్మను సందర్శించాడు. ఆ సమయంలో శంఖము, చక్రము మొదలైన ఆయుధాలు పురుషరూపాలను దాల్చి ఆ స్వామిని సేవిస్తూ ఉన్నాయి. తేజశ్శాలి, వీరవరుడూ అయిన అర్జునుడు కూడ ఆ దేవుని సేవలో యున్నాడు.

ఇది శ్రీకృష్ణుని స్వరూపం. ఇది ఆ దేవుని శరణుపొంది పొచ్చెములేని నిజమైనభక్తితో అతనిని నమ్మి భజించుటవలన కలిగిన పరమోత్తమ ఫలము. శ్రీకృష్ణుడు నిత్యుడు. నేడు కూడ అతడు తన భక్తుల ముందు సాక్షాత్కరించి, వారితోడ క్రీడించి వారికి అమందానందాన్ని అందిస్తూ ఉన్నాడు. తలచుకొంటే మనం కూడ ఆ పరమపురుషుని అభయ చరణారవిందాలను ఆశ్రయించి శాశ్వతంగా అభయులం కావచ్చును. శ్రీకృష్ణపరమాత్మకు జయమగుగాక!

మహాత్ముడైన భీష్ముడు

మహానుభావుడైన భీష్ముడు కురువంశపు మహారాజైన శంతనుని కుమారుడు. ఇతని తల్లి గంగాదేవి. వసువులు అనబడు దేవతలలో తొమ్మిదవవాడైన "ద్యౌ" అను వసువే వసిష్ఠమహర్షి విధించిన శాపం కారణంగా భీష్ముని రూపంలో అవతరించాడు. ఇతడు కుమారుడుగా ఉన్నప్పుడే సాంగోపాంగంగా వేదావిద్యలను అభ్యసించాడు. అస్త్రవిద్యను కూడ అలవరచుకొన్నాడు. ఈ విద్యను అభ్యసించే కాలంలో ఇతడు తన బాణప్రయోగప్రభావం చేత గంగా ప్రవాహాన్ని కూడ నిరోధించగలిగేడు. చిన్ననాట జనులు ఇతనిని దేవవ్రతుడు అని పిలిచేవారు.

ఒకనాడు శంతనుమహారాజు వనంలో తిరుగాడసాగాడు. అప్పుడు అతని దృష్టి అందాల రాశియైన ఒక కన్నియమీద పడింది. ఆమె ఒక దాశరాజు కుమార్తె. ఆమె పేరు సత్యవతి. మహారాజు ఆమెను మోహించాడు. ఆమెను పెండ్లియాడ నిర్ణయించుకొన్నాడు. నిజమునకు సత్యవతి ఒక రాజకుమారి. విధివశమున ఆమె దాశరాజు (చేపలను పట్టువారి నాయకుడు) గృహంలో పెరిగింది. ఆమెను తనకు ఇచ్చి పెండ్లి చేయుమని మహారాజు దాశరాజును కోరాడు. ఆమెకు పుట్టిన బిడ్డకే రాజ్యాధికారం అప్పగించడానికి సమ్మతిస్తే తన కొమరితను ఇస్తానని దాశరాజు బదులు చెప్పాడు. మహారాజు అతని కోరికను కాదనలేకపోయాడు. ఆ కన్యను మఱవ లేకపోయాడు. ఆమెను పొందలేని కారణంగా కలిగిన దిగులుతో అతడు ఉదాసీనంగా ఉండసాగాడు. అతని ఉదాసీనతకు కారణం తెలిసికొని దేవవ్రతుడు తాను స్వయంగా దాశరాజు చెంతకు అరిగి తన తండ్రికి కన్యను ఇమ్మని అతనిని అర్థించాడు. అతడు విధించిన నిబంధనపై తన సమ్మతిని ఎఱిగించి అందరి సమక్షమందు ఆ సత్యవతి కడుపున పుట్టినవాడే తమకు మహారాజు కాగలడని శపథం చేసాడు. అయినా దాశరాజు సంతుష్టుడు కాలేదు. దేవవ్రతుడు చేసిన శపథం చెల్లినా భావికాలంలో అతనికి పుట్టిన బిడ్డకు రాజ్యాధికారము సంక్రమించి పోగలదని దాశరాజు సందేహించాడు.

బుద్ధిమంతుడైన దేవవ్రతుడు అతని సందేహమును అర్థం చేసుకొన్నాడు. వెంటనే అతడు అక్కడనే దాశరాజా! నేను పెండ్లియే చేసుకోను. ఆజీవనమూ బ్రహ్మచారిగా ఉండిపోతాను అని మఱియొక కఠోరప్రతిజ్ఞ గావించాడు. ఆ ప్రతిజ్ఞ ఆలకించి దేవతలు అతనిపై పుష్పవర్షం కురిపించేరు. నాటినుండియూ జనులు అతనిని భీష్ముడు అని పిలవడం మొదలుపెట్టారు. భీష్ముడు సత్యవతిని తీసికొనిపోయి తన తండ్రికి అప్పగింగాడు. భీష్ముడు కావించిన యీ కఠోరశపథమును ఎఱిగి శంతనుడు ఎంతయో సంతసించాడు. అతడు తన కుమారునకు స్వేచ్ఛామరణాన్ని వరంగా ఇచ్చాడు. ఈ విధంగా భీష్ముడు తన జీవనం యొక్క ఆరంభకాలమందు తన తండ్రి కోర్కెను సఫలం చేయడంకోసం లోకం ముందు అపూర్వమూ, అలౌకికమూ అయిన త్యాగాదర్శాన్ని నెలకొల్పాడు. అతని అనంతరం రెండు పురుషాంతరాల కాలం తర్వాత ఏరాజ్యం కోసం అతడు జీవించి యుండగానే అతని పుత్రపౌత్రాదుల నడుమ దారణమారణహోమం అనదగిన మహాయుద్ధం సాగిపోయిందో దానినే అతడు తన తండ్రియొక్క ఒక చిన్న కోరికను ఫలింపజేయడంకోసం తృణప్రాయంగా పరిత్యజించివేసాడు. ఏ కామినీ కాంచనాలకోసం భీకరనరసంహారకాండలు సాగిపోయినట్లు, రాజ్యాలకు రాజ్యాలే అంతరించిపోయినట్లు ప్రపంచచరిత్ర సాక్ష్యం చెపుతూ ఉందో వానినే అతడు గడ్డిపరకవలె పరిత్యజించి పరాకాష్ఠను చేరిన ఒక విరక్తమహాపురుషునివలె వ్యవహరించాడు. అతని పితృభక్తి యెంతయో ప్రశంసనీయం అయినది.

సత్యవతి కడుపున శంతనునకు ఇరువురు కుమారులు కలిగారు. వారిలో పెద్దవాడు చిత్రాంగదుడు. రెండవవాడు విచిత్రవీర్యుడు. చిత్రాంగదుడు చిన్నవాడుగా ఉన్నప్పుడే శంతనుడు పరలోకగతుడు అయ్యాడు. అప్పుడు చిత్రాంగదుడు రాజు అయ్యాడు. కాని అతడు అనతికాలంలోనే గంధర్వులతో సాగిన యుద్ధంలో నిహతుడు అయ్యేడు. అప్పటికి విచిత్రవీర్యుడు ఇంకను చిన్నపిల్లవాడు. అందుచేత అతడు రాజై భీష్ముని పర్యవేక్షణలో రాజ్యపాలనం చేయసాగాడు. కొంతకాలం గడచిన తర్వాత అతనికి పెండ్లి చేయవలెను అన్న భావన భీష్మునకు కలిగింది. ఆదినములలో కాశీరాజు కొమరితలకు

ముప్పురకును స్వయంవరం జరగనున్నట్లు భీష్మునకు తెలియవచ్చింది. అంతట అతడు ఒంటరిగానే రథారూఢుడై కాశీకి చేరుకున్నాడు. అక్కడ అతడు తన సోదరునికోసం ఆ రాజకన్యలను ముప్పురునూ బలవంతంగా హరించి రథముపై నెక్కించుకొని హస్తినాపురానికి తీసుకొని వచ్చేడు. ఆ సమయంలో స్వయంవరంకోసం వచ్చిన రాజన్యులు అందరూ కలిసి అతనితో పోరి అతనిని నిరోధించుటకు యత్నించారు. కాని వారి ప్రయత్నం సాగలేదు. భీష్ముడు తాను ఒక్కడే వారితో అమిత పరాక్రమంతో పోరాటం సాగించి వారిని అందరూ పరాజితులను గావించేడు. మఱియు తాను తీసుకొని వచ్చిన కన్యలను ముప్పురను విచిత్రవీర్యునకు అప్పగించాడు. ఈ విధంగా అతడు ఆనాడు ప్రప్రథమంగా తన లోకోత్తర పరాక్రమాన్ని అస్త్రవిద్యానైపుణ్యాన్ని లోకానికి ఎఱుగజేసేడు.

భీష్ముడు తీసుకొనివచ్చిన కన్యలలో అంబ అనునది పెద్దది. ఆమె మానసికంగా సాళ్వుడు అనురాజును ప్రేమించియున్నది. ఆ విషయమును ఎరిగి భీష్ముడు ఆమెను సాళ్వుని కడకు పంపివైచి మిగిలిన యిరువురితోడను విచిత్రవీర్యునకు వివాహం చేసాడు. కాని ఆ విచిత్రవీర్యుడు అల్పాయుష్కుడు. వివాహానంతరం అతడు క్షయవ్యాధికి గురియై కొద్ది కాలంలోనే దివంగతుడు అయ్యాడు. అతనికి సంతానం కలుగలేదు. తత్కారణంగా కురువంశం అంతరించిపోయే ప్రమాదం ఎదురయింది. ఆ సమయములో తలచుకొంటే భీష్ముడు రాజ్యాధికారం చేపట్టగలవాడే. ప్రజలు కూడ అతనికి అనుకూలంగానే ఉన్నారు. వంశరక్షణం కోసం పెండ్లి చేసుకోవాలి అని అనుకుంటే అతనికి ఇప్పుడు ఏ అవరోధమూ లేదు. అయినా అతడు ఏ ప్రలోభనానికీ లోబడలేదు. ఏ ఆవశ్యకతయూ అతనిని శపథమునుండి విచలితుని గావింపలేదు. సత్యవతి తండ్రియగు దాశరాజు తాను ముందు చేసిన ప్రతిజ్ఞను రెట్టిస్తూ అతడు ఒకనాడు ఇలా అన్నాడు - "నేను త్రిలోకాధిపత్యమును, బ్రహ్మపదవిని, కడకు మోక్షాపేక్షను కూడ విడువగలను. కాని సత్యాన్ని మాత్రం విడువలేను. పంచభూతాలూ తమతమ గుణాలను విడిచిపెట్టినా, చంద్రుడు తన శీతలత్వాన్ని విడనాడినా, కడకు ధర్మరాజు స్వధర్మాన్ని పరిత్యజించివైచినా నేను మాత్రము నా సత్యప్రతజ్ఞతను కలలో కూడ విడిచిపెట్టను." "పాఠకులారా! చూచితిరి కదా! ప్రతిజ్ఞాపాలనం అంటే ఇలా ఉండాలి."

ఇంక అంబగతి యేమైనది? అన్నది ప్రశ్న. భీష్ముని చెఱనుండి విముక్తురాలై యామె సాళ్వుని చెంతకు అరిగిననూ ఆమెను అతడు స్వీకరించలేదు. ఆమె ఉభయభ్రష్టురాలు అయింది. సిగ్గుతో ఆమె తండ్రి దగ్గఱకు పోలేకపోయింది. తన యీ దురవస్థకు కారణం భీష్ముడే అని తలచి యామె అతనిని నిందింపసాగింది. ఎట్టులైన అతనికి ప్రతీకారం చేయాలని ఆమె ఆలోచించడం మొదలుపెట్టింది. తన మాతామహుడూ, రాజర్షి అయిన హోత్రవాహనుడు పురికొల్పగా ఆమె జమదగ్ని తనయుడైన పరశురాముని శరణువేడింది. తన దుఃఖకారణాన్ని అతనికి తెలియజెప్పింది. భీష్ముడు పరశురాముని శిష్యుడు. అతడు పరశురాముని వద్ద అస్త్రవిద్యాభ్యాసం చేసియున్నవాడు. అందుచేత పరశురాముడు భీష్ముని తన దగ్గఱకు కురుక్షేత్రమునకు రావించి అతనితో ఇలా అన్నాడు - భీష్మా! ఈమెను స్పృశించి బలవంతంగా కొనితెచ్చి అపవిత్రురాలిని గావించావు. ఆ కారణంగా సాళ్వుడు ఈమెను స్వీకరించలేదు. కావున నీవే యీమెను విధిపూర్వకంగా పెండ్లియాడాలి. గురువు పలికిన యీ మాటలకు భీష్ముడు అంగీకరించలేదు. అతడు పరశురామునితో - "గురువర్యా! తాను సాళ్వుని ప్రేమించి అతనిదానను అయితినని ఆమెయే నాతో చెప్పినది. అట్టి పరిస్థితిలో ఆమెను ఎట్లు నిలుపగలను? హృదయమును పరునకు అర్పించుకొన్న పడతిని ధర్మదృష్టి గల పురుషుడు ఎవడైన తన చెంత ఎట్లు నిలిపికొనగలుగును?" అని ప్రతివాదం చేసాడు. అంతట పరశురాముడు క్రోధావేశంతో మండిపడుచు - "భీష్మా! ఇంతకు ముందు నేను ఇరువది యొక్క మారులు ఈ భూమండలమును అంతనూ క్షత్రియ రహితముగ జేసినవాడనని నీవు వినలేదా?" అని బిగ్గరగా ఉరిమిచూచాడు. "అప్పటికి నేను జన్మించియుండలేదు గురువరేణ్యా!" అని భీష్ముడు మఱల బదులు పలికాడు. ఆ మాటలు విని పరశురాముడు అట్లయిన యుద్ధానికి సన్నద్ధుడవుకావలసినది! అన్నాడు. అది మొదలు ఆ గురుశిష్యుల నడుమ ఇరువది మూడు దినముల వఱకు భయంకరయుద్ధం సాగింది. కాని అందు ఎవరూపరాజితులు కాలేదు. కడకు దేవతలు, మునులును వారికి నచ్చజెప్పి వారిచేత యుద్ధం విరమింపజేసారు. ఈ విధంగా భీష్ముడు తన గురువగు పరశురాముని మాటను కూడ తిరస్కరించి తన శపథమును

నిలిపికొన్నాడు. తన యద్భుతపరాక్రమంతో పరశురామునివంటి అద్వితీయ ధనుర్ధారిని కూడ ఎదిరించి నిలువరించగలిగాడు. సత్యప్రతిజ్ఞాపాలనకూ, మహావీరత్వానికి ఇంతకంటె పరాకాష్ఠ వేఱేమి యుండును?

మహాభారతయుద్ధంలో కౌరవపక్షానికి చెందిన యోధులలో అగ్రగణ్యుడు ఒక్క భీష్ముడు మాత్రమే. ఆ కారణంగా ప్రప్రథమసైన్యాధిపతి గౌరవము అతనికే దక్కినది. పాండవులకు, కౌరవులకు పితామహుడైన కారణంగా అతనికి ఆ యిరువర్గములవారియందును ప్రేమాదరాలు,సానుభూతి సమానంగా ఉండేవి. అతడు ఆ యిరు పక్షాలవారి క్షేమాన్ని సమానంగా ఆకాంక్షించేవాడు. అయినా ధర్మమూ, న్యాయమూ పాండవుల పక్షాన ఉందని యెఱిగి అతడు వారియెడల విశేషాదరాన్ని, సానుభూతిని ప్రదర్శించేవాడు. మనసారా వారి విజయాన్ని అభిలాషించేవాడు. అయినా యుద్ధంలో మాత్రం వారియెడ పక్షపాతబుద్ధిని ఈషణ్మాత్రమూ వహింపక ప్రాణాలను ఒడ్డి వారిని గెలవడానికి ప్రయత్నించేవాడు. మహాభారతయుద్ధం **18** దినములు సాగింది. అందు **10** దినముల వరకు అతడే కౌరవులు సేనానాయకత్వం వహించాడు. ఆ పది దినాలలోనూ అతడు పాండవపక్షమువారిని ఎందఱో వీరులను, సైనికులను సంహరించాడు. యుద్ధంలో అర్జునుని ప్రాణరక్షణ కోసం సైతం తాను శస్త్రం చేత ధరించువాడను కానని శపథం చేసిన శ్రీకృష్ణుడు కూడ అతని ప్రతాపాన్ని నిరోధించుటకు అతనికి ప్రతిగా రథం దిగి నిలిచి అతనిని ఎదిరించక తప్పలేదు. వృద్ధుడై యుండి కూడ యుద్ధరంగంలో అతడు ప్రదర్శించిన అద్భుతపరాక్రమం అట్టిది. అర్జునుని శక్తి క్షీణించుచుండగా చూచి ఒకమారు శ్రీకృష్ణుడు చేత చక్రం ధరించి భీష్ముని దిక్కుగా పరుగుపెట్టాడు. మరొక్క మారు కొరడాను చేతబట్టుకొని కాచికొమ్మని హుంకరించాడు. ఈవిధంగా అతడు తన భక్తుని ప్రాణరక్షణం చేస్తూ మఱియొక భక్తుని గౌరవాన్ని పెంపొందించి యిరువంకల తన భక్తవాత్సల్యాన్ని ప్రదర్శించాడు. చివరికి పాండవులు భీష్ముడు సజీవుడై యుండగా తమకు విజయం ప్రాప్తించదని యెంచుకొని అతని కడకు అరిగి అతని మరణానికి ఉపాయం ఏమిటిని అతనినే అడిగారు. అతడు దాచకుండ తన మరణోపాయం వారికి ఎఱిగించాడు. అతడు వారికి తెలియజెప్పిన ఉపాయం ఏమనగా - ద్రుపదుని

కుమారుడు శిఖండి. అతడు మొదట స్త్రీగా పుట్టి అనంతరం పురుషుడుగా మాఱినవాడు. అయినా వానిని భీష్ముడు స్త్రీగానే భావిస్తున్నాడు. అటు స్త్రీయు, ఇటు పురుషుడును కానివారిపై శస్త్రం ఎత్తను అన్నది అతని నియమం. కాబట్టి ఆ స్త్రీ తనతో యుద్ధం చేసే ఉద్దేశ్యంతో తన ముందునకు వచ్చి నిలిస్తే తాను వెంటనే శస్త్రసన్న్యాసం చేస్తాడు. అప్పుడు అర్జునుడు అనాయాసంగా అతనిని సంహరించగలుగుతాడు. ఇది ఆ ఉపాయం. క్షత్రియ ధర్మపాలనకూ, మహావీరత్వానికి ఇంతకుమ మించిన ఉదాహరణం వేఱుగా ఏముండును?

యుద్ధంలో మర్మాహతుడై నేలమీద కూలిపోయిన వేళ భీష్ముని శరీరములో రోమరోమాన బాణాలు నాటుకొని ఉన్నాయి. ఆ కారణంగా అతడు భూమిని తాకకుండ ఆ బాణాలమీదనే శయనించేడు. అప్పటికి సూర్యుడు దక్షిణాయనంలో ఉన్నాడు. దక్షిణాయనం మరణానికి మంచి కాలం కాదు. అందుచేత అతడు ఆ ఆయనం మాఱువఱకు ఆ అంపశయ్యమీదనే పడియున్నాడు. కారణం ఏమన తండ్రి యిచ్చిన వరం యొక్క ప్రభావంచేత మృత్యువు అతనికి లోబడి యున్నది. అతడు నేల గూలుటతోనే యుద్ధం నిలిపి వేయబడింది. కౌరవులు, పాండవులును ఆనాడు అతని చుట్టూరా నిలిచేరు. భీష్ముని శరీరం అంతా బాణపు ములుకులమీద నిలిచి ఉంది. కేవలం ఒక శిరస్సు మాత్రం అనాధారంగా వ్రేలబడి యుంది. తన తలను నిలిపికొనుటకు ఆధారం ఏదైన కల్పించండి అని అతడు తనవారిని కోరాడు. వారు మంచిమంచి దిండ్లను తెచ్చి అతనికి ముందు ఉంచేరు. కాని అవి యేవియు అతనికి నచ్చలేదు. అప్పుడు అతడు - "నాయనా! నీవు క్షత్రియ ధర్మమును ఎఱిగినవాడవు. నాకు అనుగుణమైన ఉపధానాన్ని (తలగడ) కల్పించుమా!" అని అర్జునుని కోరాడు. అర్జునుడు ఆ వీరశిరోమణి యభిప్రాయాన్ని అర్థం చేసుకొన్నాడు. వీరుల ఇంగితాలను వీరులే అర్థం చేసుకోగలరు గదా! అప్పుడు అర్జునుడు భీష్ముని శిరస్సునకు దిగువభాగాన బాణాలను నాటి దానిని నిలుపుకొనుటకు వీలుగా ఆధారాన్ని కల్పించేడు. అక్కడ దుర్యోధనుడు నిపుణులయిన వైద్యులను భీష్ముని దేహంలో నాటిన బాణాలను వెలికితీసి చికిత్స చేయడం కోసం రావించాడు. కాని ఆ చికిత్సను ఒల్లక భీష్ముడు వారిని సగౌరవంగా

వెనుకకు పంపించివేసాడు. వీరగతిని పొందియున్నతాను చికిత్స చేయించుకోవడం అవమానహేతువుగా అతడు భావించాడు. జనులు అందరూ అతని అసాధారణ ధర్మనిష్ఠను. అపూర్వసాహసాన్ని చూచి పరమాశ్చర్యం పొందారు. అంపశయ్యమీద పడియున్న ఆ దశలో కూడ అతడు యుద్ధాన్ని నిలిపివేయించుటకు, ఇరుపక్షాలలోను శాంతిని స్థాపించుటకు తన శక్తిమేరకు ప్రయత్నమూ చేసేడు. కాని అతని ప్రయత్నం ఫలించలేదు. దైవనిర్ణయమే అలా ఉన్నప్పుడు ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

దేహంమీద నాటిన బాణపు ములుకులవలన గలుగుచున్న వేదనతో భీష్ముని కంఠం శుష్కింపసాగింది. శరీరం అంతా మంట పుడుతూ ఉంది. అతడు త్రాగుటకు మంచినీరు కోరాడు. అక్కడి వారు కలశములతో నింపి శీతమూ సుగంధభరితమూ అయిన జలాన్ని సిద్ధం చేసేరు. కాని భీష్ముడు ఆ జలాన్ని స్వీకరించలేదు. ముందు అనుభవించిన మానవీయభోగాలను నేను ఇప్పుడు స్వీకరించ నొల్లను. కారణం ఏమన నేనిప్పుడు అంపశయ్యమీద పడియున్నాను అని అతడు వారితో చెప్పాడు. అప్పుడు అతడు అర్జునుని పిలిచి - "వత్సా! నాకు విధిపూర్వకముగా నీరమును అందింపుమా! అని పలికేడు. అట్లే అందింతును అని పలికి అర్జునుడు తన అమ్ములపొది నుండి ప్రకాశవంతమైన బాణం ఒకటి వెలికి తీసి దానిని వింటిపై సంధించి పర్జన్య (మేఘ) మంత్రపఠనపూర్వకంగా భీష్ముని పార్శ్వదేశమున భూమిమీద ప్రయోగించాడు. అందరూ చూచుచుండగా అప్పటికప్పుడు అక్కడ భూమినుండి దివ్యజలధార బహిర్గతమై భీష్ముని నోట పడ నారంభించింది. అమృతతుల్యమైన ఆ నీరమును గ్రోలి అతడు తృప్తి పొందాడు. అర్జునుని ఆ కృత్యాన్ని చూచి ఎల్లరూ అతనిని వేనోళ్ళ కొనియాడేరు. అప్పటినుండి భీష్ముడు అన్నపానాలను విసర్జించి బాణపు ములుకుల మూలంగా కలుగుతూ ఉన్న మర్మాంతక బాధతోపాటు ఆకలి దప్పులవలన కలుగుతూ ఉన్న దుర్భరవేదనను కూడ భరిస్తూ అవసానదివసందాక ఉండిపోయేడు. ఈ విధంగా అతడు అవక్రపరాక్రమంతో పాటు పరాకాష్ఠకు చేరిన ధైర్యాన్ని సహనాన్ని ప్రదర్శించేడు.

మహామనస్వి అయిన భీష్ముడు పితృభక్తికి, ప్రతిజ్ఞాపాలనానికి, వీరత్వానికి పరమాదర్శభూతుడు మాత్రమే కాదు. విశేషముగా శాస్త్రపరిజ్ఞానం కలవాడు,

ధర్మతత్త్వాన్ని, పరమాత్మ తత్త్వాన్ని చక్కగా ఎరిగినవాడు, గొప్ప భగవద్భక్తుడు కూడ. అతనిలో నిగూఢంగా ఉన్న జ్ఞానాన్ని పరికించి శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా భీష్మాచార్యా! నీవు ఈలోకాన్ని వీడిన వెంటనే యిచ్చట జ్ఞానభావాలు అన్నీ లోపించిపోతాయి అనీ, లోకంలో సందేహగ్రస్త విషయాలకు సమాధానం చెప్పగలవారు ఎవరూ ఉండరనీ, ఆ విషయాలకు సమాధానం చెప్పి సందేహనివృత్తి చేయుటలో నిన్ను మించినవాడు మఱియొకడు లేడని అంటూ అతనిని అతడు నిర్విరామంగా కొన్ని దినములవఱకు యుధిష్ఠిరునకు వర్ణాశ్రమధర్మాలు, రాజధర్మాలు, అపద్ధర్మాలు, మోక్షధర్మాలు, శ్రాద్ధధర్మాలు, రాజధర్మాలు, స్త్రీధర్మాలు మొదలుగా అనేక మహత్త్వ పూర్ణవిషయాలను ఉపదేశించాడు. ఆ విషయాలు అన్నీ మహాభారతంలో సాక్షాత్తూ ధర్మదేవత అంశాన జన్మించి ప్రత్యక్ష ధర్మస్వరూపుడై పరిఢవిల్లిన యుధిష్ఠిరుని ధర్మసందేహాలను నివర్తింపజేయడం అన్నది ఒక్క ఆ భీష్మునకు మాత్రమే సాధ్యం అయింది. అది అన్యులకు సాధ్యం కాదు. అతడు ఉపదేశం చేసే వేళ అతని మాటలు వినడంకోసం వ్యాసాదిమహర్షులు కూడ అక్కడ నిలిచిపోయారు."

శ్రీకృష్ణుని మహత్త్వమునకు, ప్రభావానికి సంబంధించిన జ్ఞానం ఆ కాలంలో భీష్మునియందు ఉన్నంతగా ఇతరులయందు లేదు. ఎన్నియో మాఱులు ఈ భీష్ముడు ధృతరాష్ట్రునకు, దుర్యోధనునకు శ్రీకృష్ణుని మహత్త్వాన్ని తెలియజెప్పేడు. రాజసూయయాగంలో అగ్రపూజకు అర్హుడు ఎవరు? అన్న ప్రశ్న తల యెత్తినప్పుడు నిండుసభలో ఇతడు అందులకు సర్వోత్తమ పాత్రత కలవాడు ఒక్క శ్రీకృష్ణుడు మాత్రమే అని స్పష్టరుస్తూ అతని మహత్త్వాన్ని ఉగ్గడించి అతడు సాక్షాత్తు ఈశ్వరుడని సభాసదులు తెలియజేసాడు. అర్జునుని రక్షణం కోరి చక్రం చేతబట్టి శ్రీకృష్ణుడు తన దిక్కుగా పరుగిడి వచ్చేవేళ ఇతడు ఆ పరమపురుషుని చేతిలో మరణాన్ని తన మహద్భాగ్యంగా భావించి శస్త్రాలతో పూజించనెంచియే సహర్షంగా అతనికి ఆవాహనం తెలిపాడు. ఇతడు యుధిష్ఠిరునకు ఉపదేశించిన విష్ణుసహస్రనామస్తోత్రంలో ప్రత్యక్షరంలోనూ భగవద్భక్తి, భగవత్తత్త్వపరిజ్ఞానము ప్రతిబింబితం అవుతూ ఉంటుంది. ఈనాడు కూడ భక్తలోకం ఆ విష్ణుసహస్రనామస్తోత్రంమీద పరమాదరాన్ని ప్రదర్శిశిస్తూ ఉంది. శంకర

భగవత్పాదులు భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలకు వలె ఈ విష్ణుసహస్రనామాలకు కూడ విస్తృతంగా భాష్యాన్ని రచించారు. భీష్మునకు భగవానునియందు ఉన్న భక్తికి ప్రతిఫలంగానే సాక్షాత్తూ భగవానుడగు శ్రీకృష్ణపరమాత్మ అవసానకాలంలో అతనికి దర్శనం ఇచ్చి అతనిని కృతకృత్యుని గావించాడు. ఈ విధంగా భక్తి, జ్ఞానమూ, సదాచారము మొదలైనవానిలో మనం ఏ విషయం మీదకు దృష్టిని సారిస్తే ఆ విషయంలోనే భీష్ముడు మనకు పరమాదర్శభూతుడుగా కానవస్తాడు. అతని స్థాయికి చెందిన మహాపురుషులు ప్రపంచచరిత్రలో బహుఅరుదుగా గోచరిస్తారు. అపుత్రకుడుగా మరణించినవాడైనా హిందువులలో మూడు వర్ణాలవారును ఈనాటివరకు తాము పితృతర్పణాలు చేసేవేళ ఈ భీష్మునకు కూడ తర్పణాలు అర్పిస్తూ వస్తున్నారు. ఈవిధమైన గౌరవం భారతదేశ చరిత్రలో మఱియొకనికి ఎవ్వనికిని ప్రాప్తించలేదు. ఆ కారణంగానే లోకం అంతా ఇతనికి పితామహుడని పేర్కొని గౌరవిస్తూ ఉంది. భీష్మునకు ప్రాప్తించిన సంతానరాహిత్యము గొప్పగొప్ప సంతానవంతులైనవారికి కూడ ఈర్ష్యాహేతుకమైన విషయం అయింది.

ధర్మరాజు యుధిష్ఠిరుడు

మహారాజు యుధిష్ఠిరుడు కూడ భీష్మునివలె ఉన్నతశ్రేణికి చెందిన పరమోత్తమ పురుషుడు. ఇతడు సాక్షాత్తూ ధర్మదేవత అంశాన ఆవిర్భవించినవాడు. ఇతడు మూర్తీభవించిన ధర్మదేవత అనదగినవాడు. అందుచేతనే జనులు ఇతనిని ధర్మరాజు అని పేర్కొన్నారు. ఇతనిలో ధైర్యము, స్థైర్యము, సహనము, వినయము, దయ అచంచలమైన ప్రేమ మొదలైన దివ్యగుణాలు ఎన్నో నిండియున్నాయి. ఇతడు తనలోని సౌశీల్యము, సదాచారము, వివేకస్వభావము కారణంగా చిన్ననాటనే అపరిమితమైన లోకప్రీతిని పొందాడు. ఇతడు చిన్నవాడుగా ఉన్నప్పుడే ఇతని తండ్రియు, మహాత్ముడూ అయిన పాండురాజు దివంగతుడు అయ్యాడు. నాటినుండియు ఇతడు తన పెదతండ్రియైన ధృతరాష్ట్రునే తండ్రిగా భావించి అతనియందు పరమాదరం చూపడమేకాక అతని ప్రతి ఆజ్ఞను శిరసావహించి పాలించసాగాడు. అయినా ఆ ధృతరాష్ట్రుడు తన కుటిలస్వభావం కారణంగా ఇతని సుగుణ సంపద మూలంగా ఇతనికి ప్రాప్తించిన ప్రశంసలను వినివిని లోలోపల ఈర్ష్యతో కుమిలిపోతూ ఉండేవాడు. అతని కుమారుడైన దుర్యోధనుడు నిరంతరమూ ఈ పాండవులను ఏ విధంగా హస్తినాపురానికి దూరం చేయుదునా? వారు లేనప్పుడు ఏ విధంగా వారి తండ్రి హక్కును హరించి తాను మహారాజును అయిపోదునా? అనియే నిరంతరమూ ఆలోచిస్తూ ఉండేవాడు. గ్రుడ్డివాడు, ప్రజ్ఞాహీనుడూ అయిన తన తండ్రికి చెప్పుడు మాటలు చెప్పి చెప్పి అతడు ఎట్లో పాండవులను దూరముగా పంపివేయుటకు అతనిని ఒప్పించాడు. అంతట ధృతరాష్ట్రుడు పాండవులను రావించి ఏదో తీర్థము, ఉత్సవసమారోహము చూచే తలంపు నెపంతో వారిని వారణావతం పంపనెంచినట్లు వారితో చెప్పాడు. అతని సంకల్పాన్ని ఆజ్ఞగా భావించి వారు అందులకు ఈషణ్మాత్రమూ, అసమ్మతిని తెలుపక మౌనంగా కుంతీదేవిని వెంట నిడుకొని వెంటనే వారణావతానికి వెడలిపోయారు.

వారిని అక్కడ అగ్నికి ఆహుతి చేసి వారిని నామరూపాలు లేకుండా చేయాలి అని ఆలోచించి అక్కడ వారికోసం దుర్యోధనుడు లాక్షాగృహాన్ని (లక్కయిల్లు) నిర్మింపజేసాడు. వారిని ఆయింటిలోనే ఉండుడని తండ్రిచేత వారికి ఆదేశింపజేసాడు. అనంతరం పినతండ్రియైన విదురుని సాయంతో ఆ పాండవులు అచ్చటనుండి యెట్లోప్రాణాలు దక్కించుకొని పాటిపోయి ఒక అడవిలో తలదాచుకొన్నారు. ఇక్కడ ధృతరాష్ట్రుని కొడుకులు వారణావతంలో పాండవులు మరణించారని భావించుకొని హస్తినాపుర రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకొన్నారు.

కొన్ని దినములు గడచిన మీదట ద్రౌపదీస్వయంవరకాలంలో పాండవుల రహస్యం వెల్లడి అయింది. పాండవులు ఇంకనూ సజీవులై యున్నారన్న విషయం అప్పుడు దుర్యోధనాదులకు తెలిసింది. అటు పిమ్మట ధృతరాష్ట్రుడు విదురుని పంపి పాండవులను హస్తినాపురానికి రండని పిలిపించాడు. వారికి, తన తనయులకు నడుమ సాగుతున్న కలహమును అంతరింపజేయడంకోసం అతడు సగం రాజ్యం తీసుకుని ఖాండవప్రస్థంలో ఉండుడని పాండవులకు సూచించాడు. ఆ సూచనను పరమాజ్ఞగా స్వీకరించి ధర్మరాజు తన సోదరులతోడ ఖాండవప్రస్థమునకు పోయి అచ్చట నివసింపసాగాడు. అక్కడ పాండవులు తమకోసం ప్రత్యేకంగా ఇంద్రప్రస్థం అనుపేర రాజధానిని నెలకొల్పుకొన్నారు. అక్కడనే వారు రాజసూయ యాగం చేసారు. ఆ సమయంలో గొప్పగొప్ప మహారాజులు విచ్చేసి యెన్నో బహుమూల్యములైన కానుకలను ధర్మనందనునకు అర్పించి అతనిని తమ సామ్రాట్టుగా స్వీకరించారు.

కాని ధృతరాష్ట్రుని కొడుకులు పాండవులను అక్కడకూడ నిలువనీయలేదు. దుర్యోధనుడు వారి వైభవాన్ని చూచి లోలోపల ఈర్ష్యతో కనలసాగాడు. అతడు ఒక విశాలమైన సభాభవనాన్ని నిర్మింపజేసి పాండవులను జూదమాడుటకై ఆహ్వానించాడు. జూద మాడుట తగని పని అని ఎరిగి ఉండికూడ ధర్మనందనుడు ధృతరాష్ట్రుని ఆజ్ఞగా భావించి ఆ యాహ్వానాన్ని ఎంతో ఆనందంగా స్వీకరించాడు. పోయి జూదంలో పాల్గొని అక్కడ దుర్యోధనుని మామ అయిన శకుని వేసిన కపటపు టెత్తుగడలతో తన సర్వస్వాన్ని పోగొట్టుకొన్నాడు. అంతియే కాదు. అనంతరం నిండు సభలో

మహారాజ్ఞి ద్రౌపది కూడ దుర్భరమైన అవమానానికి గురిటి కావలసి వచ్చింది. అయినా ధృతరాష్ట్రుని విషయంలో ధర్మనందనునకు ఉన్న గౌరవభావం కొంచెంకూడ సడలలేదు. ధృతరాష్ట్రుడు కూడ వారి ధనము, రాజ్యము సర్వమూ వారికి తిరిగి యిచ్చివేసాడు. వారిని మఱల ఇంద్ర ప్రస్థపురానికి పంపివేసాడు. కాని ఆ చర్య దుర్యోధనునకు సమ్మతం కాలేదు. అతడు తన తండ్రి చెంతకు పోయి అతనికి వేవిధాల నచ్చజెప్పి దూతను పాండవుల కడకు పంపి వారిని మరల రావించుటకును, ఓడినవారు వనవాసం చేయునట్టి నిబంధనతో మఱల వారిని జూదంలో పాల్గొనజేయుటకును ఒప్పించాడు. యుధిష్ఠిరుడు ఒక మాఱు జూదం యొక్క దుష్పరిణామాన్ని చవి చూచాడు. కౌరవుల కుతంత్రాన్ని గుర్తించాడు. అయినా తమ పెదతండ్రి యాహ్వానాన్ని నిరాకరించలేక పోయాడు. అతడు వెనుకకు మరలివచ్చాడు. మరల జూదంలో పాలుగొన్నాడు. ఈ మాఱు కూడ అతడే పరాజితుడు అయ్యాడు. తత్ఫలితంగా అతడు మహారాజ్ఞి ద్రౌపదిని, సోదరులను వెంట బెట్టుకొని 12 ఏండ్లు అరణ్యవాసమూ, ఒక యేడు అజ్ఞాతవాసమూ చేయడంకోసం సర్వమునూ వీడి వనాలదారి పట్టవలసివచ్చింది. పిత్రాజ్ఞను పాలించు రూపంలో ఉన్న ధర్మాన్ని నిర్వహించడంకోసం అతడు ఈ దుష్పరిణామాన్ని అంతనూ మౌనంగా భరించాడు. ఆహా! అతని పితృభక్తి యెంత ప్రశంసాపాత్రం అయింది?

మహారాజు యుధిష్ఠిరుడు మీదుమిక్కిలి ధర్మభీతి, సహనశీలమూ కలవాడు. అతడు ఏది భంగమైనా భరించగలడు, కాని ధర్మభంగాన్ని మాత్రం భరించలేడు. మొదటి మాఱు జూదంలో అతడు తనను, తన సోదరులను, కడకు ద్రౌపదిని కూడ పణంగా ఒడ్డి ఓడిపోయాడు. నిండు సభలో కౌరవులు ద్రౌపదిని అవమానం పాలు చేసేవేళ పల్లెత్తు ప్రతిఘటన వచనము ఆడక మౌనముగా సర్వమూ సహించాడు. ధర్మపాశానికి కట్టుబడి ఉండడంలో అతని నిష్ఠ అట్టిది. సాధారణ మానవమాత్రుడు ఎవ్వడూ తాను చూస్తూ ఉండగా తన భార్యకు ఇట్టి దుర్గతి ప్రాప్తిస్తే ఊరకుండలేడు. అతనికి (ధర్మజునకు) వెఱచియే అతని సోదరులు అడ్డుమాటలు ఏవీ ఆడక మానసికంగా వేదనతో కుమిలిపోతూ మౌనం వహించారు. వారు తలచుకుంటే అమానుషమైన ఆ అత్యాచారాన్ని నిరోధింపగలవారే. కాని

తమ యన్నయైన ధర్మనందనుడు స్వేచ్ఛాపూర్వకంగా ద్రౌపదిని కూడ పణంగా పెట్టి ఓడిపోవడం చేత ధర్మబద్ధులై యూరకుండిపోయారు. వారి యెదుట అన్యుడు ఎవడైన ద్రౌపదివంకకు కన్నెత్తి చూడడం సంభవిస్తే వెంటనే వాని ప్రాణాలు అనంతవాయువులలో కలిసిపోయేవి. ఆ ద్రౌపదియే దురవస్థపాలు అవుతూ ఉండగా కన్నులారా చూస్తూ ఉండి కూడ వారు ఏమీ ప్రతిఘటించలేక పోయారు. కపటవర్తనంతో శకుని తమను జయించాడని ధర్మనందనుడు ఎరుగును. అయినను తన పక్షాన తాను ధర్మాన్ని పరిత్యజించడం అతనికి సమ్మతమూ కాదు. సహ్యమూ కాదు. ఈ విధంగా అతడు సర్వమూ సహించి తన సత్యాన్ని, ధర్మాన్ని సంరక్షించుకొన్నాడు. ధర్మప్రీతి, సహనస్వభావము - ఈ రెండు గుణాలకూ ఇలాంటి పరమోదాహరణం లోకంలో అన్యత్ర ఎందైన లభించునా?

రెండవమాటు జూదంలో ఓడిపోయి పాండవులు అడవులలో తిరుగాడసాగారు. ఆనాడు అందులకు హస్తినాపురప్రజలు ఎంతగానో చింతించారు. వారు కౌరవులను నిందించసాగారు. పెద్ద సంఖ్యలో వారు ఇండ్లు, వాకిళ్లు వీడి పాండవులవెంట వెడలిపోవనెంచి వారిని అనుసరించారు. అప్పుడు కూడ ధర్మరాజు కౌరవుల నుద్దేశించి నిరసనవచనం ఒక్కటి కూడ ఆడలేదు. తనను అనుసరింప వచ్చిన జనులను అనునయవచనాలతో గారవించి వెనుకకు పంపివేసాడు. అయినా పెక్కురు బ్రాహ్మణులు వెనుకకు మఱలక అతనినే అనుగమించారు. ఇంతమంది బ్రాహ్మణులు నన్ను అనుగమిస్తున్నారు. వీరికి భోజనవ్యవస్థయెట్లు అన్న చింతకూడ అప్పుడు ధర్మనందనునకు కలిగింది. అతనికి తన కష్టాలను గూర్చి చింత ఆవంత కూడ ఉండేదికాదు. పరుల కష్టాలను మాత్రం అతడు చూడలేకపోయేవాడు. కడకు అతడు సూర్యభగవానుని ఆరాధించి అక్షయపాత్రను ఒకదానిని పొందగలిగాడు. అందు పచనం చేయబడిన పదార్థం అల్పం అయినా ఆనల్పమూ అక్షయమూ అవుతుంది. ఆ పాత్ర సాయంతోనే అతడు వనంలో ఉండికూడ అతిథులు, అభ్యాగతులు అయిన బ్రాహ్మణులకు నిత్యమూ భోజనాలు పెట్టి అనంతరం తాను భుజించేవాడు. వనవాసక్లేశాలను భరిస్తూ ఉన్న కాలంలో కూడ అతడు అతిథ్యధర్మపాలనం చేసినాడు. అతనియందు వెలుగొందుతూ ఉన్న ధర్మప్రీతిచేత ఆకర్షింపబడి ఎందరో

మహర్షులు వనవాసకాలంలో అతనికడకు వచ్చి అచ్చటనే నిలిచిపోయి వివిధములైన తమ యజ్ఞాదిధర్మకర్మలను అనుష్ఠించుకొనేవారు. మహారాజు యుధిష్ఠిరుడు అజాతశత్రుడని ప్రసిద్ధిగాంచాడు. వాస్తవంగా అతనికి ఎవరితోడను వైరంలేదు. శత్రువులయెడల కూడ అతని హృదయంలో ఎల్లవేళలా సద్భావాలే కలుగుతూ ఉండేవి. అతని దృష్టిలో అతని శత్రువుకూడ అతని వలన సేవలనూ, సహానుభూతిని పొందుటకు పాత్రుడే. అపకారికి కూడ ఉపకారం చేయడమే కదా సజ్జనుని మహోన్నత లక్షణం!

"ఉమా సంత కఇ ఇహఇ బడాఈ. మంద కరత జో కరఇ భలాఈ"

ఇది తులసీదాసు చెప్పిన మాట. ఈ మాటలోని ప్రత్యక్షరమూ యుధిష్ఠిరునియందు చరితార్థం అవుతుంది. అదెట్లు అనగా - ఒకప్పుడు పాండవులు ద్వైతవనంలో ఉన్నారు. అప్పుడు దుర్యోధనుడు ఘోషయాత్ర నెపంతో తన మంత్రులను, సోదరులను, అంతఃపురస్త్రీజనాన్ని వెంట బెట్టుకొని విశాలమైన సేనతో వచ్చి పాండవులకు తన వైభవాన్ని చూపి వారిని ఏడిపించే తలంపుతో ఆ వనంలోనికి వచ్చాడు. ఆ వనంలో ఒక సరోవరం ఉంది. దాని తీరాన యుధిష్ఠిరుడు కుటీరం నిర్మించుకొని అందులో ఉంటున్నాడు. ఆ సరోవరంలోనే జలక్రీడలు సాగించు తలంపుతో దుర్యోధనుడు తనవారిని అందరను తొడ్కొని దాని తీరానికి చేరాడు. అంతకు ముందే ఆ సరోవరాన్ని గంధర్వులు చుట్టుముట్టి యున్నారు. వారితోడ దుర్యోధనునకు పోరాటం సంభవించింది. ఇరువర్గాలవారి నడుమ అత్యంత భయంకరమూ, రోమాంచకరమూ అయిన యుద్ధం జరిగింది. కడకు అందు విజయం గంధర్వులకే దక్కింది. వారు దుర్యోధనుని, అతని రాణివాసంవారిని కూడ బంధించి కొనిపోవుటకు ఉద్యమించారు. ఆ సమాచారం ధర్మనందనునకు తెలిసింది. అప్పుడు అతడు తన సోదరులను పిలిచి మీరు వెంటనే పోయి బలిమి మీర పోరి మన దుర్యోధనుని సపరివారంగా విడిపించి తీసుకొని రండు! అని వారిని ఆదేశించాడు. ఆ కౌరవరాజునకు మనం చేయవలసిన ప్రాయశ్చిత్తం గంధర్వులే చేసారు. వానిని మనం ఎందుకు విడిపించాలి? అన్న ప్రతికూలభావాన్ని అతని సోదరులు బహిర్గతం చేసారు. అప్పుడు యుధిష్ఠిరుడు వారికి ఇలా నచ్చబలికాడు - "సోదరులారా! దుర్యోధనాదులు మనకు శత్రువులే అయినా ఇప్పుడు విపద్గ్రస్తులై యున్నారు.

ఈ సమయంలో వారి అపరాధాలను పరిగణింపక వారికి సహాయం చేయడం మన ధర్మం. శత్రువులు అయిన నేమి? వారు కూడ మనకు సోదరులే కదా! మనం ఉండగా అన్యులు ఎవరైన వారికి దుర్గతిని కలిగిస్తే మనం ఎలా చూస్తూ ఊరకుండగలము? అన్న పలికిన యీ మాటలను ఆలకించి వెంటనే పోయి అర్జునుడు ఆ గంధర్వులమీద బాణవర్షం కురిపించి వారిని పరాజితులను గావించి దుర్యోధనుని, వాని సోదరులను, రాణులను వారి బారినుండి విముక్తులను గావించాడు. ధుర్యోధనుని దురుద్దేశ్యమును ఎరిగి దేవరాజైన ఇంద్రుడే అతనిని బంధించి తెచ్చుటకై అక్కడకు గంధర్వులను పంపాడు. మహారాజు యుధిష్ఠిరుని విశాలహృదయమును చూచి ఆ గంధర్వులు పరమాశ్చర్యం పొందారు. ఆహా! ఈ అజాతశత్రుతాలక్షణం ఎంత ప్రశంసనీయమైనది.

ఒకరోజు ఏమి జరిగిందంటే - ద్రౌపదిని ఆశ్రమంలో ఒంటరిగా విడిచి ఒక మాఱు పాండవులు వనంలోనికి వెళ్ళారు. ఆ సమయంలో దుర్యోధనుని బావమఱది, సింధు దేశపు రాజు అయిన జయద్రథుడు ఆ ప్రాంతానికి వచ్చాడు. అక్కడ ఉన్న ద్రౌపదియొక్క రూపలావణ్యాలను చూసి అతని మనస్సు చెదిరింది. అతడు ద్రౌపది ముందు తన కోరికను ప్రకటించాడు. కాని ఆమె అతనిని నిరసించి నిరాకరించింది. అప్పుడు అతడు ఆమెను బలవంతంగా పట్టుకొని రథంమీద కూర్చుండబెట్టుకొని తీసుకొనిపోవసాగేడు. ఆ సమాచారమును ఎఱిగి పాండవులు వడివడిగా వానిని వెంబడించి పోయి నిరోధించారు. క్షణంలో వాని సైన్యాన్ని అంతనూ తుదముట్టించారు. పాపిష్టుడైన ఆ జయద్రథుడు భయకంపితుడై ద్రౌపదిని క్రిందకు దింపివైచి ప్రాణాలను అఱచేత నిడుకొని పాఱిపోవసాగాడు. అప్పుడు భీమసేనుడు వడిగా వానిని వెంబడించి పట్టుకొని ధర్మనందనుని దగ్గరకు తీసుకొని వచ్చాడు. ధర్మనందనుడు వానిని బంధువర్గంవాడని భావించి దయతలచి విడిచిపెట్టేడు. ఈ విధంగా అతడు తనలోని అద్భుతమైన క్షమాగుణాన్ని, దయాలక్షణాన్ని వెల్లడించాడు.

మహారాజు యుధిష్ఠిరుడు గొప్ప విద్యావంతుడు, నీతికోవిదుడు, ధర్మమర్మాలు ఎఱిగినవాడు మాత్రమే కాదు. అద్భుతమైన సమతాదృక్పథం కూడ కలవాడు. ఒకప్పటి సంఘటనం ఇది. పాండవులు వనంలో ఉండగా

- ఒక బ్రాహ్మణుడు తన అరణిని, మథించే కట్టను ఒక చెట్టు కొమ్మకు వ్రేలగట్టుకున్నాడు. (యజ్ఞవిధికి వలయు అగ్నిని సృష్టించుటకు శాస్త్రనిర్దిష్టములైన రెండు కట్టెలను తెచ్చి ఒకదానితో ఒకదానిని ఒరపిడిపెడతారు. అందు ఒకదానిని అరణి అని, రెండవదానిని మంథనకాష్టము అని అంటారు.) ఆ సమయంలో ఎచ్చటనుండియో ఒకలేడి వచ్చి తన కొమ్ముమను తీట తీర్చుకొనుటకు ఆ కట్టెలకు రాచికొనడం మొదలుపెట్టింది. అప్పుడు ఆ కట్టెలు దాని కొమ్ములలో ఇరుకుకొని పోయాయి. ఆ కట్టెలతో అది పాటిపోయింది. ఆ కట్టెలు లేకపోవుటచేత తన యజ్ఞవిధికి అవరోధం కలుగునని ఎంచి ఆ బ్రాహ్మణుడు పాండవుల కడకు పోయి తన అరణిని, మంథనకాష్ఠమును తెచ్చి యిండని వారిని ప్రార్థించాడు. అప్పుడు ధర్మరాజు తన సోదరులను నలుగురను తోడ్కొని ఆ లేడి వెనుక పరుగులు పెట్టాడు. కాని ఆ మృగము చూస్తూ చూస్తూ ఉండగా కనుచూపునకు అందనంత దూరం పారిపోయింది. పరుగులు పెట్టిపెట్టి పాండవులు అలసిపోయారు. వారికి మిక్కిలి దప్పిక కలిగింది. అన్న యనుమతిని పడసి నకులుడు నీటిని వెదకుటకు వెళ్లాడు. అతనికి చేరువలో ఒక జలాశయం కానవచ్చింది. అతడు దానిని సమీపించి నీటిని త్రాగబోతుండగా "ఆగు! ముందు నా ప్రశ్నలకు సమాధానం చెప్పు! అనంతరం నీరు సేవించు!" అన్న ఆకాశవాణి వినవచ్చింది. అయినా దప్పిక అధికంగా ఉండడంచేత అతడు ఆ వాణిని లెక్కచేయక నీరు త్రాగాడు. తోడనే అతడు నిర్జీవుడై నేలమీద కూలిపోయాడు. అతని వెనుక ధర్మరాజు క్రమముగా సహదేవుని, అర్జునుని, భీమసేనుని కూడ పంపాడు. వారికి ముప్వురకును కూడ ఆ దుర్గతియే ప్రాప్తించింది. కడకు ధర్మరాజు తాను కూడ ఆ సరస్తీరానికి వచ్చాడు. అతడు నిశ్చేష్టులై పడియున్న తన నలుగురు సోదరులను చూచాడు. అతనికి కూడ ఆ ఆకాశవాణి వినవచ్చింది. అంతలో అతనికి విశాలకాయుడైన యక్షుడు ఒకడు కానవచ్చాడు. నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండ నీరు త్రాగుటచేత నీ సోదరులకు ఈ దురవస్థ ప్రాప్తించింది. నీవు కూడ వీరివలె అనధికారచేష్టకు పాల్పడితే ప్రాణాలు కోల్పోవవలసి వస్తుంది అని ఆ యక్షుడు అతనిని హెచ్చరించాడు. అప్పుడు ధర్మనందనుడు ఆ యక్షుని ప్రశ్నలకు సమాధానాలు చెప్పుటకు సన్నద్ధుడు అయ్యాడు. యక్షుడు అడిగిన ప్రశ్నలకు అన్నిటికిని

క్రమంగా సముచితరీతిని సమాధానాలు చెప్పాడు. అంతట యక్షుడు ప్రసన్నత చెంది రాజేంద్రా! నీ సోదరులలో ఎవనిని బ్రదికించుమన్న వానిని బ్రదికించెదను. ఎవనిని బ్రదికింపుమందువు? అని ధర్మరాజును అడిగేడు. ధర్మరాజు నకులుని సజీవునిగా చూడగోరాడు. కారణం ఏమని యక్షుడు అడిగాడు. అందులకు ధర్మనందనుడు - మహాత్మా! నా తండ్రికి కుంతి, మాద్రి అను ఇరువురు భార్యలు ఉన్నారు. నా దృష్టిలో వారు ఇరువురును సమానస్థితిలోనివారే. కుంతి కుమారునిగా నేను ఎట్లునూ సజీవుడనై యున్నాను గదా! అందుచేత మాద్రి కుమారుడు కూడ ఒకడు సజీవుడు కావాలి అన్నది నా ఆకాంక్ష, ఆ కారణంగానే భీముని, అర్జునుని కాదని నకులుని సజీవుని గావింపగోరితిని అని బదులు చెప్పాడు. యుధిష్ఠిరుని బుద్ధికుశలతను, ధర్మనిష్ఠను పరీక్షించడంకోసం స్వయంగా ధర్మదేవుడు ఈ లీలను సాగించాడు. ధర్మనందనుని యీ అద్భుతమైన సమతాదృక్పథాన్ని చూచి ఎంతయో సంతసించి తన నిజరూపాన్ని అతనికి ఎరుగజెప్పి ఆ ధర్మదేవుడు అతని నలుగురు సోదరులను కూడ సజీవులను గావించాడు. అంతియే కాదు. తానే లేడి రూపమును దాల్చి బ్రాహ్మణుని మంథనకాష్ఠమును హరించితినని తెలియజెప్పి ఇదిగో! గ్రహించుమని ఆ మంథనకాష్ఠమును కూడ అతనికి ఇచ్చివేసేడు. యుధిష్ఠిరుడు ఆ మంథనకాష్ఠమును కొనిపోయి ఆ బ్రాహ్మణునకు ఇచ్చివేసాడు.

యుధిష్ఠిరుడు ఎంత సదాచారసంపన్నుడో అంత వినయసంపత్తి కూడ కలవాడు. అతడు సమయోచితవ్యవహారంలో మిక్కిలి నిపుణుడు. ఎల్లవేళలా గురుజనుల (పెద్దల) గౌరవమర్యాదలను మనసులో ఉంచుకొనేవాడు. ఎంతటి క్లిష్టసమయంలోనైన శిష్టాచారపు మర్యాదలను విస్మరించేవాడు కాడు. మహాభారతయుద్ధం ఆరంభం కానున్న తరుణంలో ఇరుపక్షాల సేనలు యుద్ధానికి సన్నద్ధంగా నిలిచియున్న వేళ అతడు ముందుగా శత్రుసైన్యం నడుమకు పోయి పితామహుడైన భీష్మునకు, ద్రోణాచార్యునకు, కృపాచార్యునకు మామయైన శల్యునకు వంగి పాదాభివందనాలు చేసి తనను ఆశీర్వదింపుడని వారిని ప్రార్థించాడు. అతని యీ వినయవర్తనమును, శిష్టజనయోగ్యం అయిన వ్యవహారమును చూచి ఆ గురుజనులు ఎంతయో ప్రసన్నత చెంది హృదయపూర్వకంగా అతనికి విజయం కలగాలని

ఆకాంక్షించారు. ఆ నలుగురు వీరులు తాము అధర్మవర్తనులైన కౌరవుల పక్షాన నిలిచి పోరవలసివచ్చినందులకు ఖేదాన్ని ప్రకటిస్తూ అది తమలోని బలహీనత అని అతనితో చెప్పారు. స్వయంగా శ్రీకృష్ణ భగవానుడు యుధిష్ఠిరుని యీ ఆదర్శప్రాయవర్తనాన్ని మెచ్చుకొన్నాడు.

యుధిష్ఠిరుని సత్యవచననియమం జగద్విఖ్యాతమైనది. అతడు ఒకరికి వెఱచి కాని, లోభమునకు లోబడి కాని యెన్నడూ అసత్యం ఆడడు అన్న విషయం ఎల్లరకును విదితమైనదే. అతని సత్యవచననిష్ఠకు ఫలంగానే అతని రథచక్రాలు భూమికి నాలుగు అంగుళాల ఎత్తున నిలిచియుండేవి. జీవితంలో కేవలము ఇతడు ఒక్కమాఱు మాత్రం అసత్యం ఆడాడు. అశ్వత్థామ అనే యేనుగు చనిపోయింది. అని చెప్పేనెపంతో "అశ్వత్థామా హతః కుంజరః" అని అనగా అశ్వత్థామ మరణించెను అని ముందు పలికి చివర కుంజరము (ఏనుగు) అన్నాడు. ఈ ఒక్కమాఱు ఆడిన అసత్యం కారణంగా అతని రథచక్రాలు భూమిని అంటి దొరలుట మొదలు అయింది. క్షణకాలం కల్పితములైన నరకదృశ్యాన్ని కూడ అతడు చూడవలసినవాడు అయ్యాడు.

యుధిష్ఠిరుని ఔదార్యం కూడ లోకోత్తరం అయినది. కౌరవులు ఇతని రాజ్యాన్ని ఏ విధంగానూ ఇతనికి తిరిగి యిచ్చుటకు సమ్మతింపకున్న సందర్భంలో ఇతడు కేవలమూ 5 గ్రామాలు ఇచ్చినా తృప్తిపడుటకు సమ్మతించాడు. దుర్యోధనుడు మా కోరిక మేరకు మాకు కేవలమూ 5 గ్రామాలు ఇచ్చుటకు సమ్మతించినా మేము యుద్ధానికి దిగకుందుము" అని యితడు శ్రీకృష్ణుని ద్వారా కౌరవుల కడకు రాయబారం పంపాడు. కాని దుర్యోధనుడు సూదిమొన మోపబడునంత నేలను కూడ ఇచ్చుటకు సమ్మతించలేదు. అప్పుడు తప్పని పరిస్థితిలో ఇతడు కౌరవులతో పోరు సాగింపవలసినవాడు అయ్యాడు. ఆ యుద్ధంలో దుర్యోధనుని సైన్యం అంతా నిహతం అయిపోయింది. కడకు దుర్యోధనుడు ఒక చెరువులో దాగుకొన్నాడు. అప్పుడు ధర్మరాజు అతని కడకు ఏగి సోదరా! మాలో నీవు ఎవరితోడనైన యుద్ధం చేయవచ్చును లేచి రా! అని కూడ పలికి అతనిని యుద్ధానికి రమ్మని ఆహ్వానించాడు. మాలో ఏ ఒక్కరితోడ ద్వంద్వయుద్ధం చేసి గెలిచినా రాజ్యం నీదే అవుతుంది అని కూడ చెప్పాడు.

పాఠకులారా! ఈ విధమైన నిబంధనాన్ని మరి యెవ్వరు పెట్టగలరు. ఏ దుర్యోధనుని తోడ గదాయుద్ధం చేయడానికి ప్రవీణుడు, మహాబలశాలి అయిన భీమసేనుడు కూడ జంకుతాడో ఆ దుర్యోధనుని ముందు సోదరా! మాలో ఎవ్వరిని గెలిచినా రాజ్యం నీది కాగలదు అన్న నిబంధనం విధించడం ఆ ధర్మనందనుని వంటి మహాభాగునకే చెల్లుతుంది తప్ప అన్యులకు సాధ్యంకాదు. చివరకు అతడు భీమసేనునితో పోరాటానికి అంగీకరించాడు. ఆ భీముని చేత నిహతుడు అయ్యాడు.

అంతియే కాదు. యుద్ధం ముగిసిన తరువాత యుధిష్ఠిరునకు పట్టాభిషేకం జరిగింది. అనంతరం గాంధారి ధృతరాష్ట్రులు ఆ ధర్మనందనుని చెంతనే ఉండసాగారు. ఆ సమయంలో కూడ ధర్మరాజు ఆ గాంధారీధృతరాష్ట్రులతోడ వారి పుత్రశోకాన్ని మరచిపోగల్గునంతగా వ్యవహరించాడు. వారికి వారి పుత్రులు కూడ కలిగించలేనంత సుఖాన్ని అతడు కలిగించాడు. అతడు రాజ్యకార్యములను అన్నిటిని ధృతరాష్ట్రుని ఆమోదమును అనుసరించియే నిర్వర్తించువాడు. రాజ్యకార్యనిర్వహణం చేయుచున్నా ఆ పెదతల్లిని, పెదతండ్రిని సేవించుటకు తగునంత సమయాన్ని మిగుల్చుకొనేవాడు. అతని తల్లియైన కుంతీదేవి సమ్రాజ్ఞి ద్రౌపదితోడను, ఇతర వధువులతోడను గూడి గాంధారికి సేవలు చేస్తూ ఉండేది. వారి పుత్రశోకం పెచ్చరిల్లే సందర్భం ఏదీ రాకుండ వీరు వారితోడ బహు జాగరూకతతో వ్యవహరించేవారు. కడకు గాంధారీధృతరాష్ట్రులు తమ శేషజీవితాన్ని వనంలో గడపడానికి నిశ్చయించుకొన్నారు. అప్పుడు ధర్మనందనునకు ఎంతయో దుఃఖం కలిగింది, వారితోడ అతడు కూడ వనవాసం చేయడానికి సన్నద్ధుడు అయ్యాడు. అప్పుడు వ్యాసుడు వచ్చి అతికష్టంమీద ఇతని వనవాసప్రయత్నాన్ని విరమింపజేసి గాంధారీధృతరాష్ట్రులను మాత్రమే వనమునకు పంపుటకు అతనిని సమ్మతింపజేసేడు. అయినా కుంతీదేవి మాత్రం వారిని అనుగమించి వనంలోనికి వెడలింది. అవసానకాలపర్యంతమూ వారికి సేవలుచేసి వారితో బాటు తానుకూడ అచ్చటనే ప్రాణత్యాగం చేసింది. వనగమనానికి ముందు ధృతరాష్ట్రుడు తన మృతపుత్రులకు, బందుగులకు కడపటిసారిగా శ్రాద్ధవిధులను ఆచరించి వారిశ్రేయస్సును కోరి బ్రాహ్మణులకు విరివిగా దానధర్మాలు చేయ

సంకల్పించాడు. ఆ సమాచారమును ఎఱిగి ధర్మరాజు నా బొందిలోను, నా సోదరుడైన అర్జునుని బొందిలోను ప్రాణాలు ఉండునంతవరకు మా సర్వస్వమును మీ చరణాలముందు సమర్పితం చేసాము. మీరు యధేష్టముగా దానధర్మాది విధులను ఆచరించికొనుడు అని విదురునిచేత ధృతరాష్ట్రునకు తెలియజెప్పించాడు. అంతేకాదు. ఆశించినదానికంటె అధికంగా సంపదను వినియోగించుకోగల సదవకాశమును తన పెదతండ్రికి కలుగజేసాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు యధావిధిగా తమవారికి శ్రాద్ధవిధులను ఆచరించి బ్రాహ్మణులకు విరివిగా దానములు చేసాడు. ఆ సమయంలో మహారాజైన యుధిష్ఠిరుడు ధృతరాష్ట్రుని సంకల్పం మేరకు ధనమును, రత్నాలను నది ప్రవహించు విధంగా ప్రవహింపజేసివేసేడు. నూరు ఇమ్మన్నచోట వేయి సమర్పింపజేసాడు. ఆ కార్యక్రమం ముగిసిన పిదప గాంధారీ ధృతరాష్ట్రులు వనానికి పయనం అయ్యారు. అప్పుడు తమ రాణులతోడ గూడి పాండవులు పాదచారులై చాల దూరము వారిని అనుగమించి పోయి సాగనంపి వచ్చారు. ఆ ధృతరాష్ట్రుని మూలంగానే పాండవులు మహాక్లేశాల పాలయ్యారు. అతని మూలంగానే పిత్రాధికారాన్ని వదులుకొనవలసినవారు అయ్యారు. అతని మూలంగానే ఎన్నియో మాఱులు వనవాసక్లేశాలను భరింపవలసినవారు అయ్యారు. అతడి సమక్షంలోనే అతని కొడుకులు నిండు సభలో పతివ్రతాశిరోమణియైన ద్రౌపదిని మహావమానం పాలు చేయడం సంభవించింది. అతని కారణంగానే పాండవులు బిచ్చగాండ్రై యిల్లిల్లు తిరుగవలసినవారు అయ్యారు. పాండవులు స్వీకరించడానికి సమ్మతించినను అతని పక్షంవారే 5 గ్రామాలైన ఇచ్చుటకు ఇచ్ఛగించలేదు. తత్ఫలముగా ఇరువర్గాల నడుమ భయంకరయుద్ధం సాగి దారుణమైన మానవమారణహోమం జరిగిపోయింది. అట్టి కంటక శత్రువు అనదగిన ఆ ధృతరాష్ట్రుని యెడల అరమరికలు లేని స్థిరమైన ప్రేమను ప్రదర్శించగలగడం అన్నది, కడదాక అతనికి సుఖం కలిగించడం అన్నది యుధిష్ఠిరునివంటి పరాకాష్టకు చేరిన మహాపురుషునకే చెల్లుతుంది. శత్రువు విషయంలో ఇంత మంచితనంతో ప్రవర్తించడానికి సంబంధించిన ఉదాహరణాలు ప్రపంచచరిత్రలో వేళ్ళపై లెక్కించదగినవిగా ఉంటాయి.

మహారాజు యుధిష్ఠిరునకు అన్ని సుగుణాలతోపాటుగ విలక్షణమైన

శరణాగత వాత్సల్యము, ప్రేమ అనే మరోరెండు సద్గుణాలున్నాయి. శ్రీకృష్ణుని పరమధామగమనవార్తను, యాదవవంశనాశనవార్తను విని ధర్మనందనునకు ఎంతయో దుఃఖం కలిగింది. అప్పుడు అతడు తనలో ఇలా తర్కించుకొని పరితపించడు. ఏ శ్రీకృష్ణుని దయవలన మనం ఈ సర్వస్వాన్ని పొందగలిగేమో అటువంటి మన పరమాత్మీయుడు, పరమహితైషి అయిన శ్రీకృష్ణుడే యీ పుడమిని వీడిపోయిన తరువాత మనకు ఈ రాజ్యభోగం ఏల? ఈ జీవితాన్ని పొడిగించుకోనేల? శ్రీకృష్ణుని విషయం అటుంచండి! అతనిని గూర్చి పరితపించడంలో అబ్బురంలేదు. కారణం ఏమంటే అతడు పాండవులకు ప్రాణాధికప్రియుడు, వారికి సర్వస్వమైన వాడు. అతనిమీదనే వారి సర్వమూ ఆధారపడి ఉంది. కౌరవవర్గం నశించడం వలన ఆ ధర్మనందనునకు కలిగిన దుఃఖం మఱింత అధికమైనది. ఆ దుఃఖం కారణంగా యుద్ధంలో ప్రాప్తించిన విజయానికి, రాజ్యప్రాప్తికి ఆనందోత్సవం జరుపుకోవడానికి బదులుగా అతడు సర్వమును త్యజించి వనమార్గం పట్టడానికి సన్నద్ధుడు అయినాడు. అప్పుడు శ్రీకృష్ణభగవానుడు, వ్యాసమహర్షి మొదలైనవారు అనేకవిధాల అతనికి నచ్చజెప్పి అతనిని పట్టాభిషేకం చేసుకొనుటకు సమ్మతింపజేసారు. ఆ సందర్భంలో భీష్మపితామహుడు కూడ అతనికి ధర్మమర్మాలను తెలియజెప్పి అతని శోకాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేసాడు. భీష్ముని ఆదేశాన్ని కాదనలేక అతడు రాజ్యపాలనం చేసాడు. కాని స్వజనసంహారంవలన కలిగిన వేదన అతని హృదయమును వీడలేదు. శ్రీకృష్ణుడు పరమధామానికి వెడలిపోయెను అన్న విషయమును ఎఱిగినంతనే అతనిలో విరక్తి అధికమై అతడు వనగమనానికి దృఢనిశ్చయం చేసుకొన్నాడు. అర్జునుని పౌత్రుడైన (కొడుకు కొడుకు) పరీక్షిత్తును రాజ్యసింహాసనమున అధిష్ఠింపజేసి అతనికి బాసటగా ఉండునట్లు కృపాచార్యుని, ధృతరాష్ట్రుని పుత్రుడైన యుయుత్సుడు అనువానిని నియమించి అతడు రాజ్యబంధాన్ని వదలించుకొన్నాడు. అనంతరం తన నలుగురు సోదరులను, ద్రౌపదిని వెంటబెట్టుకొని హస్తినాపురంనుండి పయనం అయ్యాడు. భూప్రదక్షిణం చేసే సంకల్పంతో ఎన్నో దేశాలలో సంచారం సాగిస్తూ పోయి వారు అందరు హిమాలయాన్ని అధిగమించి మేరుపర్వతం దిక్కుగా ముందునకు సాగిపోవసాగారు. అట్లు పోవుచుండగా మార్గమధ్యంలో ద్రౌపది,

భీమార్జుననకులసహదేవులు ఒక్కొక్కరుగా వరుసగా నేలమీద కూలిపోయారు. అయినా వారు పడిపోవడాన్ని కూడ పట్టించుకోకుండ ధర్మనందనుడు ముందుకే సాగిపోవసాగాడు. అంతలో దేవరాజైన యింద్రుడు స్వయంగా అతనిని తనలోకానికి కొనిపోవడం కోసం రథారూఢుడై యెదురుగా వచ్చి అతనిని తన రథాన్ని అధిరోహింపగోరాడు. కాని ఆ ధర్మరాజు తన సోదరులు, ద్రౌపదియు తన వెంటలేని కారణాన ఒంటరిగా రథాన్ని అధిరోహించుటకు ఇష్టపడలేదు. అప్పుడు ఇంద్రుడు వారు నీకంటె ముందుగనే స్వర్గం చేరిపోయారు ధర్మనందనా! అని అన్నాడు. అప్పుడు అతడు రథారోహణం చేయడానికి సమ్మతించాడు. కాని అతని వెంట ఒక కుక్క కూడ ఉంది. అది ఆదినుండియు అతనిని అనుగమించి వస్తూఉన్నది. ఆ కుక్క కూడ తనవెంట రానున్నదని అతడు ఇంద్రునితో చెప్పాడు. ఇంద్రుడు అందులకు అభ్యంతరం తెలిపాడు. ప్రభుభక్తి పరాయణమైన ఈ కుక్కను వీడి నేను ఒంటరిగా స్వర్గానికి వచ్చుటకు ఇష్టపడను. అని ధర్మనందనుడు బదులు చెప్పాడు. ఆ కుక్క ఎవరో కాదు. స్వయంగా ధర్మదేవత. యుధిష్ఠిరుని పరీక్షించుటకు స్వయంగా అతనిని అనుగమంచి వచ్చినది- ధర్మనందనుని యీ సాటిలేని శరణాగతవాత్సల్యాన్ని గాంచి ప్రసన్నుడై ఆ తేజోమూర్తి తన నిజరూపాన్ని ప్రదర్శించి యుధిష్ఠిరుని రథారూఢుని గావింపజేసి యింద్రునితోను, ఇతరదేవతలతోను, దేవర్షులతోను కూడ ఊర్ధ్వలోకాలకు వెడలిపోయాడు. ఆ సందర్భంలో నారదమహర్షి ఈ మహానుభావునివలె ఇంతకు ముందు ఏ వ్యక్తియు బొందితో స్వర్గానికి వెడలినట్లు వినియుండలేదు. అని యుధిష్ఠిరుని ఎంతయో ప్రశంసించాడు. ఊర్ధ్వగమనం చేస్తూ ఉన్నవేళ ధర్మరాజు నక్షత్రాలు దేవతల లోకాల రూపంలో ప్రకాశిస్తూ ఉండడం చూచాడు. అయినను అతడు తనను తన సోదరులు, ద్రౌపది ఉన్న లోకానికే కొనిపోవలెనని, వారి చెంతకు చేరినప్పుడే తనకు మనశ్శాంతి కలుగుతుందని యింద్రునితో చెప్పాడు. తన సోదరులు లేని స్థానం స్వర్గమే అయినా తాను అభిలషింపను అని స్పష్టంగా చెప్పాడు. ఆహా! ఆ మహాభాగుని సోదరప్రేమ ఎంత ప్రశస్తమైనది?

ఒకింత ముందునకు పోయిన పిదట ఇంద్రుని మాయచేత ధర్మనందనునకు నరకదృశ్యాలు కానవచ్చాయి. ఆ నరకాలలో ఒక యెడ

అతనికి అతని సోదరుల మూల్గులు, రోదనధ్వనులు వినవచ్చాయి. అంతియే కాదు. అందలి జనులు మహారాజా! క్షణకాలము నిలువుడు! మీరు ఇక్కడ నిలుచుటవలన మాకు నరకవేదనలు ఉపశమించుచున్నవి అని మొఱ పెట్టుచున్నట్లు కూడ వినవచ్చింది. తోడనే ధర్మనందనుడు అక్కడ నిలిచిపోయాడు. తనను ఆ ప్రాంతమునకు తోడ్కొనివచ్చిన దేవదూతతో అతడు "అయ్యా! నేను ఇక్కడ నిలుచుటవలన ఇచ్చటి జీవులకు సుఖం కలుగుతోంది అని వారు చెబుతున్నందువల్ల నేను ఇక్కడనే నిలిచిపోయెదను. ఎక్కడకో పోవనేల? నాకు ఆ స్వర్గమున్న ఈ నరకమే మిన్న" అని పలికాడు, ఆహా! ఏమి దయామయత్వము?

కొంత తడవునకు ఆ దృశ్యం అదృశ్యం అయింది. అక్కడకు ఇంద్రాదిదేవతలు వచ్చి చేరారు. వారు అందరూ ఇతని దయాస్వభావమును గాంచి ప్రసన్నులు అయ్యారు. ధర్మనందనా! నీవు కపటవృత్తితో నీగురువైన ద్రోణాచార్యునకు అతని కొడుకు మరణించాడు అన్న భ్రాంతి కలిగే విధంగా మాటాడినావు. తత్ఫలితంగానే నీకు మాయాప్రభావంచేత ఈ నరకదృశ్యం చూపబడింది. నిజం చెప్పవలెనన్న నీ సోదరులు ఇక్కడలేరు. వారు దేవలోకం చేరిపోయారు అని అతనికి ఎఱుగజెప్పారు. అటు పిమ్మట ధర్మరాజు భగవానుని పరమధామం చేరాడు. అక్కడ అతడు మానవలోకంలో దర్శించిన విధంగానే ఆ రూపంలోనే శ్రీకృష్ణభగవానుని దర్శించాడు. ఆ భగవానునకు పరిచర్యలు చేస్తూ అర్జునుడు కూడ అతనికి కానవచ్చాడు. ఇతరసోదరులు, ద్రౌపదికూడ వేఱువేఱు స్థానాలలో గోచరించారు. చివరకు అతడు తన తండ్రియైన ధర్మదేవుని దేహంలో విలీనుడు అయ్యాడు. ఈ విధంగా యుధిష్ఠిరుడు తన ధర్మబలంతో ఎవరికీ సాధ్యంగాని స్థితిని పొందగలిగాడు.

యుధిష్ఠిరుడు ఏయెడకు పోయిన ఆయెడ పవిత్రత అలముకొనేది. అతనిలోని పవిత్రతాప్రభావం అట్టిది. అజ్ఞాతవాసకాలంలో పాండవులు విరాటరాజు కొలువులో కాలం వెళ్ళబుచ్చుచున్నవేళ కౌరవులు వీరి ఉనికిని తెలుసుకోవాలని కాంక్షించారు. ఆ సందర్భంలో భీష్మపితామహుడు వారితో యుధిష్ఠిరుడు ఏ నగరంలో, ఏరాష్ట్రంలో ఉంటే అక్కడ ప్రజలు కూడ దానశీలురు, ప్రియవచనులు, జితేంద్రియులు, లజ్జాస్వభావం కలవారును

అయి ఉంటారు అని, వారు సంయమనము, సత్యనిష్ఠ, ధర్మతత్పరత కలిగి ఉంటారని, వారిలో ఈర్ష్య, అభిమానము, మచ్చరము వంటి దోషాలు ఏవీ ఉండవని, అక్కడ అనుక్షణమూ వేదధ్వని వినవస్తూ ఉంటుందని, యజ్ఞాలు జరుగుతూ ఉంటాయని, సకాలవర్షాలు పడుతూ ఉంటాయని, అచ్చటి భూమి ధనధాన్యసమృద్ధిని బయల్పరుస్తూ ఉంటుందని, ఈతిబాధలు, ఉపద్రవాలు ఏవీ ఉండవని, అచ్చటి గోవులు పరిపుష్టములై క్షీరసమృద్ధిని ప్రసాదిస్తూ ఉంటాయని చెప్పాడు. అంతేకాదు, అతని సాన్నిధ్యం వలన నరకంలోని ప్రాణులకు సైతము సుఖశాంతులు లభిస్తాయి అన్న విషయం ముందే తెలిసికొనియున్నాము. మహారాజు నహుషుడు పూర్వము అగస్త్యమహార్షి శాపం కారణంగా అజగరమైపుట్టాడు. అతడు ఒకప్పుడు భీమసేనుని కూడ పట్టి చుట్టి బంధించేడు, అట్టి యా నహుషునకు యుధిష్ఠిరుని దర్శించినంత మాత్రమున, అతనితో సంభాషించినంత మాత్రమున శాపవిముక్తి కలిగి అజగర (కొండ చిలువ) యోనినుండి విడివడి మఱల స్వర్గం చేరడం సంభవం అయింది. అట్టి యా పుణ్యశ్లోకుడు, మహారాజు అయిన ధర్మనందనుని చరిత్రమును మనం ఎంతగా మననం చేస్తే అంతగా పవిత్రతను సమకూర్చుకొన్నవారం కాగలుగుతాము.

"ధర్మోవివర్ధతి యుధిష్ఠిరకీర్తనేన"

వీరవరుడు అర్జునుడు

అర్జునుడు సాక్షాత్తూ నరుడు అనే ఋషి (నరనారయణులలోనివాడు) యొక్క అవతారం. ఇతడు శ్రీకృష్ణభగవానుని ప్రేమించు భక్తుడు. అతని సఖుడు కూడ, అంతియే కాదు. ఇతడు ఆ పరమపురుషుని చేతి యంత్రముగా మెలగినవాడు. ఇతనిని నిమిత్తమాత్రుని గావించుకొని భగవానుడు మహాభారతయుద్ధంలో గొప్పగొప్ప యోధులను సంహరించాడు. ఆ విధంగా అతడు తన అవతారం యొక్క లక్ష్యం అయిన భూభారహరణం అనే మహాకార్యాన్ని సిద్ధింపజేసుకొన్నాడు. ఈ విషయాన్ని అతడు భగవద్గీతలో అర్జునునకు విశ్వరూపప్రదర్శనం చేస్తూ ఉన్న సందర్భంలో స్వయంగా తానే అంగీకరించాడు - "అర్జునా! నీ శత్రువులు అందఱూ ముందే నా చేత నిహతులు అయ్యారు. వారి సంహారవిషయంలో నీవు కేవలము నిమిత్తమాత్రుడవు కావాలి" అన్నాడు. అర్జునుడు తన భక్తుడు, సఖుడును అనే విషయాన్ని కూడ అతడు భగవద్గీతలో తాను పలికిన "భక్తోఽసి మే సఖా చేతి" "ఇష్టోఽసి మే దృఢమితి" ఇత్యాదిగా గల మాటలతో సమ్మతించినట్లే అయింది. ఇతడు నా భక్తుడు, నాకు ఇష్టుడు అని స్వయంగా భగవానుడు సమ్మతించినవాని విషయంలో అతడు అచ్చమైన భక్తుడు అనడానికి ఇతర ప్రమాణాల అవశ్యకత ఏముంటుంది? భగవద్గీతలో కడపట "కరిష్యే వచనం తవ" అని పలికి అర్జునుడు భగవానుని చేతి యంత్రముగా మెలగుదునని ఏ ప్రతిజ్ఞ చేసాడో దానిని కడదాక నిలుపుకొంటూనే వచ్చేడు. ఈ విషయం మహాభారతాన్ని పరిశీలిస్తే స్పష్టం అవుతుంది. అతడు భగవానుని తన సఖుడుగాను, సమానుడుగానూ భావిస్తూ అతనితో వ్యవహరించాడు అనడానికి భగవద్గీతయే ప్రమాణం అవుతుంది. కృష్ణార్జునులు ఇరువురూ ఎన్నియో మాటులు నెలల తరబడి వివిధ ప్రదేశాలలో ఉండేవారు. ఆ సందర్భాలలో కలసిమెలసి సంచరించేవారు. కలసిమెలసి అన్నపానాదులను గ్రహించేవారు. ఇరువురూ కలసి ఒకేసారి

పడుకునేవారు, ఒకేసారి లేచేవారు. ఒకరిని ఒకరు ఎడబాయక కలసిమెలసి విహరించేవారు. ఆ సందర్భాలలో వారి నడుమ ఎట్టి అరమరికలు ఉండేవికావు. ఇరువురును ఒకరితో ఒకరు హృదయపూర్వకముగా ప్రవర్తించేవారు. తనువులు వేఱైనా మనస్సులు ఒక్కటిగా చరించేవారు. ఒకరి అంతఃపురంలోనికి ఒకరు నిస్సంకోచంగా వస్తూ పోతూ కూర్చుంటూ లేస్తూ ఉండేవారు. వారిలో ఒకరితో ఒకరికి దాపరికాలు రహస్యాలూ ఉండేవి కావు. ఈ యిరువురి నడుమను ఉన్న ప్రేమానుబంధాన్ని గూర్చి సంజయుడు పాండవుల సందేశాన్ని తెలియజెప్పేవేళ విశదంగా తెలియజెప్పాడు. యుద్ధానికి ముందు సంజయుడు కౌరవుల సందేశాన్ని వినిపించడంకోసం ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల దగ్గరకు వెళ్లాడు. అక్కడ కృష్ణార్జునులను చూచాడు. వారిని తాను ఏ పరిస్థితిలో ఉండగా చూచాడో ఆ పరిస్థితిని వివరిస్తూ అతడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు - "మహారాజా! మీ సందేశాన్ని వినిపించడం కోసం నేను అర్జునుని అంతఃపురంలోనికి వెళ్లాను. అచ్చటకు అభిమన్యుడు, నకులసహదేవులు కూడ వెళ్ళలేక పోయేవారు. అక్కడకు పోయి నేను చూడగా తన రెండు చరణాలను శ్రీకృష్ణుడు అర్జునుని ఒడిలో పెట్టుకొని యుండగా అర్జునుడు తన రెండు పాదాలను ద్రౌపదీ సత్యభామల ఒడిలో పెట్టుకొని యున్నాడు. ఈ మాటలే కాక సంజయుడు వారిని గూర్చి ధృతరాష్ట్రునితో ఇంకనూ ఇలాంటి విషయాలు ఎన్నో వివరించాడు.

జూదంలో పెట్టుకొన్న నిబంధనను అనుసరించి పాండవులు వనంలోనికి వెడలిపోయినప్పుడు శ్రీకృష్ణుడు వారిని కలిసికొనుటకు వనంలోనికి వస్తాడు. అప్పుడు అతడు తాను, అర్జునుడు ఒకటే అనే విషయాన్ని వివరిస్తూ అతనితో ఇలా అంటాడు - "అర్జునా! నేను కేవలమూ నీవాడను. అట్లే నీవు కూడ కేవలమూ నావాడవు. నా వారు నీవారు. నీవారు నావారు. నిన్ను ద్వేషించినవాడు నన్ను ద్వేషించినవాడు అవుతాడు. నిన్ను ప్రేమించినవాడు నన్ను ప్రేమించినవాడు అవుతాడు. నీవు నరుడవు. నేను నారాయణుడను. నీకు నాతోడ భిన్నత్వం లేదు. నాకు నీతోడ భిన్నత్వం లేదు. మనలో అంతరం ఏదీలేదు. మనం ఇరువురమూ ఒక్కటే" మహాభారతంలోని సంఘటనలను కొన్నిటిని పరిశీలిస్తే అర్జునుడు శ్రీకృష్ణునకు ఎంత ప్రీతిపాత్రుడో, వారు ఇరువురిలోనూ ఎలాంటి అభిన్నత్వం ఉందో

వ్యక్తం అవుతుంది. అర్జునుడు తన వనవాసకాలంలో తీర్థయాత్రలు చేసిన సందర్భంలో ఒకప్పుడు ప్రభాసక్షేత్రానికి వెళ్ళడం సంభవిస్తుంది. అతని ఆగమనవార్త విన్న వెంటనే శ్రీకృష్ణుడు అతనిని కలిసికొనుటకై ద్వారకనుండి ప్రభాసక్షేత్రానికి వస్తాడు. అతనిని అచ్చటనుండి రైవతకపర్వతం మీదకు తోడ్కొని పోయి అతనితో అక్కడ చాలారోజులు గడుపుతాడు. అనంతరం వారు అక్కడనుండి ద్వారకకు మఱలి వస్తారు. అక్కడ అర్జునుడు శ్రీకృష్ణుని అంతఃపురములో అతనికి అత్యంత ప్రీతిపాత్రుడైన అతిథిగా కొన్నిదినములు ఉండిపోతాడు. ఆ దినాలలో రాత్రివేళల వారు కలిసి నిదురించేవారు. ఆ సమయంలో తన సోదరిని అర్జునుడు పెండ్లి యాడగోరుతూ ఉన్నట్లు శ్రీకృష్ణునకు తెలియవస్తుంది. అప్పుడు అతడు తనను కోరకముందే అందులకు తన యంగీకారమును అర్జునునకు తెలియజెపుతాడు. అంతియే కాదు. ఆమెను హరించి కొనిపోవుటకు అతనికి ఉపాయం కూడ వివరించి చెపుతాడు. అంతటితో ఊరకుండక తన ఆయుధాలను, రథాన్ని కూడ అతనికి అర్పిస్తాడు. సుభద్రను హరించిన విషయం తెలిసి కుపితుడై బలరాముడు అర్జునుని ప్రతిఘటించబోవగా శ్రీకృష్ణుడు అనేక విధాల నచ్చజెప్పి అతనిని శాంతింపజేసి సుభద్రకు, అర్జునునితో పెండ్లిజరపడానికి సమ్మతింపజేస్తాడు. అనంతరం ద్వారకలోనే సుభద్రార్జునుల వివాహం జరుగుతుంది. అంతియే కాదు ఖాండవవనదహన సందర్భంలో శ్రీకృష్ణభగవానుడు తనకు అర్జునునితోడ మైత్రి నానాటికి వర్థిల్లుతూ ఉండునట్లుగా ఇంద్రుని వలన వరమును కోరుకొంటాడు. ఆ సందర్భంలోనే కృష్ణార్జునులు అభిన్నులు అనుటకు మఱియొక ప్రమాణం లభిస్తుంది. అది ఎట్టిది అంటే ఖాండవవనదహనకాలంలో ఆ అగ్ని ప్రళయం నుండి మయుడు అనే దానవుడు తప్పించుకొని పాఱిపోవడానికి యత్నిస్తాడు. అప్పుడు అగ్నిదేవుడు మూర్తిరూపం ధరించి వానిని దహించి వేయడంకోసం వానిని వెంబడిస్తాడు. అతనికి బాసటగా చక్రం చేతబట్టి పోయి శ్రీకృష్ణుడు కూడ వానిని సంహరించుటకు ఉద్యమిస్తాడు. అప్పుడు మయుడు ఆత్మరక్షణానికి తెరువు కానక అర్జునుని శరణు వేడుతాడు. అర్జునుడు అతనికి అభయం ఇస్తాడు. అంతట శ్రీకృష్ణుడు కూడ తన చక్రాన్ని ఉపసంహరిస్తాడు. అగ్నిదేవుడు కూడ ఇక వానిని వెంబడించడం విరమిస్తాడు. మయుని ప్రాణాలు నిలుస్తాయి.

ఆ ఉపకారానికి బదులుగా మయుడు అర్జునునకు ఒకింత తన సేవను అందింప సంకల్పించుకొంటాడు. అప్పుడు అర్జునుడు వానితో నన్ను కాదు. శ్రీకృష్ణుని సేవించు! అతనిని సేవిస్తే నన్ను సేవించినట్లే అవుతుంది అని చెపుతాడు. ఆ మయుడు బహునిపుణుడైన ఒక గొప్ప శిల్పి. శ్రీకృష్ణుడు అతనిచేత ఒక గొప్ప సుందరమైన సభాభవనాన్ని మహారాజు యుధిష్ఠిరుని కోసం నిర్మింపజేస్తాడు. ఈ విధంగా కృష్ణార్జునులు ఇరువురూ ఒకరికోసం ఒకరు పాటుపడుతూ ఉండేవారు.

శ్రీకృష్ణుడు అర్జునుని ఎంతగా ప్రేమించేవాడో అర్జునుడు కూడ అంతగా అతనిని తన పరమాత్మీయునిగాను, పరమహితాభిలాషిగాను భావించుకొనేవాడు. ఆ కారణంగానే అతడు శ్రీకృష్ణుని చెంత ఒక అర్బుదం సంఖ్యలో ఉన్న నారాయణీ సేనను కోరుకోక ఒంటరివాడు, వట్టి చేతులవాడూ అయిన అతనినే తన సహాయకునిగా కోరుకొన్నాడు. భగవానుడు, అతని ఐశ్వర్యము - ఈ రెండూ కోరుకోదగిన వస్తువులు అయినప్పుడు అసలైన భక్తుడు భగవానుడినే కోరుకొంటాడు. కాని అతని ఐశ్వర్యాన్ని ఆపేక్షింపడు. శ్రీకృష్ణుడు కూడ అర్జునుడు తనయెడల చూపుతూ ఉన్న ప్రేమకు లోబడి యుద్ధంలో అతనికి రథసారథిగా ఉండుటకు సమ్మతించాడు. ఆ రథంతో బాటు అర్జునుడు తన జీవనరథాన్ని సవ్యమార్గంలో నడిపే బాధ్యతను కూడ అతనికే అప్పగించి తాను నిశ్చింతుడు అయ్యాడు. దానితో యుద్ధంలో అతనిని రక్షించే భారము విజయం కల్గించే భారము, నిరంతరమూ అతని యోగక్షేమాలను వహించే భారము కూడ శ్రీకృష్ణుని భుజస్కంధాలమీద పడ్డాయి. అనన్యభావంతో తనను చింతిస్తూ ఉండేవారి చింతలను అన్నిటినీ తనమీద పెట్టుకొంటానని, వారి యోగక్షేమాలను తానే వహిస్తానని శ్రీకృష్ణుడు గీతలో స్వయంగా ప్రమాణం చేసి యున్నాడు కదా! అట్టి సదవకాశం కావాలి అని అనుకుంటే ఎవరైన తమ భారాన్ని ఆ శ్రీకృష్ణ పరమాత్మ మీద నిలిపి చూడవచ్చును.

ఇంకేమున్నది? ఇక అప్పుడు అర్జునుని యుద్ధంలో గెలిపించడానికి, భీష్మునివంటి అనన్యపరాక్రమవంతులైన వీరుల బారినుండి అతనిని రక్షించడానికి సంబంధించిన భారం అంతా శ్రీకృష్ణుని మీదపడింది. విజయం ఎట్లును ముందుగానే పాండవపక్షానికి నిశ్చితమై ఉంది. కారణం ఏమంటే

ధర్మం వారి పక్షాన ఉంది. ధర్మం ఉన్న పక్షాన శ్రీకృష్ణుడు ఉండడము, శ్రీకృష్ణుడు ఉన్న పక్షాన విజయం ఉండడమూ అనేది ఎల్లప్పుడూ సాగివస్తూ ఉన్న నియమం. ఇక యుద్ధారంభంలో అర్జునుని చేత రణచండికకు ఆవాహనం చేయించి ఆమెను స్తుతింపజేసి ఆమె సాక్షాత్కారం సిద్ధింపజేసి, యుద్ధంలో విజయం ప్రాప్తించే విధంగా ఆమె ఆశీర్వచనాల అతనికి లభింపజేయడము. రణభూమిలో అతనికి భగవద్గీతను ఉపదేశించడము, అతనికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించడము, అతనిలోని మోహాన్ని అంతరింపజేయడము, యుద్ధంలో శస్త్రం చేతబట్టను అని తాను ముందు చేసిన శపథాన్ని కూడ పరిగణింపక భీష్ముని ప్రచండబాణవృష్టిని తట్టుకొనజాలక బాధపడుచున్న అర్జునుని కాపాడడంకోసం స్వయంగా ఒక మాఱు చక్రము, మఱియొకమాఱు కశను (కొరడా) గ్రహించి యా భీష్మునకు ఎదురుగా పరుగుపెట్టడము. భగదత్తుడు ప్రయోగించిన సర్వసంహారకమైన వైష్ణవాస్త్రాన్ని తన వక్షస్థలమును అడ్డుపెట్టి భరించడము, రథాన్ని పాదాలతో అదిమిపట్టి కర్ణుడు ప్రయోగించిన సర్పముఖాస్త్రం బారినుండి అర్జునుని రక్షించడము, అస్త్రములతో దగ్ధం అయిన అర్జునుని రథాన్ని తన సంకల్పబలంతో స్థిరంగా నిలుచునట్లు చేయడమూ మొదలైన లీలలు అన్నీ శ్రీకృష్ణుడు అర్జునుని యోగక్షేమం కోరి సాగించినట్టివే.

పాండవులతో భీష్ముని పోరాటం మొదలై తొమ్మిది దినాలు గతించాయి. అయినా అతని పరాక్రమంలో ఎట్టి శిథిలత్వమూ కానరాలేదు. ప్రతిదినమూ అతడు పాండవపక్షంలోని వేనవేలు వీరులను సంహరిస్తూ ఉన్నాడు. అతనిని జయించడానికి పాండవులకు దారి, తెన్ను ఏదీ తోచడంలేదు. అప్పుడు మహారాజు యుధిష్ఠిరుడు బహు కరుణాజనకములైన మాటలతో పరిస్థితిని అంతనూ శ్రీకృష్ణునకు నివేదించాడు. కారణం ఏమన్న అతడు వారి నౌకకు సంచాలకుడు. ఆ సందర్భంలో అతనికి ఊరట గొలుపుతూ శ్రీకృష్ణుడు ఆడిన మాటలలో అర్జునుని యెడల అతనికి ఉన్న అసాధారణప్రేమ, మహోన్నత దృఢసంకల్పమూ కూడ వ్యక్తం అవుతాయి. శ్రీకృష్ణుడు అప్పుడు ఆడిన మాటలు ఇవి - ధర్మనందనా! నీవు ఈషణ్మాత్రమూ దిగులు చెందవలదు. భీష్ముని మరణం మీదనే నీ విజయం ఆధారపడి ఉన్నదంటే నేను ఒక్కడనే అతనిని సంహరించివేయగలను.

నీ సోదరుడైన అర్జునుడు నాకు సఖుడు, బంధువు, శిష్యుడును అయినవాడు. కావాలంటే అతనికొఱకు నా శరీరంలోని మాంసమును కూడ కోసి అతనికి అర్పింపగలను. అతడు కూడ అలాగుననే నాకొఱకు తన ప్రాణాలను కూడ ధారపోయగలవాడు. అతడు ఉపప్లావ్యంలో అందరి సమక్షంలోను తాను భీష్ముని సంహరించెదనని శపథం చేసాడు. సర్వవిధాల అతనిని రక్షించవలసిన భారం నామీద ఉన్నది. అతడు ఏకార్యం నెరవేర్చుటకు ఆదేశిస్తే దానిని నేను నెరవేర్చవలసియున్నది ఆ మాట అటుంచి అర్జునునకు భీష్ముని సంహరించడం ఏమంత పెద్ద పని? రాజేంద్రా! అతడు పూనుకోవలెనే కాని అతనికి అసంభవమైన పని యేదీ ఉండదు. దైత్యవర్గము, దానవవర్గమును వెంట బెట్టుకొని దేవతలంతా ఎత్తి వచ్చినా అతడు వారిని అందరను కూడ పరాజయముపాలు గావింపగలడు. అట్టివానికి భీష్ముడు ఒక లెక్కయా! నిజం చెప్పాలి అంటే అతడు “కర్తుం అకర్తుం. అన్యథా కర్తుం సమర్థ” ఏమైన చేయుటకు, చేయకుండుటకు, అటు ఇటు కాకుండ మఱొక విధంగా చేయుటకును కూడ సమర్థుడు. అతనికి సాధ్యము కానిది ఏమున్నది.

యుద్ధంలో అభిమన్యుడు నిహతుడు అవుతాడు. పుత్రశోకాకులుడైన అర్జునుడు అతని మరణానికి ప్రధానకారణం జయద్రథుడని గుర్తించి వానిని ఆ మఱునాడు సూర్యాస్తమయం అయ్యేలోపల సంహరించివేస్తానని శపథం చేస్తాడు. అంతియే కాదు. అట్లు చేయలేని నాడు మండుతున్న అగ్నిలో ప్రవేశించి అసువులను బాయుదునని కూడ అతడు ఆ సందర్భంలో శపథం చేస్తాడు. “యోగక్షేమం వహామ్యహమ్” అని తాను గీతలో పలికిన పలుకును అనుసరించి ఆ అర్జునుని శపథాన్ని సఫలం చేయవలసిన భారం శ్రీకృష్ణుని మీదకు వచ్చి పడింది. అర్జునుడు మాత్రం ఆ భగవానునిమీద భారం వేసి నిశ్చింతుడు అయ్యాడు. అటు కౌరవపక్షంవారు జయద్రథుని కాపాడడంకోసం సర్వవిధాల ఉద్యమిస్తూ ఉన్నారు. ఆ నాటి రాత్రి శ్రీకృష్ణుడు నిశీథసమయంలోనే మేల్కొని రథసారథియైన దారుకుని పిలిచి అతనితో ఇలా చెప్పాడు - దారుకా! నాకు నా భార్య, మిత్రులు, సోదరులు, బందుగులు ఎవ్వరూ కూడ అర్జునునికంటె అధిక ప్రీతిపాత్రులు కారు. అర్జునరహితంగా క్షణంకూడ నేను ఈలోకాన్ని చూడలేను. అలా జరగడానికి వీలులేదు. రేపటి దినమున నేను అర్జునుని మిత్రుడనని లోకం అంతా

గుర్తిస్తుంది. అతనిని ద్వేషించినవాడు నన్ను ద్వేషించినవాడే. అతనికి అనుకూలుడు నాకు అనుకూలుడు. అర్జునుడు నాలో అర్ధశరీరం వంటివాడు అన్న విషయం ఎన్నడూ మఱవవలదు. అతడు రేపు ఏయే వీరులను అంతమొందించడానికి ఉద్యమిస్తాడో వారందరూ అంత మొందడమూ, అతనికి విజయం కలగడమూ తథ్యం. ఈ మాటలను బట్టి భగవానుడు ఎంత మిత్రవత్సలుడో వ్యక్తం అవుతుంది. అలాంటి పరమప్రభుని అండదండలుకలవాడు విజయాన్ని పొందడంలో సందేహం ఏముంటుంది? శపథం చేసిన మఱునాడు అర్జునుడు శ్రీకృష్ణుడు చెప్పిన ఉపాయంతో జయద్రథుని సంహరించి తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొన్నాడు. శ్రీకృష్ణుని కృపాబలంవలన అర్జునునకు ఈషణ్మాత్రమూ హాని యేదీ కలుగలేదు.

కర్ణునకు ఆదినుండియు అర్జునుని యెడల ఈర్ష్యాభావం మెండు. ఇరువురూ ఒకరిప్రాణాలను ఒకరు తీయాలని పట్టుబట్టియున్నారు. భీష్మని మరణానంతరం అర్జునునకు కర్ణునివలననే అధికభయాన్ని శ్రీకృష్ణుడు శంకిస్తూ వచ్చాడు. కారణం ఏమనగా అతని దగ్గర ఇంద్రదత్తమైన శక్తి అనే అస్త్రం ఉంది. దానిని అతడు అర్జునుని సంహారంకోసమే మరెక్కడా వినియోగించకుండ ఉంచుకొన్నాడు. ఆ శక్తిబలాన్ని చూచుకొని అతడు అర్జునుని మరణించిన వానినిగానే భావించుకొంటున్నాడు. కర్ణుని చేతిలోని ఆ శక్తిని లేకుండ చేయనెంచి భగవానుడు అతనిని భీమసేనతనయుడైన ఘటోత్కచుని మీద ప్రయోగింపక తప్పలేదు. దానితో ఘటోత్కచుని చరిత్ర ముగిసిపోయింది. పాండవుల శిబిరంలో శోకం అలముకొంది. అందఱి కన్నులు అశ్రుధారలను కురియింపసాగాయి. కాని యీ సంఘటన శ్రీకృష్ణునకు మాత్రం విశేషప్రసన్నత కలుగుటకు కారణం అయింది. అతడు ఆనందంతో చిందులు త్రొక్కసాగాడు. అతడు అర్జునుని కౌగిలించుకొని అతని వెన్ను నిమిరి పలుమాఱులు ఆనందగర్జనం చేసాడు. అప్పుడు అర్జునుడు ఆ సమయంలో ఇలా భగవానుడు ఆనందోత్సాహాలను ప్రకటించడంలోని ఆంతర్యం ఏమిటో తెలుసుకొనగోరాడు. కారణం ఏమన్న అకారణంగా ఏ క్రియయు జరగబోదు అని అతడు ఎఱుగును. అప్పుడు శ్రీకృష్ణుడు ఆడిన మాటలలో అతనికి అర్జునునిపయి ఉన్న అగాధమైన ప్రేమ స్పష్టంగా ప్రతిబింబితం అవుతుంది. ఆ సందర్భంలో అతడు

పలికిన పలుకులు ఇవి - "అర్జునా! ఈనాడు నిజంగా నాకు అమందానందం కలుగుతోంది. కారణం ఏమో ఎఱుగుదువా? చెపుతున్నాను. విను, కర్ణుడు ఘటోత్కచుని సంహరించిన విషయం నీవు ఎఱుగుదువు. కాని అది నిజం కాదు. ఇంద్రదత్తం అయిన శక్తిని విఫలం చేసి ఒక విధంగా ఘటోత్కచుడే కర్ణుని సంహరించాడు అని నేను అంటాను. ఇక నీవు ఆ కర్ణుని నిహతునిగా భావించుకొనవచ్చును. కర్ణుని చెంత ఆ శక్తి యుండగా అతనిని ఎదిరింపగల మొనగాడు లేడు." అంతియే కాదు. అర్జునా! నీ కోసమే నేను ఒక్కొక్కరుగా జరాసంధశిశుపాలాదులను ముందే సంహరింపజేసాను. అట్లు చేసియుండకపోతే వారు ఈనాడు భయంకరప్రతిపక్షులుగా నీముందు నిలిచేవారు. మనపై ద్వేషం పెట్టుకొన్నవారు కావడంచేత వారు నేడు కౌరవుల పక్షాన చేరి దుర్యోధనుని అండదండలతో సమస్త భూమండలాన్ని జయించగలిగేవారు. వారివంటి దైవద్రోహులను అంతమొందించడంకోసమే నేను భూమిపై అవతరించడం జరిగింది." ఈ మాటల సందర్భంలోనే భగవానుడు సాత్యకితో ఇలా అన్నాడు - "సాత్యకీ! శక్తి అనే అస్త్రాన్ని కేవలమూ ఒక్క అర్జునునిమీద కాక మఱి ఎవ్వరిమీదను ప్రయోగింపవలదని కౌరవపక్షంవారు కర్ణునకు సలహా ఇస్తూ ఉండేవారు. కర్ణుడు కూడ ఆ ఆలోచనలోనే ఉండేవాడు. కాని నేనే మోహం కలిగిస్తూ వచ్చాను. అందుచేతనే అతడు అర్జునునిమీద శక్తిప్రహారం చేయలేదు. నిజం చెప్పాలి అంటే ఆ శక్త్యస్త్రం అర్జునునకు మృత్యుస్వరూపమే. ఆ విషయాన్ని తలచుకొని తలచుకొని రాత్రులందు నేను నిద్రలేక బాధపడుతూ వచ్చాను. అది యీనాడు ఘటోత్కచునిమీద ప్రయుక్తమై విఫలం అయింది. అది చూచి అర్జునుని నేను మృత్యుముఖంనుండి బయల్పడినవానినిగా భావిస్తున్నాను. నేను అర్జునుని ప్రాణరక్షణానికి ఇస్తూ ఉన్నంత ప్రాముఖ్యము నా తల్లిదండ్రులు, సోదరులు మున్నగువారి ప్రాణరక్షణానికి, కడకు నా ప్రాణరక్షణానికి కూడ ఇవ్వడంలేదు. సమస్తలోకరాజ్యముకంటెను భిన్నంగా దుర్లభమైన వస్తువు ఏదైన ఉంటే దానిని కూడ నేను అర్జునరహితంగా పొందగోరను. అందుచేతనే యీనాడు అర్జునుని మరణించి జీవించినవానిగా భావించుకొని పరమానందాన్ని పొందుతున్నాను. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టకొనియే యీ రాత్రి నేను కర్ణునితో పోరడంకోసం ఘటోత్కచుని

పంపాను. అతడు తప్ప మఱియెవ్వరూ కర్ణుని అణచి వేయలేరు. ఈ మాటలను బట్టి అర్జునుడు శ్రీకృష్ణునకు ఎంత ప్రీతిపాత్రుడో అతని సంరక్షణ విషయంలో ఆ పరమపురుషుడు ఎంత జాగరూకతను వహించాడో తేటతెల్లం అవుతుంది. కాబట్టి తనను భగవానుని చేతి యంత్రముగా ఎవడు చేసుకొంటాడో వానిని నిరంతరమూ ఆ భగవానుడు ఈ విధంగానే సంరక్షిస్తూ ఉంటాడు. అట్టివానికి ఎప్పుడూ ఎవరివలననూ ఎలాంటి హానియు కలుగనేరదు. ఇట్టి భక్త వత్సలుడైన పరమప్రభువును శరణు వేడుట మాని యితరేతరములైన అవలంబాలకోసం అన్వేషణం చేసేవానిని మించిన మూర్ఖుడు మఱియొక్కడు ఉండడు.

ద్రోణాచార్యుని సంహారంతో క్రుద్ధుడై అశ్వత్థామ పాండవులమీద ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రం ప్రయోగింపబడిన వెంటనే ఆకాశం నుండి బాణవర్షం కురిసి నాలుగు వంకల అగ్నిజ్వాలలు అలముకొన్నాయి. అర్జునుడు ఒక్కడూ ఒక అక్షౌహిణిసైన్యాన్ని వెంట బెట్టుకొని అశ్వత్థామతో పోరాడుతున్నాడు. (21870 రథాలు, 21870 ఏనుగులు, 65610 గుఱ్ఱాలు, 109650 మంది కాల్బలమును గలసైన్యము అక్షౌహిణి యనబడును) ఆ అస్త్రంయొక్క ప్రభావంతో అతని సైన్యం అంతా దగ్ధం అయింది. కాని అతనికి, శ్రీకృష్ణునకు మాత్రం అగ్నియొక్క సెగ కూడ తగులలేదు. తాను ప్రయోగించిన అస్త్రం వారిని ఇరువురను ఏమీ చేయలేకపోవడంతో అశ్వత్థామ చకితుడూ, చింతాక్రాంతుడూ అయ్యాడు. తన చేతిలోని వింటిని దూరంగా పాఱవైచి రథంనుండి క్రిందకు దుమికి ఛ! ఛ! అనుకుంటూ యుద్ధభూమినుండి పాఱిపోయాడు. అంతలో అతనికి వ్యాసమహర్షి కానవచ్చాడు. అతడు ఆ మహర్షికి నమస్కరించి మహాత్మా! సర్వసంహారకమైన అస్త్రం కృష్ణార్జునులపయి తన ప్రభావాన్ని ఏల చూపలేకపోయింది? అని ప్రశ్నించాడు. అప్పుడు వ్యాసుడు - “అశ్వత్థామా! శ్రీకృష్ణుడు నారాయణర్షి అవతారము. అర్జునుడు నరుని అవతారము. వారి ప్రభావము నారాయణుని ప్రభావంతో తుల్యమైనది. వారు ఇరువురూ నరనారాయణస్వరూపాలు. వారు లోకంలో ధర్మమర్యాదను రక్షించడంకోసం ప్రతియుగంలోనూ అవతరిస్తూ ఉంటారు” అని బదులు చెప్పాడు. ఆ మాట వినడంతో అశ్వత్థామకు కలిగిన సందేహం నివృత్తం అయింది.

కృష్ణార్జునులు సాధారణులు కారు, మహానుభావులు అన్న భావం ఏర్పడింది. వ్యాసుడు పలికిన ఈ పలుకులవలన కూడ కృష్ణార్జునులు ఇరువురూ ఒకరితోడ ఒకరు అభిన్నులు అన్న విషయం విస్పష్టం అవుతోంది.

అర్జునుడు ఎట్లును శ్రీకృష్ణభగవానుని కృపకు పాత్రం అయినవాడే. దానితో పాటు అతనిమీద పరమశివుని కృపాదృష్టి కూడ విశేషంగా గోచరిస్తుంది. యుద్ధంలో శత్రుసైన్యసంహారం చేస్తూ ఉన్న సమయంలో ఒక అగ్నితో సమానుడైన దివ్యపురుషుడు తనకు ముందు నిలిచి ముందుదెసకు సాగిపోతూ ఉన్నట్లు అర్జునుడు చూస్తాడు. ఆ దివ్యపురుషుడే యుద్ధంలో శాత్రవసంహారం చేస్తూ ఉన్నవాడు. కాని అది అంతా అర్జునుని ప్రతాపమూ, ప్రభావమూ అని జనులు అందరూ అనుకొన్నారు. ఆ దివ్యపురుషుడు చేత త్రిశూలం ధరించి సూర్యప్రభాసమానుడై తేజరిల్లుతూ ఉన్నాడు. అతడు సాక్షాత్తూ శంకరభగవానుడని మాటల సందర్భంలో వ్యాసుడు అర్జుననకు తెలియజేస్తాడు. శ్రీకృష్ణభగవానుని కృపకు పాత్రమైన వానిమీద ఎల్లవారలూ కృపను జూపుతారు అనడంలో ఆశ్చర్యం ఏముంటుంది? 'జా పర కృపా రామ కై హోయీ । తా పర కృపా కరహిఁ స బ కోయీ' అన్న ఆ విషయం అటుంచండి.

భగవానుని పరమభక్తుడు, అతని కృపకు పాత్రుడూ అగుటతో బాటు అర్జునునిలో చెప్పుకోదగిన సుగుణాలు ఇంకనూ ఎన్నో ఉన్నాయి. సూర్యునితోడ కిరణాలు ఉన్న విధంగా ఎక్కడ భక్తి ఉంటే అక్కడ తప్పనిసరిగా దివ్యగుణాలు కూడ ఎన్నో ఉంటాయి. అర్జునుడు గొప్ప ధీరుడు, వీరుడు, జితేంద్రియుడు, దయాళుడు, కోమలస్వభావుడు, సత్యప్రతిజ్ఞతాలక్షణం కలవాడు కూడ. జన్మతః ఇతనిలో దివ్యగుణసంపద ఉంది. ఆ విషయాన్ని భగవానుడు గీతలో 'సంపదం దైవీ మభిజాతోఽసి' అని పలికి తానే అంగీకరించాడు. ఇతని జన్మకాలంలో అశరీరవాణి యితని తల్లిని సంబోధించి - "కుంతీ! యీ పిల్లవాడు కార్తవీర్యార్జునునివలెనూ, శంకరభగవానునివలెనూ మహాపరాక్రమశాలి, ఇంద్రునివలె అజేయుడూ అయి లోకంలో నీ కీర్తిప్రతిష్ఠలను వర్ధిల్లజేయగలవాడు సుమా! శ్రీమహావిష్ణువు తన తల్లి అదితికి ప్రసన్నత కలిగించిన విధంగా ఇతడు నీకు ప్రసన్నత కలిగించగలవాడు అని పలికింది. ఈ అశరీరవాణిని ఒక్క కుంతియే కాదు. అచ్చట ఉన్నవారు అందఱూ ఆలకించారు. ఈ సంఘటన ఋషులకు, మునులకు, దేవతలకు,

సమస్త ప్రాణులకును పరమానందహేతువయింది. ఆకాశమందు దేవతలు దుందుభులు మ్రోగించి పూలవానలను కురిపించారు. ఈ విధంగా ఇతడు జన్మం ఎత్తినది మొదలుగానే ఇతని లోకోత్తర్వలక్షణం ప్రకటం కాసాగింది. ఇతడు క్రమంగా పెరిగి ఒకింత పెద్దవాడు అయిన మీదట ఇతని సోదరులతోను, ధృతరాష్ట్రనందనులయిన దుర్యోధనాదులతోను కలిపి ఇతనిని కూడ విద్యాభ్యాసం నిమిత్తం మొదట కొంతకాలం కృపాచార్యునకు, అనంతరం ద్రోణాచార్యునకు అప్పగించడం జరిగింది. ద్రోణాచార్యుని శిష్యులు ఎల్లరయందును బాహుబలప్రదర్శనమునందు, పరిశ్రమించుటయందు. సమస్తశాస్త్రప్రయోగములందు. స్ఫూర్తి. శుభ్రతాలక్షణములందును కూడ ఇతడే అగ్రగణ్యుడుగా భాసించాడు. ఇతడు ద్రోణాచార్యుని విశేషంగా సేవించేవాడు కూడ. ఇతని సేవ, శ్రద్ధ, బుద్ధిచేత ప్రసన్నుడై ఒకనాడు ద్రోణాచార్యుడు వత్సా! లోకంలో నీకు సాటియగు ధనుర్ధరుడు వేఱొకడు లేకుండే విధంగా నిన్ను వర్ధిల్లజేసెదనని యతనితో చెప్పాడు.ఆ ద్రోణాచార్యునివంటి సిద్ధగురుడు పలికిన పలుకు అసత్యం అవుతుందా? కడకు అర్జునుడు నిజముగానే జగదేకధనుర్ధారి అయ్యాడు.

పాండవులు కౌరవరాజకుమారులు తమ అస్త్రవిద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకొన్న సందర్భంలో తమ గురువునకు దక్షిణను సమర్పించుకోవలసిన తరుణం సమీపించింది. అప్పుడు ద్రోణాచార్యుడు తన శిష్యులతో - "నాయనలారా! పాంచాలరాజైన ద్రుపదుని యుద్ధంలో బంధించి తెచ్చి నాకు అప్పగించండి! ఇదే నేను మీనుండి ఆపేక్షించే గురుదక్షిణ అని చెప్పాడు. శిష్యులు అందరూ సంతోషంతో అందులకు సమ్మతించారు. అస్త్రశస్త్రాదులతో సన్నద్ధులై వారు తమ గురువుతోడ రథారూఢులై ద్రుపదుని నగరం మీదకు దండెత్తి వెళ్లారు. అక్కడకు చేరినమీదట ద్రుపదుడు తన సోదరులను వెంటబెట్టుకొని వచ్చి వీరిని ఎదిరించాడు. ముందుగా కేవలము ఒక్క కౌరవరాజకుమారులే ద్రుపదునితో పోరాటం సాగించారు. కాని వారు అతని ధాటికి నిలువలేక వీగిపోయి వెనుకకు తిరిగారు. కడపట అర్జునుడు భీముని, నకులసహదేవులను వెంట నిడికొని పోయి ద్రుపదునిపై ఆక్రమణం సాగించి క్షణంలో అతనిని నిర్వీర్యుని చేసి పట్టి బంధించి

తెచ్చి ద్రోణాచార్యుని ముందు నిలువబెట్టాడు. ఈ విధంగా అర్జునుని పరాక్రమం సర్వత్ర లోకవిదితం అయింది.

ద్రౌపదీస్వయంవరవార్త విని పాండవులు ఏకచక్రపురంనుండి ద్రుపదనగరం దిక్కుగా సాగిపోతూ ఉన్నారు. త్రోవలో వారిని గంధర్వులు నిరోధించారు. అప్పుడు అర్జునుడు తన అస్త్రకౌశలాన్ని ప్రదర్శించి ఆ గంధర్వుల గర్వం అణచి వారి రాజు అగు అంగారపర్ణుడు అనువానిని పట్టుకొన్నాడు. అంతముందు వారికి ఇరువురకునూ మైత్రీబంధం ఏర్పడింది. ద్రౌపదీస్వయంవరకాలంలో సభలోనివారు ఎవ్వరూ సాధించలేని కార్యాన్ని అర్జునుడు సాధించి చూపాడు. దుర్యోధనుడు, సాల్వుడు, జరాసంధుడు, శల్యుడు మొదలైన మహాబలవంతులైన రాజన్యులు, రాజకుమారులు ఎందరో అక్కడ ఉంచబడిన ధనుస్సును ఎక్కుపెట్టడానికి ప్రయత్నించి విఫలులు అయ్యారు. కాని అర్జునుడు క్షణాలలో ధనువును ఎక్కుపెట్టి ఎల్లవారలూ చూచుచుండగా లక్ష్యాన్ని ఛేధించాడు. అప్పుడు అతడు బ్రాహ్మణరూపంలో ఛద్మవేషదారియై యున్నాడు. ఆ కారణంగా అతడు బ్రాహ్మణుడే అనుకొని అతనిని పరాభవింప సమకట్టారు. కాని వారి యుక్తులు, యత్నాలు ఏవీ అర్జునుని ముందు, భీముని ముందు ఫలించలేదు. అప్పుడు అర్జుననకు కర్ణునకు నడుమ బాణయుద్ధమూ, భీమునకు శల్యునకు నడుమ గదా యుద్ధము సాగాయి. కాని ఆ భీమార్జునుల ముందు వారు ఇరువురూ పరాభవం పాలు కావలసి వచ్చింది.

ఖాండవవనదహనకాలంలో కూడ అర్జునుడు అద్భుతపరాక్రమాన్ని ప్రదర్శించాడు. కృష్ణార్జునుల సహాయంతో అగ్నిదేవుడు ఖాండవవనాన్ని దహింప నారంభించగా అతని ప్రచండమైన వేడిమిని భరించలేక వెలుచిదేవతలు ఎల్లరూ ఇంద్రుని కడకు వెళ్లారు. అప్పుడు ఇంద్రుడు ఆదేశింపగా మేఘాల దండు వచ్చి ఆ యగ్నిని చల్లార్చుటకై కుంభవృష్టిని కురియింప నారంభించాయి. అర్జునుడు ఆ వర్షానికి దీటుగా బాణవర్షం కురిపించి జలధారలను నేలమీద రాలకుండ ఆకాశమధ్యమందే నిరోధించివేసాడు. ఇంద్రుడు కూడ తన తీక్షణ అస్త్రాలను వర్షంగా కురియించి అర్జుననకు ప్రతిగా ఎదిరించే ప్రయత్నం చేసాడు. ఇరువంకలనుండియు భయంకరయుద్ధం సాగింది. కృష్ణుడు తన చక్రాయుధంతోనూ, అర్జునుడు తీవ్రబాణపరంపరతోను

దేవతల సైన్యాన్ని అంతనూ తుదముట్టించారు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు తన కరాళకాలరూపాన్ని ప్రకటించాడు. దేవతలు, దానవులు కూడ అతని పౌరుషాన్ని గాంచి అబ్బురపడిపోయారు. కడకు ఇంద్రుని సంబోధించి ఆకాశవాణి "దేవరాజా! ఈ యుద్ధంలో నీవు ఏ విధంగా కూడ కృష్ణార్జునులను గెలువలేవు. వారు సాక్షాత్తూ నరనారాయణులు. వారి శక్తికి, పరాక్రమానికి పరిధులులేవు. ఎట్టివారికైన వారు అజేయులు. నీవు దేవతలను వెంట బెట్టుకొని యిటనుండి మరలిపోవడమే మంచిది. అని అతనికి తెలియ బలికింది. ఆ వాణిని విని దేవరాజు ఇంద్రుడు తన సైన్యాన్ని తోడ్కొని వెనుకకు మఱలిపోయాడు. అంతట ఎల్లవారలూ చూచుచుండగా అగ్నిదేవుడు ఆ విశాలమైన ఖాండవవనాన్ని అంతనూ భస్మీపటలం చేసివేసాడు. అర్జునుడు తనకు అందించిన సహకారంతో ప్రసన్నత చెంది అగ్నిదేవుడు అతనికి దివ్యాస్త్రాలను ప్రసాదించాడు. ఇంద్రుడు కూడ అర్జునుని అస్త్రవిద్యానైపుణ్యం చేత ముగ్ధుడై అతనికి సమయం వచ్చినప్పుడు అస్త్రాలను ఇచ్చెదనని వాగ్దానం చేసేడు. అగ్నిదేవుని చేత ప్రేరితుడై వరుణదేవుడు కూడ అర్జునునకు అక్షయతూణీరము, గాండీవధనుస్సును, వానరచిహ్నం గల పతాకతో విలసిల్లే రథాన్ని యుద్ధానికి ముందుగా బహూకరించాడు.

పాండవులు రెండవమాఱు జూదంలో ఓడి వనవాసం చేస్తూ ఉన్న కాలంలో ఒకనాడు వేదవ్యాసమహర్షి వారి కడకు వచ్చి వారిలో ధర్మనందనుని ఏకాంత ప్రదేశమునకు తోడ్కొనిపోయి అతనితో ఇలా అన్నాడు - "ధర్మనందనా! అర్జునుడు నారాయణుని సహచరుడు. అతడు మహాతపోధనుడైన నరర్షి అవతారం. అతనిని ఎవ్వరూ జయించలేరు. అతడు అచ్యుతస్వరూపుడు. అతడు తన తపఃప్రభావంతోను, పరాక్రమప్రభావంతోను దేవతలను కూడ దర్శింపగలవాడు. కాబట్టి నీవు అతనిని అస్త్రవిద్యను బడయుటకై శంకరుని కడకు, దేవరాజైన యింద్రుని కడకు సమవర్తి వరుణకుబేరుల కడకును పంపుము! అతడు వారివలన వివిధములైన అస్త్రవిద్యారహస్యాలను గ్రహించి అద్భుతపరాక్రమాన్ని ప్రదర్శించగలుగుతాడు. నీవు కోల్పోయిన రాజ్యాన్ని మఱల గ్రహించి తెచ్చి నీకు సమర్పింపగలుగుతాడు". అనగా విని ఆ మహర్షి యాజ్ఞను శిరసావహించి యుధిష్ఠిరుడు వెంటనే అర్జునుని రావించాడు. అతనికి ఆ

మహర్షి చేత మంత్రదీక్షను ఇప్పించి అతనిని ఇంద్రుని దర్శించుటకై యింద్రకీలాద్రికి పంపాడు. అప్పుడు అర్జునుడు ఇంద్రకీలాద్రిని చేరి అక్కడ ఇంద్రుని ఒక మహాతపోధనుని రూపంలో దర్శించాడు. ఇంద్రుడు ఇతనికి స్వర్లోకభోగాలను, ఐశ్వర్యాన్ని కల్పింతునని ప్రలోభం చూపాడు. కాని అర్జునుడు అవి యేవియు ఒల్లక తనకు అస్త్రవిద్యనే నేర్పవలసినదిగా అతనిని అభ్యర్థించాడు. అప్పుడు ఇంద్రుడు "నీవు ముందుగా శంకరుని తపము చేత మెప్పించి దర్శించి అటుపిమ్మట స్వర్గమునకు రమ్ము. అప్పుడు నీకు ఎల్ల దివ్యాస్త్రాలను అర్పించెదను అని బదులు చెప్పాడు. ఆ మాటలు విని అతడు వెంటనే కఠోరతపోనిమగ్నుడు అయ్యాడు. అతని తపమునకు మెచ్చి శంకరభగవానుడు ఒక బోయవాని రూపంలో అతనిముందు ప్రత్యక్షం అయ్యాడు. ఒక అడవి పందిని గూర్చి వారికి ఇరువురకును వివాదం సంభవించింది. ఆ వివాదం క్రమంగా వారి నడుమ యుద్ధానికి దారి తీసింది. అర్జునుడు ఆ యుద్ధంలో తన అస్త్రకౌశలంతో శంకరునకు ప్రసన్నత కలిగించాడు. అప్పుడు శంకరుడు అతనితో ఇలా అన్నాడు - అర్జునా! నీ అనుపమానధైర్యసాహసాలచేత నేను ప్రసన్నత చెందాను. నీవంటి ధీరుడు, వీరుడు అయిన క్షత్రియుడు వేఱొకడు లేడు. తేజమునందు, బలమునందు నీవు నాతో సమానుడవు. నీవు సనాతన ఋషివి. నేను నీకు దివ్యజ్ఞానాన్ని ప్రసాదిస్తూ ఉన్నాను. నీవు దేవతలను కూడ జయింపగలవు. ఈ విధంగా పలికిన మీదట శంకరభగవానుడు పార్వతీసమేతుడై అర్జునునకు దర్శనం ఒసగి యథావిధిగా పాశుపతాస్త్రదీక్షను ఇచ్చాడు. ఇట్లు మహాదేవుని అనుగ్రహమును పడసి అర్జునుడు స్వర్గమునకు వెడలుటకు ఉద్యమిస్తూ ఉండగా ఇంద్రవరుణయమకుబేరులు నలుగురు దిక్పాలకులూ అక్కడకు వచ్చారు. వారిలో యముడు వానికి దండమును, వరుణుడు పాశమును, కుబేరుడు అంతర్ధానవిద్యను అతనికి ప్రసాదించారు. స్వర్గానికి వచ్చిన మీదట అస్త్రమును ఇచ్చెదనని యింద్రుడు అతనితో చెప్పేడు. అప్పుడు వారు నలుగురూ అటునుండి వెడలిపోయారు. అనంతరం ఇంద్రుడు రథం పంపగా దానిని అధిరోహించి అర్జునుడు స్వర్గానికి వెళ్లాడు. అచ్చట అయిదు ఏండ్లు ఉండి అతడు అస్త్రజ్ఞానాన్ని పడసి దానితో బాటుగా చిత్రసేనుడను గంధర్వునినుండి గంధర్వవిద్యను కూడ అభ్యసించాడు.

ఈ విధంగా ఇంద్రునివలన అస్త్రవిద్యను పడసిన పిమ్మట అతడు సర్వాస్త్రప్రయోగములందును నిపుణుడు అయ్యాడు. అప్పుడు నివాతకవచులనే దానవులను వధింపుమని యింద్రుడు అతనిని ఆదేశించాడు. ఆ దానవులు సముద్రగర్భంలో ఒక దుర్గమప్రదేశంలో ఉండేవారు. వారు మూడు కోట్లమందిగా చెప్పబడ్డారు. వారిని దేవతలు కూడ జయింపలేకున్నారు. అర్జునుడు ఒక్కడే పోయి వారిని ఎల్లరనూ సంహరించివేసాడు. అంతియేకాదు. వారిని సంహరించి మఱలి వస్తూ ఉన్నవేళ అతనికి కాలికేయ పౌలోములు అనబడే దైత్యులు ఎదురు అయ్యారు. పోరాటం సాగించి అతడు వారిని కూడ తెగటార్చివేసాడు. ఈ విధంగా ఇంద్రునకు ప్రియము చేకూర్చి కొన్నినాళ్లు ఇంద్రపురంలో ఉండి అతడు మఱల తన సోదరుల చెంతకు మఱలివచ్చాడు.

స్వర్గమునుండి మఱలి వచ్చిన పిదప ఇతడు వనవాసకాలంలోనూ ఒక సంవత్సరం అజ్ఞాతంగా విరాటనగరంలోనూ ఉన్న సందర్భంలో కూడ అద్భుతపరాక్రమాన్ని ప్రదర్శించాడు. వనంలో ఉన్న కాలంలో ఇతడు దుర్యోధనాదులను విడిపించడంకోసం గంధర్వులతో పోరాటం సాగించాడు. ఈ విషయం యుధిష్ఠిరుని ప్రసంగంలో ముందే వివరించడం జరిగింది. అటుపిమ్మట వనవాస కాలం 12 ఏండ్లూ ముగించుకొని పాండవులు ఒక యేడు అజ్ఞాతవాసపు నిబంధనను పూర్తి చేయడంకోసం విరాటనగరం చేరి అక్కడ ఉండసాగారు. అప్పుడు వారి ఉనికిని తెలుసుకోవడంకోసం దుర్యోధనుడు విరాటనగరం మీద దండెత్తాడు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ మొదలైన ప్రముఖవీరులు అందఱూ అతనికి బాసటగా నిలిచియున్నారు. వీరి సహాయంతో దుర్యోధనుడు విరాట రాజుయొక్క 60 వేల గోవులను తరలించుకొని పోవసాగాడు. అప్పుడు విరాటరాజు కొడుకు ఉత్తరుడు బృహన్నలరూపంలో ఉన్న అర్జునుని తన రథసారథిని గావించుకొనిపోయి ఆ దుర్యోధనుని నిరోధింప పూనుకొన్నాడు. కాని కౌరవుల విశాలసైన్యాన్ని చూచి ఉత్తరుడు భయకంపితుడై రథం దిగి వెనుకకు పాఱిపోవసాగాడు. బృహన్నల రూపంలో ఉన్న అర్జునుడు అతనిని పట్టుకొని అతనికి అనేకవిధాల నచ్చచెప్పి అతనిని తన సారథిని జేసికొని తాను స్వయంగా కౌరవులను ఎదిరించి పోరాట సమకట్టాడు. ఆ

యుద్ధంలో అతడు ఒక్కొక్కరుగా కర్ణుని, కృపాచార్యుని, ద్రోణుని, అశ్వత్థామను, దుర్యోధనుని పరాజితులను చేసి భీష్ముని మూర్ఛితుని గావించివేసాడు. అనంతరం భీష్ముడు, దుర్యోధనుడు, కర్ణుడు, దుశ్శాసనుడు, వివింశతి, ద్రోణుడు, అశ్వత్థామ, కృపాచార్యుడు - ఈ మహారథులందఱునూ కూడి ఒక్కుమ్మడిగా అర్జునుని మీద విరుచుకొని పడ్డారు. వారు నాలుగువంకల అతనిని ముట్టడించారు. అయినా అర్జునుడు వారిని లెక్కచేయలేదు. జడిగా బాణాలు కురిపించి ఆ యెల్ల వీరుల పీచమును అణచి చివరిగా సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించాడు. దానితో కౌరవవీరులు అందరూ తమ చేతులలోని అస్త్రాలు జాఱి క్రిందపడిపోగా తెలివి తప్పి నేలమీద పడిపోయారు. అప్పుడు అర్జునుడు తలచుకొంటే ఆ యెల్లర ప్రాణాలనూ హరించగలవాడే. కాని అతడు అట్లు చేయలేదు. అట్టి విషయాలకు అతడు అతీతుడు. తెలివిని పొందిన మీదట భీష్ముని అభిమతమును అనుసరించి కౌరవులు గోవులను వదలి మఱలిపోవడమే మేలని తలచి వెడలిపోయారు. అర్జునుడు విజయఘోషతో విరాటనగరానికి వెడలిపోయాడు. ఈ విధంగా అర్జునుడు విరాటుని గోవులను వెనుకకు మరలించుటతోపాటు అతని గౌరవమర్యాదలను కూడ కాపాడి తమకు ఆశ్రయ మిచ్చిన రాజు ఋణాన్ని కూడ పలురెట్లు అధికంగా తీర్చివేసాడు. ఆహా! అతని ప్రభుభక్తి ఎంత ప్రశస్తమైనది?

మహాభారతయుద్ధంలో ప్రధానపాత్రధారి అర్జునుడే. పాండవుల సైన్యానికి ప్రధానసేనాధిపతి కూడ అతడే. శ్రీకృష్ణభగవానుడు ఇతని సారథ్యానికే సహర్షంగా సమ్మతించాడు. భీష్మద్రోణకర్ణులు, అశ్వత్థామ మొదలైన అజేయులైన యోధులను ఎదిరించి నిలువగల సామర్థ్యం ఒక్క అర్జునునకు గాక మఱి యెవ్వరికి ఉంటుంది? ఇతని ప్రత్యర్థిత్వాన్ని వారందరూ మన్నించేవారు. జయద్రథవధసమయంలో ఇతడు ప్రదర్శించిన అద్భుతపరాక్రమమూ, అస్త్రకౌశలమూ సాటిలేనిది. ఇతని భయంకరశపథాన్ని విని ఆనాడు కౌరవులు జయద్రథుని సర్వసైన్యానికి వెనుకభాగాన నిలువబెట్టారు. కొన్ని అక్షౌహిణుల సైన్యం నడుమనుండి దారి చేసుకొంటూ అర్జునుడు ఎంతో నేర్పుతోను, ఉత్సాహంతోను ముందుకు చొచ్చుకొని పోవసాగాడు. శత్రుసైన్యానికి చెందిన వేనవేలు వీరులు, ఏనుగులు, గుఱ్ఱాలు అతని అమోఘబాణాలకు గుఱి అయినాయి. అతడు రథంమీద ఉండియే

ఒకక్రోసు దూరంవఱకు ఉన్న శత్రువులను నిహతులను గావిస్తూ ముందునకు సాగిపోతూ ఉన్నాడు. అంతలో సాయంకాలం కావచ్చింది. అతని గుఱ్ఱాలు బాణప్రహారాల కారణంగా వ్యథ చెందుతూ, అధికపరిశ్రమ కారణంగా అలసిపోయి ఉన్నాయి. ఈ బాధ కాక అదనంగా వానిని ఆకలిదప్పులు కూడ బాధిస్తూ ఉన్నాయి. అప్పుడు అర్జునుడు - బావా! నీవు ఈ గుఱ్ఱాలను విప్పి వాని శరీరంలో గ్రుచ్చుకొన్న బాణాలను తొలగిస్తూ ఉండు! అంతవరకు కౌరవసైన్యాన్ని నిరోధిస్తూ ఉంటాను అని శ్రీకృష్ణునితో చెప్పి తాను రథం దిగి బహు జాగరూకతతో చేతనువును ధరించి అవిచలభావంతో నిలువబడ్డాడు. అతనిని పరాజితుని గావించడానికి అదే అదను అని భావించి శత్రుపక్షపు వీరులు ఎల్లరూ ఒక్కుమ్మడిగా అతని చుట్టుముట్టి అతనిమీద వివిధరకాల బాణాలను, శస్త్రాలను జడిగా కురిపించారు. అయినా అర్జునుడు చలించలేదు. వారికి ప్రతిగా తాను అస్త్రాలు ప్రయోగించి వారి అస్త్రాలను వమ్ముచేసి వారిపై శరపరంపరలను గుప్పించి వాటితో వారిని కప్పివేసాడు. ఇక్కడ అర్జునునితో కృష్ణుడు - "అర్జునా! గుఱ్ఱాలు దప్పికతో బాధపడుచున్నాయి. చేరువగా జలాశయం ఏదీ లేదు. ఏమి చేయుదును? అన్నాడు. అంతట అర్జునుడు అస్త్రప్రయోగంతో భూమిని ఛేదించి నీరువెలికి ఉబుకునట్లు చేసి ఒక సరోవరాన్నే కల్పించాడు. ఆ సరోవరానికి పైభాగాన బాణాలతో ఒక గృహాన్ని నిర్మించాడు. అతని యీ అద్భుతచర్యను, అభూతపూర్వ పరాక్రమాన్ని గాంచి సిద్ధులు, చారణులు, సైనికులు ఎల్లరూ పరమాశ్చర్యం పొంది ప్రశంసాకలకలం చేయసాగారు. కాకలు తీరిన గొప్పగొప్ప మహారథులు కూడ నేలమీద నిలబడియున్న అర్జునుని వెనుకంజ వేయించలేకపోయేరు. అంతలో శ్రీకృష్ణుడు చురుకుగా గుఱ్ఱాల శరీరాలపై నాటుకొన్న బాణాలను లాగివేసి వానిని స్నానమాడించి, వాని దేహాలను అలసట తీర మర్దనం చేసి, వానిచేత నీరములను త్రాగించి, మేతలు మేయించి, నేలమీద అలసటతీర ఒకింత తడవు పరుండజేసి మఱల వానిని రథానికి పూన్చి సిద్ధం చేసాడు. అప్పుడు అర్జునుడు మఱల రథారూఢుడై జయద్రథుని చేరువకు పోవుచున్నంతలో ఎనమండుగురు మహారథులు ఒక్కుమ్మడిగా అతనిని చుట్టుముట్టి నిరోధింప యత్నించారు. దుర్యోధనుడు తన బావమఱదిని కాపాడే తలంపుతో అతని చుట్టూ

సేనావలయాన్ని కల్పించాడు. అయినా అర్జునుడు వారిని అందరను చీల్చిచెండాడుతూ ముందుకు చొచ్చుకొని పోవసాగాడు. ఇతని వేగాన్ని ఎవరూ నిరోధించలేక పోయారు. ఇతడు శ్రీకృష్ణుని దయవలన సూర్యాస్తం అవుతూ అవుతూ ఉండగా జయద్రథుని తన వజ్రతుల్యబాణానికి గుఱి చేసాడు. ఇతడు ఆ బాణప్రయోగం కూడ జయద్రథుని తలతెగి యెగసిపోయి కురుక్షేత్రానికి వెలుపల ఉన్న అతని తండ్రి ఒడిలో పడునట్లు అత్యంత నిపుణతతో చేసాడు. ఈ విధంగా శ్రీకృష్ణునిసాయంతో అర్జునుడు సూర్యాస్తమయం కాకముందే జయద్రథుని సంహరించి తన శపథాన్ని నెగ్గించుకొన్నాడు.

అర్జునుడు కేవలమూ జగద్విజేతయైన వీరవరుడూ, అద్వితీయ ధనుర్ధారి మాత్రమేకాదు. అతడు గొప్ప సత్యప్రతిజ్ఞాలక్షణం కలవాడు, సదాచారపరాయణుడు. ధర్మవిదుడు, జితేంద్రియుడు కూడ. పాండవులు ఇంద్రప్రస్థంలో ఉన్న కాలంలో ఒకనాడు కొందరు దోపిడి దొంగలు ఒక బ్రాహ్మణుని గోవులను హరించికొనిపోయారు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు తన గోవులను దొంగలనుండి విడిపించి తెచ్చిపెట్టుడని పాండవుల కడకేగి మొరపెట్టుకొన్నాడు. అతని మొఱను ఆలకించి అర్జునుడు అతని గోవులను మఱలించి తెచ్చి యిచ్చెదనని అతనికి వాగ్దానం చేసాడు. కాని ఆ సమయంలో అతని ఆయుధాలు అతని దగ్గఱ లేకపోయాయి. అవి మహారాజు యుధిష్ఠిరుడు ద్రౌపదితో ఏకాంతవాసం చేస్తూ ఉన్న గృహంలో ఉండిపోయాయి. ఒక సోదరుడు ద్రౌపదితోడ ఏకాంతవాసం చేస్తూ ఉన్న మందిరంలోనికి తక్కిన సోదరులు ఎవ్వరూ పోరాదని, అట్లు పోయినవారు పండ్రెండు ఏండ్ల వరకు అఖండ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ వనవాసం చేయాలని పాండవులు ఏవురూ ముందుగానే ఒక నియమం ఏర్పఱచుకొని యున్నారు. ఆ కారణంగా అర్జునుడు ఇప్పుడు ద్వివిధావస్థలో చిక్కుకొన్నాడు. బ్రాహ్మణుని గోవులను రక్షింపకుంటే అతనికి క్షత్రియధర్మలోపం కలుగుతుంది. రక్షణకు వలయు అస్త్రాలకోసం అన్నయొక్క ఏకాంతమందిరంలో ప్రవేశిస్తే నియమభంగదోషం ప్రాప్తిస్తుంది. కడకు అతడు నియమభంగానికి పాల్పడియైన బ్రాహ్మణుని గోవులను కాపాడుటకై నిశ్చయించుకొన్నాడు. అప్పుడు అతడు తనలో ఇలా తర్కించుకొన్నాడు. - నియమభంగం కారణంగా నేను

ఎంత కఠినమైన ప్రాయశ్చిత్తం చేసుకోవలసివచ్చినా, కడకు నా ప్రాణాలనే అర్పించవలసివచ్చినా జంకను. ఆ బ్రాహ్మణుని గోవులను కాపాడి అపరాధులను దండించటమే నాకు ఇప్పుడు పరమధర్మం అవుతుంది. అలా చేయడం నాకు నా ప్రాణరక్షణంకంటెను మూల్యవంతమైన కర్తవ్యం ఆహా! అతని ధర్మప్రీతి ఎంత ధన్యవాదపాత్రమైనది?

ఇలా తర్కించుకొని కడకు అర్జునుడు మౌనంగా తన అన్న మందిరంలో ప్రవేశించి అస్త్రాలను తీసుకొని వెంటనే పోయి బ్రాహ్మణుని గోవులను విడిపించాడు. వానిని తెచ్చి బ్రాహ్మణునకు అర్పించాడు. అటనుండి మఱలి తన యన్నకడకు చేరి తాను చేసిన నియమభంగదోషాన్ని తొలగించుకోవడంకోసం తనకు వనవాసం చేయడానికి అనుమతి ఇమ్మని అర్థించాడు. అప్పుడు యుధిష్ఠిరుడు అతనితో ఇలా అన్నాడు - "సోదరా! నీ దోషం ఏదీలేదు. అన్న తన భార్యతో కూడి యుండగా అనుజుడు అక్కడకు పోవడం అపరాధం కాదు. ఒకింత అపరాధం జరిగినా అది నన్ను గూర్చి జరిగింది. కాని వేరుకాదు. నేను నిన్ను ఇచ్ఛాపూర్వకంగా క్షమిస్తున్నాను. నీవు ధర్మపాలనంకోసం నియమభంగం చేసావు. కాని వేఱు విధంగా కాదు. కాబట్టి యీ విధంగా ఆలోచించినా నీవు వనానికి పోనక్కఱలేదు. ఆలోచించి చూడగా నియమభంగ సంబంధమైన ప్రాయశ్చిత్తవిధానం నుండి తప్పుకోవడానికి అర్జునునకు ఇది మంచి అవకాశం. ఈ కాలంవారు అయితే చట్టపు ఉచ్చులలో తగులుకొన్న వేళ తమ బంధవిముక్తికై చట్టాన్నే ఆశ్రయించడం ఉచితమని భావిస్తారు. కాని అర్జునుడు అట్టివాడు కాడు. ఏదియో ఒక నెపంతో దండాన్ని తప్పించుకోవడం అనేది అతనికి ఎరుగరాని విషయం. అతడు తన అన్న తనకు ఎన్ని విధాల నచ్చజెప్పినా పరిగణించక సత్యాన్ని సంరక్షించుకోవడంకోసం నియమాన్ని పాలించడమే యుక్తం అని తలచి వనవాసదీక్ష వహించి అటనుండి బయలుదేరాడు. చూచితిరా అతని సత్యప్రతిజ్ఞాలక్షణం ఎంత మహత్తరమైనదో? పరికించితిరా అతని నియమపాలననిష్ఠ ఎంత పటిష్ఠమైనదో?

అర్జునుడు ఇంద్రపురంలో ఉండి అస్త్రవిద్యను, గాంధర్వవిద్యను అభ్యసించే కాలంలో ఒక నాటి రాత్రివేళ అతనిని సేవించడంకోసం అచ్చరలలో సర్వశ్రేష్ఠురాలైన ఊర్వశిని ఇంద్రుడు అతని కడకు పంపాడు. ఆనాడు

సభలో అర్జునుడు నిర్నిమేషదృక్కులతో ఊర్వశివంకకే చూస్తూ ఉండడాన్ని ఇంద్రుడు పరికించాడు. ఊర్వశి కూడ ముందే అర్జునుని రూపగుణసంపదను గాంచి ముగ్ధురాలై ఉంది. ఆమె ఇంద్రుని ఆదేశానుసారం చక్కగా శృంగారం చేసుకొని అర్జునుని కడకు వచ్చింది. ఆ విధంగా రాత్రివేళ ఒంటరిగా సంకోచం ఏమీ లేకుండా తన చెంతకు వచ్చిన ఊర్వశిని చూచి అర్జునుడు ఎంతయో తత్తరపాటు చెందాడు. అతడు సౌశీల్యం కారణంగా తన కన్నులు మూసుకొని ఆమెకు తల్లికివలె నమస్కారం చేసేడు. ఆ పరిస్థితిని గాంచి ఊర్వశి చకితురాలయింది. అర్జునుడు తనతో ఈ విధంగా వ్యవహరిస్తాడని ఆమె అనుకోలేదు. ఆమె బాహాటంగానే తన కామవాంఛను తీర్చుమని అతనిని ప్రార్థించింది. ఆమె కోరికను విని అతడు ఎంతయో లజ్జతో క్రుంగిపోయాడు. అతడు తన రెండు చేతులతో రెండు చెవులను మూసుకొని ఆమెతో ఇలా అన్నాడు - "అమ్మా! ఏ మంటున్నావు? శివ! శివ! అట్టి మాట నీవు అనరాదు. నేను వినరాదు. నిస్సందేహంగా నీవు నాకు గురుపత్నీతుల్యురాలవు. దేవసభలో నేను నీవంకకు నిర్నిమేషదృక్కులతో చూచిన మాట నిజం. కాని అలా చూడడానికి వెనుక నామనస్సులో దుర్భావన మాత్రం ఏమీ లేదు. పురువంశానికి మౌలికమాతృమూర్తి యీమెయే కదా! అని అప్పుడు నేను ఆలోచిస్తూ ఉన్నాను. అందుచేతనే నేను నీవంక అలా చూడడం సంభవించింది. దేవీ! నా విషయంలో నీవు అన్యథా ఏమీ ఆలోచింపరాదు. నీవు నాకు పెద్దలలో పెద్దదానవు. నా పూర్వజులకు మాతృదేవతవు.

శ్లో॥ యథా కుంతీ చ మాద్రీ చ శచీచైవ మమానఘే ।
తథా చ వంశజననీ త్వంహిమేఽద్య గరీయసీ ॥
గచ్ఛ మూర్ధ్నా ప్రపన్నోఽస్మి పాదౌతే వరవర్ణిని ।
త్వం హి మే మాతృవత్పూజ్యా రక్ష్యోఽహం పుత్రవత్త్వయా ॥

(మహా. వన. 46/46-47)

కుంతి, మాద్రి, శచీదేవి నాకు మాతృమూర్తులు, కురువంశానికి జనయిత్రివి అగుటచేత నీవు కూడ నాకు వారివలె పూజనీయురాలవైన తల్లివి. నేను చరణాలపై తలవంచి నమస్కరిస్తున్నాను. అనగా విని ఊర్వశి ఆగ్రహోదగ్రురాలై మండిపడి అర్జునా! నేను ఇంద్రుని ఆజ్ఞచేత

కామాతురాలనై నీ చెంతకు వచ్చితిని. కాని నీవు నా ప్రేమను నిరాకరించావు. నేను ఇదే నిన్ను శపిస్తున్నాను.- "పో! ఆడువారి నడుమ నాట్యమాడేవాడవై పడియుండు! జనులు అందరూ నిన్ను నపుంసకుడని పేర్కొందురు గాక! అని అతనిని శపించింది. అర్జునుడు ఆ శాపాన్ని సహర్షంగా స్వీకరించాడు. కాని ధర్మభంగానికి మాత్రం ఒడబడలేదు. ఏకాంతంలో ఇచ్ఛాపూర్వకంగా చేరవచ్చిన ఊర్వశివంటి భువనమోహనసౌందర్యరాశిని నిరాకరించడం వంటి మనోనిగ్రహం అర్జునునకే చెల్లింది. ఆహా! జితేంద్రియత్వానికి ఎంత చక్కని ఉదాహరణమిది? ఈ విషయం ఇంద్రునకు తెలిసింది. అతడు అర్జునుని పిలిచి అతని వెన్నుతట్టి అతనితో - వత్సా! నీవంటి తనయుని గాంచి నీ తల్లి ధన్యురాలు అయింది. నీవు నీ మనోనిగ్రహంతో ఋషులను కూడ గెలిచావు. ఇక నీవు ఏ విధంగానూ చింతించవలదు. ఊర్వశి విధించిన శాపము నీ పాలిట వరదానంగా పరిణమించగలదు. పదమూడవ యేట అజ్ఞాతవాసకాలంలో అజ్ఞాతుడవై ఉండడంలో నీకు ఈ శాపం సహకరిస్తుంది. అనంతరం నీకు మఱల పుంస్త్వం ప్రాప్తిస్తుంది అని పలికి అతనిని ఊరడించాడు. నిజమే. "ధర్మోరక్షతి రక్షితః" అని కదా! శాస్త్రం చెపుతోంది.

విరాటనగరంలో తమ అజ్ఞాతవాసపు గడువు ముగిసిన మీదట పాండవులు విరాటరాజు ముందు తాము పాండవులమని ప్రకటించుకొన్నారు. అప్పుడు విరాటరాజు కృతజ్ఞతాపూర్వకంగా తన కుమార్తె ఉత్తరను అర్జునునకు ఇచ్చి పెండ్లి చేయగోరాడు. కాని ఆ ప్రస్తావనను అర్జునుడు అంగీకరించలేదు. ఆ సందర్భంలో అతడు విరాటరాజుతో - రాజేంద్రా! నేను చాల కాలం మీ రాణివాసంలో ఉన్నాను. మీ కుమార్తె ఏకాంతమందు, ఎల్లర సమక్షమందును కూడ పుత్రికాభావంతోనే చూస్తూ వచ్చాను. ఆమె కూడ నన్ను పితృభావనతోనే విశ్వసిస్తూ వచ్చింది. నేను ఆమె ముందు నాట్యమాడేవాడను. పాడేవాడను. కాబట్టి ఆమెకు నాయందు విశేషంగా ప్రీతి యున్నది.కాని ఆమె నన్ను గురువుగానే భావిస్తూ వచ్చింది. ఆమె ప్రాయమునందున్నది. ఆమెతో నేను ఒక ఏడాది కాలము గడపవలసినవాడనై చరించాను. కాబట్టి మీకు గాని అన్యులకు గాని మా యిరువురి విషయమున ఎట్టి సందేహాలు కలుగకుండ ఉండడం కోసం నేను ఆమెను నా కోడలిగ స్వీకరిస్తాను. అలా చేసిననాడు మా యిరువుర శీలము పవిత్రమైనదిగా భావింపబడుతుంది.

అని తన యభిమతమును తెలియజెప్పేడు. అర్జునుని యీ పవిత్రమైన ప్రస్తావనను ఎల్లవారలూ ఆమోదించారు. అనంతరం ఉత్తరాభిమన్యులకు వైభవోపేతంగా వివాహం జరిగింది. యుక్తవయస్కురాలైన కన్యతో ఒక సంవత్సరకాలం దగ్గరగా మసలుతూ ఉండి కూడ తన శీలాన్ని పవిత్రంగా నిలుపుకోగలుగడం అన్నది జితేంద్రియులలో అగ్రగణ్యుడైన ఒక్క ఆ అర్జుననకే చెల్లింది. అతని మనోభావాలలో కూడ వికారం కలుగకపోవడం అతని సచ్చరిత్రకు ప్రబలనిదర్శనం. ఈడువచ్చిన నేటి విద్యార్థినులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కూడ ఈ అర్జునుని నుండి పాఠం నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతయో ఉన్నది.

అశ్వత్థామ రాత్రివేళ నిదురిస్తూ ఉన్న పాండవుల బిడ్డలను, ధృష్టద్యుమ్నాదులను సంహరించి తాను గంగాతీరానికి పోయి అచ్చట కూర్చున్నాడు. అతని క్రూరకృత్యానికి సంబంధించిన వార్తనెఱిగి భీమార్జునులు ప్రతీకారం చేయడంకోసం అతనిని అన్వేషిస్తూ అతని వెనుక గంగాతీరం దిక్కుగా వెళ్ళారు. తన దిక్కుగా వస్తూ ఉన్న భీమార్జునులను గాంచి అశ్వత్థామ మిక్కిలి భయకంపితుడు అయ్యాడు. వారి బారినుండి తప్పుకోవడానికి దారి గానక అతడు వెంటనే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అంతట చూస్తూ చూస్తూ ఉండగా ప్రళయకాలాగ్నులను బోలు అగ్నులు ఆవిర్భవించి జ్వాలలు ఎల్లదిక్కుల క్రమ్ముకోసాగాయి. ఆ బ్రహ్మాస్త్రాన్ని శాంతింపజేయడంకోసం అర్జునుడు దానికి ప్రతిగా తాను కూడ మఱియొక బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. దానితో రెండు అస్త్రాలు ఒకదానితో ఒకటి ఢీకొని గర్జనలు బహిర్గతం కాసాగాయి. వేనవేలు ఉల్కలు ఊడిపడసాగాయి. ప్రాణిలోకం అంతా భయగ్రస్తం కాసాగింది. ఈ దారుణకాండను చూచి నారదుడు, వ్యాసమహర్షి ఒక్కుమ్మడిగా అక్కడకు విచ్చేసి యీ వీరులను ఇరువురను శాంతింపజేయుటకు ఉద్యమించారు. ఆ మహానుభావుల మాటను మన్నించి అర్జునుడు తన అస్త్రాన్ని ఉపసంహరించాడు. అతడు తన అస్త్రాన్ని కేవలమూ అశ్వత్థామ యొక్క అస్త్రాన్ని శాంతింపజేయడంకోసమే ప్రయోగించాడు. ఒకసారి ఆ అస్త్రాన్ని ప్రయోగించడం జరిగితే వెంటనే దానిని ఉపసంహరించడం చాలకష్టం. కేవలమూ బ్రహ్మచారి అయినవాడు మాత్రమే దానిని ఉపసంహరించగలుగుతాడు. అశ్వత్థామ కూడ ఆ

యిరువురు మహాపురుషుల మాటను మన్నించి తన అస్త్రాన్ని కూడ ఉపసంహరించడానికి విశేషంగా ప్రయత్నించాడు. కాని మనోనిగ్రహం లేనివాడైన కారణంగా దానిని వెనుకకు మరలించలేకపోయాడు. కడకు వ్యాసుని సూచనను అనుసరించి అతడు ఆ అస్త్రానికి ఉత్తర గర్భాన్ని లక్ష్యం చేసాడు. అంత ఆమె గర్భంలోని శిశువు మృతుడై జన్మించాడు. కాని వానిని శ్రీకృష్ణుడు పునరుజ్జీవింపజేసాడు. ఈ విధంగా అర్జునునిలో శౌర్యవీర్యాలతో, అస్త్రజ్ఞానంతో పాటుగా జితేంద్రియత్వలక్షణం కూడ సమ్మిళితమై నిండి నిబిడీకృతమై యుంది.

అర్జునుని జీవనము ఒక దివ్యమైన జీవనము. అతని చరిత్రను పరిశీలించిన కొలది అందు మనకు ఎన్నో ఆదర్శములు, మనం నేర్చుకోదగిన సద్గుణాలు గోచరిస్తూనే ఉంటాయి.

కుంతీదేవి

కుంతీదేవి ఒక ఆదర్శప్రాయురాలైన మహిళామణి. ఆమె మహానుభావులైన పాండవులకు కన్నతల్లి, శ్రీకృష్ణుని మేనయత్త, వసుదేవుని సహోదరి. కుంతిభోజుని దత్తపుత్రిక, పుట్టినది మొదలు జనులు ఈమెను పృథ అని పిలిచేవారు. కాని కుంతిభోజుని యింట పెరిగిన కారణంగా ఆమె కుంతి యను పేర ప్రసిద్ధి చెందింది. ఆమె చిన్నతనం నుండి కూడ సౌశీల్యము, సదాచారసంపద, సంయమస్వభావము, భగవద్భక్తి కలిగి మెలగుతూ ఉండేది.

మహారాజైన కుంతిభోజుని యింటికి ఒకనాడు ఒక మహాతేజశ్శాలియైన బ్రాహ్మణుడు అతిథిగా వచ్చాడు. అతనికి సేవలు చేసే బాధ్యత కుంతికి అప్పగించబడింది. ఆమెకు బ్రాహ్మణులయందు భక్తి మెండు. అతిథిపూజయందు ఆసక్తి అధికము. ఆమె అలసత్వములేక అభిమానం వీడి ఆ బ్రాహ్మణదేవతను ఆరాధించడంలో ఎంతో తత్పరతతో నిమగ్నురాలు అయింది. పరిశుద్ధాంతఃకరణంతో సేవించి ఆమె యా బ్రాహ్మణునకు అధికప్రసన్నత కలిగించింది. ఆ బ్రాహ్మణుని వ్యవహారం ఒక నియమప్రకారంగా కాక బహు అవ్యవస్థితంగా ఉండేది. అతడు ఒకప్పుడు వేళకాని వేళకు వచ్చేవాడు. మఱియొకప్పుడు రావడమే మానివేసేవాడు ఒకప్పుడు అలభ్య వస్తువు ఏదో కావాలని కోరేవాడు. మరియొకప్పుడు అసమయంలో తినుటకు ఏదో అపేక్షించేవాడు. అయినా కుంతి ఏమాత్రమూ విసుగు చెందక అతడు కోరిన పనులను అన్నిటిని వెంట వెంటనే నిర్వర్తిస్తూ, అతడు కోరిన వస్తువులను అన్నిటిని ముందు సిద్ధం చేసుకొన్నదానివలె అతనికి అందిస్తూ అతనిని సేవించింది. ఆమె సౌశీల్యమును, సంయమవర్తనమును గాంచి ఆ బ్రాహ్మణుడు బహు ప్రసన్నత చెందాడు. కుంతీదేవి తన చిన్ననాట చేసిన యీ బ్రాహ్మణసేవ ఆమెకు ఎంతయో శుభదాయకం అయింది. ఆ సేవయే ఆమె జీవితంలో సంయమము, సదాచారము, త్యాగవృత్తి, సేవాప్రవృత్తి మొదలైన శుభలక్షణాలకు పునాది

యేర్పడడానికి కారణం అయింది. రాను రాను ఆ గుణాలు ఆమెలో ఆశ్చర్యజనకంగా వికాసదశను పొందాయి.

కుంతిలో నిష్కామభావంకూడ బాల్యదశనుండియే వికాసాన్ని పొందింది. ఈమె ఎంతో నిష్ఠతోను, తత్పరతతోను బ్రాహ్మణసేవనం చేస్తూ ఉండగా పూర్తిగా ఒక సంవత్సరకాలం గడచింది. మంత్రానుష్ఠానమువలె ఆమె అవలంబించిన సేవానుష్ఠానము పూర్తి అయింది. ఈమె పాటించిన సేవావిధానంలో ఆ బ్రాహ్మణునకు ఎందును లోపము కానరాలేదు. అప్పుడు అతడు ఎంతయో ప్రసన్నత చెంది అమ్మా! నీవు చేసిన సేవ నాకు పరమానందం కలిగించింది. నీకు ఇష్టమైన వరం ఏదైన కోరుకొనుము! ఇచ్చెదను అని ఆమెతో పలికాడు. అప్పుడు అతనికి కుంతి చాల చక్కగా బదులు చెప్పింది. ఆమె సమాధానం శ్రీకృష్ణుని మేనత్త, భావికాలంలో పాండవులకు కాబోవు కన్నతల్లి అయిన ఆమెకు సర్వవిధాల తగి యున్నది. ఆమె చెప్పిన సమాధానం ఇది - మహాత్మా! మీరు, నాయెడల ప్రసన్నులు కావడంకంటె నాకు కావలసినది ఏమున్నది? మీరు ప్రసన్నత చెందుటవలన నా కార్యములు అన్నీ సఫలములు అయినట్లే. ఇక నాకు ఏ వరాలును అక్కరలేదు. ఒక అల్పవయస్కురాలైన బాలికయందు విలక్షణం అయిన సేవాభావంతో బాటు ఇలాంటి నిష్కామభావం కూడ ఉండడం అనేది మణి బంగారంతో కూడడం వంటిది. మన దేశంలోని బాలికలు అందరూ కుంతీదేవిలో ఉన్న ఈ నిష్కామసేవాభావాన్ని అలవరచుకోవాలి. అతిథిసేవనం అన్నది మన సాంఘికజీవనానికి ఆయువుపట్టుగా సాగివస్తోంది. ఆ శుభలక్షణ సంబంధమైన శిక్షణం మన భారతీయులకు చిన్ననాటనుండియు లభిస్తూనే ఉంది. ఆనందపూర్వకంగా చేయబడేది ఏ మాత్రమూ భారం అనిపించదు. కొంచెము కూడ విసువును కలిగించనిది., ప్రతిఫలాపేక్ష అవంతయు లేనిది అయిన సేవ యేదో అదే అచ్చమైన సాత్త్వికసేవ అవుతుంది. ఈనాడు సాగించబడుతూ ఉన్న సేవాకార్యక్రమాలలో తరచుగా ఈ లక్షణాల లోపం కానవస్తూ ఉంది. సంతోషంతోను, నిష్కామభావంతోను చేసిన సేవ శుభఫలానికి పరమసాధనం కాగల్గుతుంది. ఆ విషయాన్ని అటు ఉండనీయండి!

కుంతీదేవి బ్రాహ్మణుని ఏ వరమూ కోరలేదు. అప్పుడు అతడు దేవతలకు ఆవాహనం చెప్పే మంత్రం ఇస్తాను స్వీకరించుమని ఆమెతో

పలికాడు. అతడు ఏదియో ఒకటి కుంతికి అర్పించకుండ మఱలిపోవడానికి ఇష్టపడలేదు. ఈ మారు కాదంటే బ్రాహ్మణుని అవమానించినట్లు అవుతుందని తలచి ఆమె మంత్రగ్రహణానికి సమ్మతించింది. అప్పుడు అతడు ఆమెకు అధర్వవేదపు శిరోభాగంలో ఉండే మంత్రాలను ఉపదేశించి ఆమెతో - అమ్మా! ఈ మంత్రంతో నీవు ఏ దేవతను ఆహ్వానిస్తే ఆదేవత నీకు వశవర్తి కాగలదని ఆమెతో చెప్పాడు. అనంతరం అతడు, అక్కడనే అంతర్ధానం చెందాడు. ఆ మహర్షి మఱియెవ్వరో కాదు. మహాతపోధనుడైన దుర్వాసుడు అనే మహర్షి. ఈ మహానుభావుడు ఇచ్చిన మంత్రాల ప్రభావంతో కుంతి అనంతరకాలంలో యుధిష్ఠిరాదులను తనయులనుగా పడయగలిగింది.

అనంతరం కుంతికి పాండురాజుతో వివాహం జరిగింది. ఆ పాండురాజు ఎంతయో ధర్మాత్ముడు. ఇతడు ఒకప్పుడు పొరపాటున మృగరూపం ధరించి ఉన్న కిందముడు అనే మునిని చంపివేసాడు. ఆ సంఘటన జరిగిన తరువాత అతడు వేదనతోను, పశ్చాత్తాపంతోను మానసికంగా ఎంతయో క్రుంగిపోయాడు. ఆ వేదన తీరక అతడు సర్వస్వపరిత్యాగం చేసి వనవాసం చేయడానికి సంకల్పించుకొన్నాడు. కుంతీదేవి కూడ ఎంతయో పతిభక్తి పరాయణురాలైన సాధ్వీమతల్లి. ఆమె కూడ తన భర్తతో పాటు ఇంద్రియనిగ్రహం వహించి, కామసుఖాభిలాషలను కడకు త్రోసివైచి వనంలో నివసించడానికి సన్నద్ధురాలు అయింది. నాటినుండియు ఆమె యావజ్జీవమూ నియమపూర్వకంగా బ్రహ్మచర్యవ్రతపాలనం చేసింది. సంయమాన్ని పాటించింది. ఈమె తన భర్త దివంగతుడైన సందర్భంలో తన బిడ్డల సంరక్షణ భారాన్ని మాద్రికి అప్పగించి తాను తన భర్తను అనుగమించాలని ఆలోచించుకొంది. కాని మాద్రి అందులకు సమ్మతింపక ఆమెతో అక్కా! నేను ఇంకను యౌవనవతినై యున్నాను. కావున నేనే పతిని అనుగమించెదను. పిల్లల సంరక్షణభారం నీవే వహించు అని నచ్చబలికింది. కడకు కుంతి అందులకు సమ్మతించింది. కడదాక ఆమె బిడ్డలను తన బిడ్డలకంటె అధికంగా ఆదరించింది. సవతితోడను, ఆమె బిడ్డలతోడను ఎలా వ్యవహరించాలి అనే అంశాన్ని నేటి తల్లులు, సోదరీమణులను కుంతీ జీవితమును బట్టి నేర్చుకోవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉంది. పతి సజీవుడై యున్నవంతవఱకు ఆమె మాద్రితో ఆమెను తన చెల్లెలుగా

భావించుకొని వ్యవహరించింది. ఆమె సహగమనానంతరం ఆమె బిడ్డలతో ఒక సాధ్వీమతల్లివలె ఆదర్శప్రాయంగా వ్యవహరించింది. సహదేవునియెడల కుంతికి విశేషమమకారం ఉండేది. అతడు కూడ ఈమెయందు విశేషంగా ఆత్మీయతను ప్రదర్శించేవాడు.

పతి మరణించిన పిమ్మట ఇంచుమించుగా కుంతి జీవితం అంతా కష్టాలతోనే గడచింది. అయిన నేమి? ఆమె మాత్రం ఎక్కువ ఆలోచనాపరురాలు. ధైర్యవంతురాలు. అందుచేత ఆమె కష్టాలను ఏమాత్రమునూ పరిగణించలేదు. కడదాక ధర్మమార్గాన్ని విడువలేదు. దుర్యోధనుడు సాగించిన దుర్మార్గాలను కూడ ఆమె మౌనంగా భరిస్తూ వచ్చింది. ఈమె స్వభావం బహు కోమలం అయినది. ఈమె ఎంతయో దయామయురాలు. ఈమె తన కష్టాలను ఎన్నడూ కష్టాలుగా పరిగణించుకోలేదు. కాని పరుల కష్టాలను చూచి మాత్రం హార్దికంగా చలించిపోయేది. లాక్షాగృహంనుండి బయల్పడి ఈమె తన బిడ్డలతో ఏకచక్రపురంలో నివసిస్తూ ఉన్న కాలంలో అక్కడ ఉన్న ప్రజలమీద ఒక మహాభయంకరమైన విపత్తు విరుచుకొని పడి ఉంది. అది యెట్టిదన ఆ నగరానికి చేరువగా బకాసురుడు అను ఒక రాక్షసుడు ఉండేవాడు. ఆరాక్షసుని కోసం ప్రతిదినమూ ఆ నగరవాసులు ఒక బండెడు అన్నమును, రెండు ఎనుపోతులనూ ఆహారంగా పంపవలసినవారై యున్నారు. ఈ వస్తువులను కొనిపోయిన మానవుని కూడ ఆ రాక్షసుడు విరుచుకొని తినివేసేవాడు. ఆ నగరవాసులు దినమునకు ఒకరి యింటి వంతుగా ఈ బాధ్యతను వహించవలసినవారై కాలం గడుపుకొంటూ ఉన్నారు. పాండవులు ఆ నగరంలో ఒక బ్రాహ్మణుని యింట భిక్షావృత్తిని ఆలంబనంగా చేసుకొని నివసిస్తూ ఉన్నారు. ఒకనాడు వారు ఉన్న యింటినుండి ఒక మనుష్యుని ఆహారంగా పంపవలసిన పరిస్థితి తటస్థించింది. ఆ యిల్లు గల బ్రాహ్మణుని యింటిలో ఏడ్పులు, బొబ్బరింతలు మొదలు అయ్యాయి. ఆ సమాచారమును తెలిసికొని కుంతి హృదయం ద్రవించింది. అప్పుడామె ఇలా ఆలోచించింది. మనం చెంత ఉండగా ఈ బ్రాహ్మణకుటుంబానికి ఇలాంటి విపత్తు ఎదుర్కోవలసిన పరిస్థితివడం మనకే మిక్కిలి లజ్జాకరమైన విషయం. వీరు మనకు ఆశ్రయదాతలు. వీరికి ఏదియో ఒక విధంగా ప్రత్యుపకారం చేయవలసిన

విధి మనమీద ఉంది. సమయం వచ్చినప్పుడు ఉపకారం చేసినవానికి ప్రత్యుపకారం చేయకపోవడం ధర్మభంగానికి కారణం అవుతుంది. వీరి యింటిలో నివసిస్తూ ఉన్న దశలో వీరి కష్టాన్ని పంచుకోవడం మన కర్తవ్యం" ఇలా ఆలోచించి ఆమె ఆ బ్రాహ్మణుని యింటిలోపలకు పోయి చూడగా బ్రాహ్మణుడు తన భార్యాపుత్రులతో కూడి యుండి దేవీ! నీవు ఉత్తమకులసంజాతురాలవు. సౌశీల్యవంతురాలవు. పిల్లల తల్లివి. ఇట్టి నిన్ను ఆ రాక్షసునకు ఆహారంగా అర్పించలేను" అని తన యిల్లాలితో పలుకుతూ ఉన్నాడు. ఆ మాట విని ఆమె తన భర్తతో - నేనే స్వయంగా ఆ రాక్షసునకు ఆహారం అవుతాను. పతికోసం తన ప్రాణాలను అర్పించియైన అతనికి మేలు చేకూర్చడం సతికి పరమకర్తవ్యం అవుతుంది. అలా చేయడం అనాదిగా సాగి వస్తూన్న పత్నీధర్మం. పతులు సజీవులై యుండగా తాము ముందుగా అసువులను బాయడం అనేది సతులకు అత్యంత సౌభాగ్యదాయకమైన విషయం. ఆడుది హంతవ్యురాలు కాదని దయతలచి ఆ రాక్షసుడు నన్ను చంపక వదిలివేయవచ్చును. మగవానిని అతడు చంపుతాడు అనడంలో సందేహం ఏమీ ఉండదు. స్త్రీని చంపుతాడు అనేది సందేహగ్రస్తమైన విషయం. కాబట్టి నన్నే ఆ రాక్షసుని కడకు పంపండి! అని ప్రతివాదం చేస్తూ ఉంది.కరుణాజనకంగా తల్లి, తండ్రి వాదించుకుంటున్న ఈ తీరును విని వారి కొమరిత వారి ముందు - "తల్లీ! తండ్రీ! ధర్మానుసారంగా ఏదియో ఒకనాడు మీరు నన్ను విడనాడవలసిన వారే కదా! ఆ వీడడం నేడే నన్ను వీడి ఆత్మరక్షణం మీరు ఏల చేసుకోరు? జనులు ఎల్లరూ తమను కష్టాల కడలినుండి గట్టు ఎక్కిస్తారు అని తలచియే కదా! సంతానాన్ని పడయగోరుతారు" అని తన అభిమతాన్ని వెల్లడిస్తూ ఉంది. ఆ మాటలు విని ఆ తల్లి, తండ్రి బోరున విలపించడం మొదలుపెట్టారు. వారిని చూచి కొమరితకు కూడ రోదనం ఆగలేదు. ఆమె కూడ బావురుమంది. వారు ముగ్గురూ ఏడుస్తూ ఉండగా చూచి వారి కడగొట్టు పసివాడు అమ్మా! నాన్నా! అక్కా! ఏడవకండి! అంటూ ఒక గడ్డిపరకను చేత బట్టుకొని ఇదిగో! దీనితో ఆ రాక్షసుని చంపివేస్తాను అని నవ్వుతూ వీరాలాపం చేసాడు. వాని మాట విని అందరూ నవ్వసాగారు. ఆ సంవాదం అంతా కన్నులార చూచి, చెవులార విని ఊరకుండలేక కుంతి ముందడుగు వైచి

వారిని సమీపించి బ్రాహ్మణునితో మహాత్మా! మీకు ఒక్కకొడుకు, ఒక్క కూతురు మాత్రమే ఉన్నారు. మీ దయవలన నాకు అయిదుగురు కొడుకులు ఉన్నారు. రాక్షసుని కడకు ఆహారమును అందజేయుటకు నా కొడుకులలో ఒకనిని పంపెదను. విచారింపకుడు! అని ఊఱటమాటలు పలికింది. ఆ మాటలు విని బ్రాహ్మణుడు స్తంభితుడై ఆమెతో - అమ్మా! అలా మాటాడడం మేరలులేని మీ సౌజన్యానికి తగియున్నది. కాని నా యింటికి అతిథిగా వచ్చివానిని చంపించి ఆత్మరక్షణం చేసుకోవడానికి నా మనసు అంగీకరించదు. అని ప్రతివాదం చేసేడు. అప్పుడు కుంతి మఱల - మహాత్మా! నా బిడ్డలలో నేను పంపదలచుకొన్న బిడ్డ సాధారణుడు కాదు. వాడు మహాబలవంతుడు. మంత్రసిద్ధి కలవాడు. గొప్ప తేజశ్శాలి. వానికి ఎవ్వరూ ఎలాంటి హానిని కలిగించలేరు. అని అతనికి నచ్చజెప్పింది. అప్పుడు ఆ బ్రాహ్మణుడు సమ్మతించాడు. అంతట కుంతి భీమసేనుని ఆ రాక్షసుని కడకు పంపింది. పరుల ప్రాణాల పరిరక్షణకోసం తన ప్రాణధనం అనదగిన బిడ్డను ఈ విధంగా ఏ తల్లి అయినా బలిగా సమర్పించగలుగుతుందా? పరమాదర్శప్రాయంగా కుంతి చేసిన యీ మహాత్యాగంతో లోకం అంతా ప్రభావితం అయింది అని వేఱుగా చెప్పనక్కరలేదు. ఈ సన్నివేశాన్ని బట్టి యెల్లవారలు ఈ శుభలక్షణాన్ని అలవరచుకోవాలి.

కుంతీదేవియందు ఉన్న సత్యప్రీతి కూడ ఆదర్శప్రాయం అయినదే. ఆమె ఎన్నడూ అసత్యమాడేది కాదు. ప్రమాదవశాన ఏమాట యైన నోటినుండి జాఱినప్పుడు కూడ ఆమె ప్రాణాలు ఒడ్డి ఆ మాటను పాటించడానికే పాటు పడేది. ఈ విధమైన సత్యనిష్ఠ మనకు చరిత్రపుటలను తెఱచి చూచిన ఎందునూ కానరాదు. భీమార్జునులు ఇరువురూ స్వయంవరంలో ద్రౌపదిని గెలుచుకొని యింటికి మఱలి వచ్చి అమ్మా! ఇదిగో! ఈనాడు ఈ భిక్ష తెచ్చేమమ్మా! అని తమ తల్లితో పలికారు. ఏమి తెచ్చారో చూడక ముందే ఆమె నాయనలారా! అయిదుగురూ సమానంగా వినియోగించుకొండి! అని మాట జాఱింది. వెనుకకు తిరిగి చూచేక వారు తెచ్చిన భిక్ష ఒక కన్య అని తెలియడంతో ఆమె ఎంతో అసమంజసదశలో చిర్కుకొంది. ఆడిన మాటను ఉపసంహరించుకొంటే అసత్యదోషం వస్తుంది.

ఆడిన మాట ప్రకారమే బిడ్డలు నడుచుకోవాలి అని అనుకొంటే సనాతనమర్యాదకు భంగం వాటిల్లుతుంది. ఇప్పుడు ఏమి చేయాలి? అని ఆమె తనలో తర్కించుకొంది. ఒక స్త్రీని అయిదుగురు అన్నదమ్ములు ఏకంగా కూడి పెండ్లి చేసుకోవడం ఎందునూ విన్నదీ కాదు. కన్నదీకాదు. ఆ పరిస్థితిలో కుంతి ఎటూ నిశ్చయించుకోలేక కింకర్తవ్య విమూఢురాలు అయింది. కడపట ఆమె ఈ విషయంలో నీవు ఏమంటావు? అని ధర్మరాజైన యుధిష్ఠిరుని ప్రశ్నించింది. ఆడిన మాటమీదనే నిలువుమని అతడు బదులు చెప్పాడు. అనంతరం తన కొమరితను అయిదుగురు సోదరులూ కూడి పెండ్లి యాడడానికి ద్రుపదుడు అభ్యంతరం తెలిపాడు. అప్పుడు వేదవ్యాసుడు అతనికి ద్రౌపది యొక్క పూర్వజన్మల గాథలను వివరించి చెపుతూ ఆమె అయిదుగురు పురుషులను భర్తలుగా పడయు విధంగా శంకరుని వలన వరం పొందినట్టిది కాబట్టి అయిదుగురను పెండ్లియాడుతుందని అతనికి నచ్చజెప్పాడు. ఈవిధంగా ద్రుపదకుమారికి యథావిధిగా అయిదుగురతోడనూ వివాహం జరిగింది. కుంతీదేవి యొక్క సత్యనిష్ఠకు విజయం కలిగింది. భావిని అనుసరించిన మాటయే ఆమె నోటినుండి అప్రయత్నంగా జాఱడం సంభవం అయింది. దృఢంగా సత్యాన్ని ఆశ్రయించినవారి జీవితంలో అప్పుడప్పుడు ఇలాంటి అభూతపూర్వసంఘటనలు జరగడం అబ్బురం కాదు. అస్తు! ఆ విషయాన్ని అలా ఉంచండి.

కుంతీదేవి జీవితం ఆదినుండి అంతం వఱకూ అత్యంత త్యాగభరితంగాను, తపోమయంగాను, అనాసక్తంగాను సాగిపోయింది. పాండవులు వనవాసమూ, అజ్ఞాతవాసమూ చేసిన కాలంలో ఆమె వారిని వీడి వేఱుగా హస్తినాపురంలో ఉండిపోయింది. అక్కడ ఉండియే ఆమె తన సోదరపుత్రుడైన శ్రీకృష్ణుని ద్వారా పాండవులకు ఎట్టి పరిస్థితిలోనూ క్షత్రియధర్మం వీడరాదని సందేశం పంపింది. విదుల, సంజయుడు అనే మాతాపుత్రుల ఉదంతాన్ని ఉదాహరణంగా చూపి హృదయాలలో నాటుకుపోయే విధంగా ఆమె నాయనలారా!

శ్లో॥ ఏతద్ధనంజయో వాచ్యో నిత్యోద్యుక్తో వృకోదరః ।
యదర్థం క్షత్రియా సూతే తస్యకాలోఽ_యమాగతః ॥

(మహాభారత. ఉద్యోగ. 137/9-10)

క్షత్రియవనిత తన బిడ్డలను తన కార్యనిర్వహణకు సమయం అసన్నం అయింది అని వారికి తెలియపరచింది. చిన్ననాట తన యొద్ద గ్రోలిన స్తన్యం ఔన్నత్యాన్ని దిగజార్చకండి అని వారికి తెలియజెప్పింది. మహాభారత యుద్ధకాలంలో కూడ ఆమె అక్కడనే ఉండిపోయింది. యుద్ధం ముగిసిన పిదప యుధిష్ఠిరుడు సమ్రాట్టుగా పట్టాభిషిక్తుడైన వేళ ఆమె రాజమాత అయ్యేసౌభాగ్యాన్ని పొందింది. అప్పుడు ఆమె పుత్రవియోగంతో బాధపడుతున్న గాంధారీ ధృతరాష్ట్రుల సేవాభారాన్ని తన మీద పెట్టుకొని అభిమానమూ, ద్వేషమూ వీడి వారిని సేవించుకొంటూ కాలం గడిపింది. కడకు ఆ గాంధారీ ధృతరాష్ట్రులు వనవాసం చేయడానికి వెడలుచుండగా చూచి తాను కూడ వారిని అనుగమించింది. ఆ సందర్భంలో యుధిష్ఠిరాదులు ఆమెను ఎంతవారించినా ఆమె తన నిశ్చయంనుండి వెనుదిరగలేదు. యావజ్జీవమూ ఎన్నో కష్టాలూ కడగండ్లూ భరించిన తరువాత ఆమె సుఖపడే రోజులు వచ్చాయి. అయినా ఆమె ఇచ్ఛానుపూర్వకంగా భౌతిక సుఖభోగాలను త్రోసిరాజని త్యాగమయమూ, తపోమయమూ, సేవామయమూ అయిన జీవనాన్నే స్వీకరించింది. అలా చేయడం కుంతివంటి పవిత్రాత్మురాలైన యింతికే చెల్లింది. ఏ గాంధారీ ధృతరాష్ట్రుల వలన ఆమెకూ, ఆమె బిడ్డలకూ, కోడళ్ళకూ కష్టాలు, అవమానాలు తప్ప మరి ఏదీ ప్రాప్తించియుండలేదో వారికోసమే ఇంతటి త్యాగసాధన చేయడానికి సంబంధించిన ఉదాహరణం ఇది గాక మఱి యేది ఉంటుంది? ఎందును లభించదు. కాబట్టి యీనాటి మన తల్లులు, సోదరీమణులనూ కూడ కుంతీదేవి చేసిన యీ అపూర్వత్యాగసాధన నుండి పాఠం నేర్చుకోవాలి.

వనానికి పయనం అవుతూ ఉన్న సమయంలో భీమసేనుడు కుంతీదేవికి ఇలా నచ్చజెప్పాడు - "అమ్మా! కడకు నీవు ఈ వనవాసమే చేయదలచుకొన్నప్పుడు మాచేత ఇంత నరసంహారకాండను ఏల చేయించావు? వనవాసియైన మా తండ్రి మరణించిన తరువత మమ్ము ఆ వనమునుండి నగరానికి ఏల తీసుకొని వచ్చావు? అనగా విని కుంతీదేవి అతనికి ఇలా బదులు చెప్పింది. కుమారా! మీరు భీరుకులు, సోమరులు అయి చేతులు ముడుచుకొని కూర్చోకుండ ఉండాలని, క్షత్రియోచితమైన పురుషార్థాన్ని కాదని అవమానకారణమైన జీవనవిధానాన్ని ఎక్కడ అవలంబించిపోతారో

అలా జరుగరాదని, శక్తి ఉండగా మీరు న్యాయోచితమైన మీ అధికారాన్ని శాశ్వతంగా వదలుకోరాదని తలచియే నేను మిమ్ము యుద్ధానికి పురికోల్పాను. కాని నా సుఖమును కోరి కాదు. రాజ్యసుఖాలను అనుభవించాలి. అన్న కోరిక నాకు లేదు. నేను తపస్సాధనాపూర్వకంగా నా పతి చనిన లోకానికి పోగోరుచున్నదానను అందుచేతనే నేను ఇటు మీదట నా తోడికోడలు గాంధారి, ఆమె భర్త ధృతరాష్ట్రుని సేవించుకుంటూ శేషజీవితాన్ని తపోమయంగా సాగించుకోదలచాను. మీరు ఆనందంగా ఇంటికి మఱలిపొండు! ధైర్యపూర్వకంగా ప్రజాపాలనం చేస్తూ పరిజనులకు సుఖం కలిగించండి! ఆహా! ఎంత చక్కని సమాధానం ఇది? నిజంగా ఇది హృదయంలో అంకితం చేసుకోవలసిన సమాధానము. ఈ విధంగా తన బిడ్డలకు నచ్చజెప్పి కుంతీదేవి గాంధారీ ధృతరాష్ట్రులను అనుగమించి వనంలోనికి వెడలిపోయింది. కడదాక వారిని సేవిస్తూ ఉండి చివరకు వారితో బాటు తాను కూడ దావాగ్నిలో చిక్కి దగ్ధురాలై యోగీశ్వరులవలె దేహత్యాగం చేసింది. మొత్తంమీద చివరికి సారాంశంగా చెప్పుకోవలసిన మాట ఏది అంటే కుంతీదేవివంటి ఆదర్శమహిళామణులు ప్రపంచచరిత్రలో బహుఅరుదుగా ఉంటారు అన్నది సారాంశం.

ద్రౌపది

ద్రౌపదీదేవి పాంచాలరాజైన ద్రుపదుని కుమార్తె. ఈమె అయోనిజ. యజ్ఞకుండమునుండి యీమె ఆవిర్భవించింది. ఈమె రూపలావణ్యాలు అనుపమానములు అయినవి. ఈమెవంటి సౌందర్యరాశి ఆకాలంలో భూమండలం మీద మరెవ్వరును లేరు. ఈమె శరీరమునుండి తత్కాలమందు వికసించిన తామరపూవు యొక్క పరిమళమువంటి పరిమళం వెలువడి ఒక క్రోసు దూరం దాక విస్తరించేది. ఈమె జననకాలంలో ఆకాశవాణి - ఈమె దేవతాకార్యసిద్ధికై క్షత్రియలోకసంహారం లక్ష్యంగా చేసుకొని ఆవిర్భవించిందని, ఈమె మూలంగా కౌరవవర్గానికి భయం కలుగుతుందని పలికింది. ఈమె శరీరచ్ఛాయ నల్లనిది అయిన కారణాన ఎల్లవారూ ఈమెను కృష్ణ అని పిలిచేవారు. పూర్వజన్మలో పరమశివుడు ఒసగిన వరం కారణంగా ఈమెకు ఈ జన్మలో అయిదుగురు భర్తలు ప్రాప్తించారు. ఈమెను స్వయంవరంలో అర్జునుడు ఒక్కడే గెలిచికొన్నవాడు అయినా కుంతీదేవి ఆదేశానుసారం ఆమె తనయులు అయిదుగురునూ కూడి పెండ్లి చేసుకొన్నారు.

ద్రౌపది ఉత్తమశ్రేణికి చెందిన పతివ్రతామతల్లి. భగవద్భక్తురాలు, ఈమెకు శ్రీకృష్ణభగవానుని పాదారవిందాల మీద అచంచలమైన ప్రీతి యుండేది. ఈమె అతనిని తన హితైషి యని, రక్షకుడని, పరమాత్మీయుడని భావించుకొనేది. అతడు సర్వవ్యాపకుడు, సర్వశక్తియుక్తులు కలవాడు అని యీమె దృఢంగా విశ్వసించేది. కౌరవుల సభలో దుష్టుడైన దుశ్శాసనుడు ఈమె శరీరం ఉన్న వలువలను ఒలిచివేయ పూనుకొన్నప్పుడు సభాసదులు ఎవ్వరూ అతని అత్యాచారాన్ని నిరోధించే ప్రయత్నం చేయలేకపోయారు. అప్పుడు ఈమె తన లజ్జను కాపాడుకోవటానికి మార్గం ఏదీ కానక ఎంతో ఆర్తితోను, ఆరాటంతోను శ్రీకృష్ణభగవానుని ఈవిధంగా ప్రార్థించింది-

శ్లో॥ గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ ।
కౌరవై పరిభూతాం మాం కిం న జానాపి కేశవ ॥
హే నాథ హే రమానాథ వ్రజనాథార్తినాశన ।
కౌరవార్ణవమగ్నాం మాం ఉద్ధరస్వ జనార్దన ॥
కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన ।
ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేఽవసీదతీమ్ ॥

(మహా. సభా. 68/41-43)

నిష్కల్మషమైన హృదయముతో చేసిన ఆర్తనాదాన్ని భగవానుడు వెంటనే ఆలకిస్తాడు. ఆ సమయంలో శ్రీకృష్ణుడు ద్వారకలో ఉండిపోయాడు. అచ్చటనుండి అతడు పరుగు పరుగున అరుగుదెంచి ధర్మరూపంతో ఆమె వలువలలో దాగి యుండి ఆమె మానమును కాపాడాడు. భగవానుని కృపవలన ఆమె వలువలు అక్షయం అయ్యాయి. దుశ్శాసనుడు లాగుచున్న కొలది ఆమె వస్త్రం పెరిగిపోతూ వచ్చింది. ఎల్లవారలూ చూస్తూ చూస్తూ ఉండగా అక్కడ పెద్ద వస్త్రపు గుట్ట యేర్పడిపోయింది. మహాబలశాలి దుశ్శాసనుని చేతులు వస్త్రాపహరణం చేసి చేసి అలసిపోయాయి. కాని చీరయొక్క చరమభాగాన్ని పట్టుకోలేకపోయాయి. అక్కడ చేరి యున్న జనులు అందరూ భగవద్భక్తి యొక్కయు, పతివ్రతామతల్లి యొక్కయు అద్భుతప్రభావాన్ని ప్రత్యక్షంగా పరికించారు. కడకు దుశ్శాసనుడు ఎంతో శ్రమపడి చీరలు లాగిలాగి విసిగిపోయి లజ్జావనతవదనుడై వెనుకకు పోయి తన స్థానములో కూర్చున్నాడు. ఈ విధంగా భక్తవత్సలుడైన పరమాత్మ తన భక్తురాలి గౌరవమును కాపాడాడు. ఆహా! ఎంత ప్రశస్త్యమైనది ఆ స్వామియొక్క భక్తవాత్సల్యము?

మఱియొక సంఘటనం ఇది - ఒకప్పుడు పాండవులు ద్రౌపదితోడ కామ్యకవనంలో ఉన్నారు. అప్పుడు దుర్యోధనుడు పంపగా దుర్వాసుడు తన పదివేలమంది శిష్యుల బలగాన్ని వెంట బెట్టుకొని పాండవుల కడకు వచ్చాడు. దుర్యోధనుడు పాండవులకు కీడు చేయనెంచి వారు అందరూ భోజనాదికాలు ముగించుకొని విశ్రమిస్తూ ఉన్న తరుణంలో దుర్వాసుని

వారి కడకు పంపాడు. మహారాజు యుధిష్ఠిరుడు అతిథులను సేవించే ఉద్దేశ్యంతోనే సూర్యభగవానుని ఆరాధించి అతని వలన అక్షయపాత్రను ఒకదానిని పడసియున్నాడు. అందు పచనం చేయబడిన పదార్థం అల్పమైనదైనా అనల్పమూ అక్షయమూ అవుతుంది. కాని అందరను భుజింపజేసి చివరికి ద్రౌపది కూడ భోజనం చేసిన తర్వాత ఇక ఆ పాత్రయందు అక్షయత్వప్రభావం ఉండదు. యుధిష్ఠిరుడు మహర్షిని శిష్యవర్గసమేతంగా భోజనానికి ఆహ్వానించాడు. దుర్వాసుడు తన బలగంతో నిత్యకర్మానుష్ఠానం నిర్వర్తించుకొని వత్తుమని చెప్పి స్నానార్థం గంగాతీరానికి వెళ్లాడు.

దుర్వాసుడు ఎక్కడకు పోతే అక్కడకు ఒక విశ్వవిద్యాలయమే సాగిపోతోందా? అని అనిపించునంత మంది శిష్యుల బలగం అతనివెంట సాగిపోయేది. ధర్మరాజు వారిని అందఱనూ ఆహ్వానించాడు. ఆ ఆహ్వానాన్ని ఆ మహర్షి అంగీకరించాడు. కాని ద్రౌపది భోజనం ముగించేసింది. ఇక ఆ పాత్రనుండి వారికి భోజనవ్యవస్థ సాధ్యముకాదు అనే విషయాన్ని ఆలోచించినవారు ఎవ్వరూ లేరు. అప్పుడు ద్రౌపది ఎంతయో చింతాక్రాంతురాలు అయింది. ఆ మహర్షి భోజనం లేకుండా మఱలిపోవడం సంభవిస్తే తమను శపించిపోతాడు అని తలచుకొని ఆమె ఎంతో ఆరాటపడిపోయింది. అతడు క్రోధస్వభావుడుగా లోకంలో ప్రసిద్ధి గన్నవాడు. ఆ విపత్తును తప్పించుకోవడానికి ద్రౌపదికి ఉపాయం ఏదీ తోచలేదు. అప్పుడు ఆమె యీ విపత్తునుండి తమను రక్షింపుమని శ్రీకృష్ణుని ఈ విధంగా ప్రార్థించింది -

శ్లో॥ కృష్ణ కృష్ణ మహాబాహో దేవకీనందనావ్యయ ।
వాసుదేవ జగన్నాథ ప్రణతార్తివినాశన ॥
విశ్వాత్మన్ విశ్వజనక విశ్వహర్తః ప్రభోఽవ్యయ ।
ప్రపన్నపాల గోపాల ప్రజాపాల పరాత్పర ॥
ఆకూతీనాం చ చిత్తీనాం ప్రవర్తక నతాస్మితే ।
వరేణ్య వరదానంత అగతీనాం గతిర్భవ ॥

పురాణపురుష ప్రాణమనోవృత్త్యాద్యగోచర ।
సర్వాధ్యక్ష పరాధ్యక్ష త్వా మహం శరణం గతా ॥
పాహి మాం కృపయా దేవ శరణాగతవత్సల ।
నీలోత్పలదళశ్యామ పద్మగర్భారుణేక్షణ ॥
పీతాంబరపరీధాన లసత్కౌస్తుభభూషణ ।
త్వమాది రంతో భూతానాం చ పరాయణమ్ ।
పరాత్పరతరం జ్యోతి ర్విశ్వాత్మా సర్వతోముఖః ॥
త్వామేవాహుః పరం బీజం నిధానం సర్వసంపదామ్ ।
త్వయా నాథేన దేవేశ సర్వాపద్భ్యో భయం న హి ॥
దుశ్శాసనా దహం పూర్వం సభాయాం మోచితా యథా ।
తథైవ సంకటాదస్మాన్మాముద్ధర్తుమిహార్హసి ॥

శ్రీకృష్ణభగవానుడు సర్వాంతర్యామి. ఎల్లవారల మనోగతాలను ఎఱుగగలవాడు. అతడు ఆ క్షణమందే అక్కడకు చేరుకొన్నాడు. అతనిని చూచి ద్రౌపదికి పోవుచున్న ప్రాణాలు నిలిచినట్లు అయింది. మునిగిపోవుచున్నవానికి పట్టుకొనుటకు ఆధారం లభించినట్లు అయింది. అప్పుడు ద్రౌపది సంగ్రహంగా విషయం అంతా అతనికి తెలియపరచింది. అంతట శ్రీకృష్ణుడు ఎంతో తొందరను ప్రదర్శిస్తూ ఆమెతో - అమ్మా! ఆ మాటలు అన్నీ తరువాత చెప్పవచ్చును. కాని ముందు నాకు తినుటకు ఏమైన పెట్టుమమ్మా! నాకు ఆకలి బాధ అధికంగా ఉంది. నేను ఇప్పుడు ఎంత దూరమునుండి అలసిసొలసి వచ్చానో నీవు ఎఱుగవు అని పలికాడు. ఆ మాట విని ద్రౌపది సిగ్గుతో క్రుంగిపోయింది. అతనికి బదులు చెప్పలేక ఉండి యుండి ఒక్కొక్క మాటగా ప్రభూ! ఇప్పుడిప్పుడే నేను భోజనం చేసి లేచాను అక్షయపాత్రలో పదార్థం ఏమీ మిగులలేదు. అని పలికింది. ఏదీ? ఆ పాత్రను నాకు ఒక్కసారి చూపించు! అన్నాడు శ్రీకృష్ణుడు. ద్రౌపది పాత్రను తెచ్చిఅతని చేతికి ఇచ్చింది. శ్రీకృష్ణుడు ఆ పాత్రను చేతిలో ఉంచుకొని పరిశీలించాడు. అతనికి అందు ఒక ప్రక్క ఒక కూరాకు అంటుకొని యుండి కానవచ్చింది. దానిని తన నోట బెట్టుకొని అతడు

ఈ కూరాకుతో జగదాత్మస్వరూపుడు, యజ్ఞభోక్త అయిన పరమేశ్వరుడు వెంటనే తృప్తి చెందుగాక! అని పలికాడు అనంతరం అతడు సహదేవుని పిలిచి అతనితో సహదేవా! నీవు పోయి మునీశ్వరులను భోజనానికి పిలుచుకొని రా! అని చెప్పాడు. అప్పుడు సహదేవుడు గంగాతీరానికి పోయి చూడగా అక్కడ అతనికి ఒక్క మునికూడ కానరాలేదు. జరిగిన విచిత్ర్యం ఏమంటే శ్రీకృష్ణుడు కూరాకును నోట బెట్టుకొని ఆ సంకల్పం పఠించిన వేళ ఆ మునీశ్వరులు అందఱూ నీటిలో నిలిచి అఘమర్షణమంత్రాలను పఠించుకొంటూ ఉన్నారు. ఆ దశలో వానికి అకస్మాత్తుగా తమ ఉదరాలు అన్నీ పీకలవరకు భోజనం చేసినట్టి అనుభూతి కలిగింది. వారు పరస్పరమూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకొని ఇక మనం అక్కడకు పోయి ఏమి భోజనం చేయగలము? అని చెప్పుకున్నారు. మాఱు మాటాడక అటునుండి అటు వెళ్ళిపోవడమే శ్రేయస్కరం అని దుర్వాసుడు భావించుకొన్నాడు. కారణం ఏమంటే పాండవులు భగవద్భక్తులని అతడు ఎఱిగినవాడు. తన విషయంలో అంబరీషుని యింట జరిగిన సంఘటన అతనికి ఎన్నటికిని మఱపునకు రాదు. ఆ సంఘటన జరిగినది మొదలు అతనికి భగవద్భక్తులు అంటే భయం కలుగడం మొదలయింది. తోడనే అతడు శిష్యసమేతంగా అచ్చటనుండి కదలి వెళ్ళిపోయాడు. వారు వెడలిపోయారన్న సమాచారం అచ్చట ఉన్న ఇతర మహర్షులవలన సహదేవునకు తెలిసింది. అతడు మఱలి వచ్చి ఆవిషయం ధర్మనందనునకు తెలియజెప్పాడు. ఈవిధంగా శ్రీకృష్ణునియందు ద్రౌపదికి ఉన్న భక్తి కారణంగా పాండవుల నెత్తిమీదనుండి ఒక మహాభయంకరమైన విపత్తు తొలగిపోయింది. ఈ విధంగా ఆ పరమపురుషుడు తన శరణాగతవాత్సల్యాన్ని వెల్లడించాడు.

ఒకప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామాసమేతుడై వనంలో నివసిస్తూ ఉన్న పాండవులను కలిసికొనుటకు వచ్చాడు. అప్పుడు మాటల సందర్భంలో సత్యభామ ద్రౌపదిని ఇలా ప్రశ్నించింది. సోదరీ! నిన్నునేను ఒక్కవిషయం అడిగెదను. నాకు తెలుపవలసినది! శూరులు, వీరులు, మహాబలశాలులూ అయి ఉండికూడ నీ భర్తలు నీకు లోబడి ఉండడాన్ని నేను పరికిస్తున్నాను. అందులకు కారణం ఏమి? నీవు ఏవయినా మంత్రతంత్రాలను,

ఓషధీప్రయోగాలను ఎఱుగుదువా? అట్లు కాక నీవు ఏవయినా జపాలు, వ్రతాలు, హోమాలూ, వశీకరణవిద్యావిధానాలూ ఆచరించి నీ భర్తలను లోబరచుకొన్నావా? అట్టి విధానాలూ, ఉపాయాలు ఏవయిన ఉంటే నాకు కూడ తెలియజెప్పుమా! నేను నా శ్యామసుందరుని వశీకరించుకొనుటకు ప్రయత్నించెదను". అనగా విని ద్రౌపది ఆమెకు ఇలా బదులు చెప్పింది. సోదరీ! నీవు శ్యామసుందరుని పట్టమహిషివి, ప్రియతమురాలవూ అయి ఉండి కూడ ఏమి మాట అంటున్నావు. పాతివ్రత్యనిష్ఠగల సాధ్వీమతల్లులు తేళ్ళకూ, సర్పాలకు ఎంత దూరంగా ఉంటారో మంత్రతంత్రాదులకు కూడా అంతే దూరంగా ఉంటారు. మంత్రతంత్రాదులతో భర్తను వశీకరించుకోవడం సాధ్యమవుతుందా? అమాయికంగా ఉండేస్త్రీలూ, దురాచార పరాయణలైన స్త్రీలు మాత్రమే నీవు అనుకొన్న విధంగా మంత్రతంత్రాదులను ప్రయోగిస్తారు. అలా చేసి వారు తమకు, తమ భర్తలకు కూడ అనర్థాన్ని కల్పించుకొన్నవారు అవుతారు. అలాంటి స్త్రీల చెంతకు మనం చేరరాదు. మన చెంతకు వారిని చేరనీయరాదు.

ఇలా చెప్పిన పిమ్మట ఆమె తాను తన భర్తల ప్రసన్నతకోసం ఎలా ప్రవర్తించేదో వివరిస్తూ ఇలా అంది. సోదరీ! నేను అహంకారాన్ని కామక్రోధాదులైన అవలక్షణాలను విసర్జించి బహు జాగరూకతతో పాండవులందరను, వారి భార్యలను సేవిస్తూ ఉంటాను. నేను మానసికంగా ఈర్ష్యకు, అసూయకు దూరంగా ఉంటాను. నా మనస్సును నిగ్రహించుకొని కేవలమూ సేవాభావంతో నా పతుల మనస్సులను ఎఱిగి ప్రవర్తిస్తూ ఉంటాను. నేను ఎన్నడూ ఎవరితోనూ కటువుగా మాటలాడను. అసభ్యంగా నిలువను. పాపపు మాటలను పలుకను. కూడని తావులలో కూర్చుండను. దురాచారకలుషిత వాతావరణంలో అడుగు కూడ పెట్టను. పతులయొక్క సాభిప్రాయములైన సంకేతాలను అర్థంచేసుకొని అనుసరిస్తూ ఉంటాను. దేవతలు కాని, మానవులు కాని, గంధర్వులు కాని, యువకులు కాని, ధనికులు కాని, ఎంతటి సౌందర్యనిధులైన కాని నా మనస్సు ఎన్నడూ పాండవులను వీడి అన్యులు ఎవ్వరిమీదకును పోదు. నా పతులు భుజింపక ముందు నేను ఎన్నడూ భుజించను. వారు స్నానం చేయకముందు స్నానం

చేయును. వారు కూర్చుండక ముందు కూర్చుండను, వారు బయటకు పోయి మఱలి వచ్చిన వేళ నేను నిలిచియుండి వారికి ఆసనమును, శుద్ధజలమును అందింతును. నేను ఇంటిలోని పాత్రలను స్వయంగా తోమి పరిశుభ్రంగా ఉంచుకొంటాను. మధురంగా ఉండే విధంగా వంట చేస్తాను. నిర్ణీతసమయానికి వారికి భోజనం పెడతాను. ఎల్లవేళలా ఎల్ల విషయాలలోను జాగరూకత వహిస్తూ ఉంటాను. ఇంటిలో ధాన్యసంరక్షణం చేస్తాను. ఇంటిని చక్కగా తుడిచి పరిశుభ్రంగా ఉంచుతాను. మాటల సందర్భంలో నేను ఎవ్వరినీ తిరస్కరించను. కులటలైన స్త్రీల చెంతకు చేరను. ఎన్నడూ అలసత్వం వహించను. అనుక్షణమూ పతులకు అనుకూలవర్తినినై చరిస్తాను. మాటికి మాటికి నేను ద్వారము చెంతకు పోయి నిలువను. తెఱపిగా ఉన్న తావునగాని చెత్తచెదారములు పాఱవేయు స్థానమునందు కాని నేను ఎక్కువసేపు నిలువను. ఎల్లవేళలా సత్యమే పలుకుతాను. పతి సేవాపరాయణురాలనై ఉంటాను. పతిచెంత లేకుండా ఒంటరిగా ఉండడం నాకు ఇష్టము కాదు. కుటుంబవ్యవహారాదులకోసం నా భర్తలు బయటకు వెడలినవేళ నేను చందనపుష్పాదికములైన అలంకారాలను అన్నిటినీ వీడి నియమాలను వ్రతాలను పాటిస్తూ కాలం గడుపుతుంటాను. నా పతులు తిననట్టి, త్రాగనట్టి సేవించనట్టి పదార్థాలను నేను కూడ ముట్టను. స్త్రీల విషయంలో శాస్త్రం చెప్పిన విషయాలను అన్నిటినీ నేను పాటిస్తాను. శరీరాన్ని ఎప్పుడు ఏవిధమైన వస్త్రాలంకారాలు ప్రాప్తిస్తే అప్పుడు వానితోనే అలంకరించుకుంటాను. సర్వకాలములందునూ అప్రమత్తత వహించి పతిదేవులకు ప్రియం చేకూర్చడానికి ప్రతీక్షిస్తూ ఉంటాను.

కుటుంబసంబంధంగా మా అత్త నాకు తెలియజెప్పిన విధులనూ, ధర్మాలను అన్నిటినీ నిర్వరిస్తూ ఉంటాను. భిక్షను అర్పించడమూ, పూజావిధిని ఆచరించడమూ, శ్రాద్ధాదిపుణ్యతిథులందు పక్వాన్నములు తయారుచేయడం, పూజ్యనీయులను ఆదరించడమూ, ఇంకనూ నాకు విహితములైన ధర్మములు యేవి కలవో వానిని అన్నిటినీ రేబవళ్లు ఆచరిస్తూ ఉంటాను. నేను వినయవివేకాదిక నియమాలను సర్వదా అనుసరిస్తూ ఉంటాను. నా

అభిప్రాయప్రకారం పతులకు లోబడి ఉండడమే స్త్రీలకు అనాదిగా సాగివస్తూ ఉన్న పరమధర్మం. పతులే సతులకు పరమేష్ఠదైవతాలు. నేను నా పతులకన్న మిన్నగా ఎన్నడూ ఉండను. వారు ఆరగించే పదార్థం కన్న మిన్నగా ఏదీ ఆరగించను. వారికన్న మిన్నగా ఉండే వస్త్రాభరణాదులను ధరించను. నేను మా యత్త మాటకు ఎన్నడూ ఎదురాడను. ఆమెతో ప్రతివాదం చేయను. ఎల్లవేళలా సంయమాన్ని (నిగ్రహం) పాటిస్తాను. ప్రతిదినమూ నా పతులకంటె ముందుగా మేలుకొంటాను. పెద్దల సేవలో పాల్గొంటాను. భోజనవస్త్ర జలాదులను సమకూర్చి నేను మా యత్తను సంతోషంగా సేవిస్తాను. వస్త్రాభరణభోజనాదుల విషయంలో ఆమె కంటె అధిక్యం కోసం నేను ఎన్నడూ ఆరాటపడను. ఆదిలో మహారాజు యుధిష్ఠిరునకు 10వేల మంది దాసీజనం ఉండేవారు. ఆ దాసీజనం అందరిపేర్లూ, వారు ధరించిన వస్త్రాలూ, కడకు వారిలో ఒక్కొక్కరూ చేసిన పనులు కూడ నాకు చక్కగా గుర్తు ఉండేవి. మహారాజు యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థంలో ఉండి రాజ్యపాలనం చేసిన కాలంలో ఆ మహామహుని వెంట ఒక లక్షగుఱ్ఱాలు, ఒక లక్ష యేనుగులూ ఉండేవి. వాని పరిగణనమూ, వ్యవస్థ నేనే చేసేదానను. నేను ఆ మహారాజుయొక్క ఆవశ్యకతలను ఆలకించేదానను. అంతఃపురంలో ఉండే గొల్లవారూ, పశుపాలకులు మొదలుగా నేను సమస్తసేవకుల కార్యక్రమాలను పరిశీలించేదానను. మహారాజు యొక్క ఆదాయవ్యయాలకు సంబంధించిన విషయం అంతా నేను దృష్టిలో నిలుపుకొనేదానను. పాండవులు ఏవురూ కుటుంబభారం అంతా నా మీద విడిచిపెట్టి పూజాపఠనాధికార్యములందు, వచ్చేపోయేవారి సత్కారస్వాగత విధులందు నిమగ్నులై యుండేవారు. నా భర్తలయొక్క ఆఖండధనాగారం విషయం అంతా కూడ నా ఒక్కదానికే విదితమై యుండేది. నేను రేయనక పగలనక ఆకలి దప్పులను సహించి పాండవులను సేవించడానికి పాటుపడుతూ ఉండేదానను, ఉన్నాను. ఆ కాలంలో నాకు రేబవళ్ల అంతరం తెలిసేది కాదు. అనుదినమూ నేను అందఱికంటె ముందు మేల్కొని అందఱూ పరున్న మీదట పండుకొనేదాను. పతులను అనుకూలురను గావించుకొనుటకు నేను అవలంబించిన ఉపాయం ఇది. వింటివి కదా! సత్యభామా! అని

ద్రౌపది పలికింది. ఆదర్శగృహిణీ స్థానాన్ని అలంకరించగోరే ప్రతిస్త్రీయు ఈ ద్రౌపది జీవనమునుండి పాఠం నేర్చుకోవాలి.

ద్రౌపదీదేవి యందు క్షత్రియోచితమైన తేజస్సూ, భక్తజనులయందు ఉండవలసిన క్షమాగుణము కూడ సమ్మిశ్రితములై యున్నాయి. ఆమె బహు బుద్ధిమంతురాలు, విద్యావంతురాలు కూడ. ఆమెలో అపూర్వం అయిన త్యాగలక్షణం కూడ ఉంది. ఆమె పాతివ్రత్యనిష్ఠ చేత ప్రభావితులు కాని వారు కాని, లోబడనివారు కాని ఎవ్వరూలేరు. దుష్టుడైన దుశ్శాసనుడు ఆమెను జుట్టు పట్టుకొని సభలోనికి ఈడ్చుకొని వచ్చిన వేళ తన భర్తల అగ్రహోదగ్రత్వాన్ని వివరించి వానిని భయపెట్టింది. సభాసదులను అందఱను ధిక్కరించింది. భీష్మద్రోణ విదురాదులైన గురుజనులు అందఱూ నోరు మూసుకొని కూర్చున్నందులకు వారిని కఱకు ములుకులవంటి పలుకులతో నిలదీసింది. సాహసపూర్వకంగా సభాసదులను అందఱను సంబోధించి తనకు న్యాయం చేకూర్చుడని అర్థించింది. ధర్మం! ధర్మం! ధర్మాన్ని పరిరక్షించండి! అని మొఱపెడుతూ ఆమె వారిని అయ్యలారా! మహారాజు యుధిష్ఠిరుడు ముందుగా పందెములో తనను తాను ఒడ్డుకొని ఓడిపోయినవాడు. అనంతరం అతడు పందెంలో నన్ను ఒడ్డేడు. ముందు ఒకసారి ఓడిపోయినవానికి రెండవసారి నన్ను పణంగా పెట్టడానికి అధికారం ఉంటుందా? ఉండదా? ఆలోచించి తేల్చండి. అని ప్రశ్నించింది. ఆమె మాటను అందఱూ విని మౌనం వహించడం తప్ప సమాధానం ఏమీ చెప్పలేక పోయారు. కడపట దుర్యోధనుని తమ్ముడు వికర్ణుడు అనువాడు లేచి సభాసదులారా! ఊరకున్నారేమి? ద్రౌపది అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి. మౌనం వీడండి అని సభాసదులను అభ్యర్థిస్తూ ఇదిగో! నా అభిప్రాయం తెలియజెపుతున్నాను వినండి! అంటూ ఇలా అన్నాడు. ముందు ద్రౌపది అయిదుగురు పురుషులకు భార్య అన్న మాటను మఱవరాదు. మిలిగిన నలుగురు భర్తలను ఉపేక్షించి తాను ఒక్కడే ఆమెను జూదంలో పణంగా పెట్టడానికి ధర్మరాజునకు అధికారంలేదు. ఇది మొదటి అంశం. అతడు తాను ముందు ఓడిపోయి తరవాత ద్రౌపదిని పణంగా ఒడ్డేడు. ఇది అతనికి అనధికార చర్య అవుతుంది. ఇది రెండవ అంశము. వికర్ణుడు

ఆడిన యీ మాటలను విదురుడు సమర్థించాడు. ఇతర సభాసదులు అందఱూ అతనిని ప్రశంసించారు. కాని కర్ణుడు అతనిని గద్దించి కూర్చుండబెట్టి వేసాడు. ఈ విధంగా నిండు సభలో దుశ్శాసనుని చేత యీడ్వబడి అవమానింపబడినా కడకు నైతికవిజయం ద్రౌపదికే కలిగింది. ఆమె బుద్ధి మిక్కిలి పరిణతస్థితిని పొందింది. ఆమె మాటను ఎవ్వరూ ఖండించలేక పోయారు. చివరకు విదురుని ప్రోత్సాహంతో ధృతరాష్ట్రుడు దుర్యోధనుని మందలించి ద్రౌపదికి ప్రసన్నత గలిగింపనెంచి ఆమెతో అమ్మా! నీకు ఏమి కావలెనో కోరుకో! అని అన్నాడు. అప్పుడు ఆమె మహారాజా! నా భర్తలను దాస్యవిముక్తులను చేయండి! ఇదే నేను మీనుండి ఆశించే వరం అని పలికింది. ఇంకను ఏమైన కోరుకో! అని ధృతరాష్ట్రుడు మఱల పలికాడు. అప్పుడు ఆమె చెప్పిన సమాధానం ఆమెకే తగియున్నది ఎల్లరూ మెచ్చుకొనే విధంగా ఉండి ఆమెలోని లోభరాహిత్యమూ, ధర్మప్రీతి ఆ సమాధానంలో స్పష్టంగా ప్రతిబింబిస్తూ ఉన్నాయి. ఆ సమాధానం ఏది అంటే మహారాజా! అధికంగా ఆశించడం నాకు యుక్తంకాదు. ఇంకనూ మిమ్మ ఏదోకోరాలి అన్న భావన నాకు లేదు. నా భర్తలు సర్వసమర్థులు. వారు దాస్యవిముక్తులు అయితే తమంత తాముగా ఏమైన సాధించగలరు. ఇది ఆమె చెప్పిన సమాధానం. ఈవిధంగా ద్రౌపది తన విజ్ఞత సాయంతోను పాతివ్రత్యబలంతోను తన భర్తలను దాస్యబంధవిముక్తులను చేసుకొంది.

చక్కనై చిక్కనై నల్లనై నున్న నై నిడుదలుగా ఉండి అందాలు చిందు ఆమెయొక్క యే కురులు కొన్ని దినములకు ముందు రాజసూయయాగ సందర్భంలో అవభృథస్నానకాలమందు మంత్రపూతజలాభిషిక్తములై పవిత్రతములు అయ్యేయో వానినే దుష్టదుశ్శాసనుడు తన పాపిష్ఠిహస్తాలతో పట్టుకొని నిండు కొలువులోనికి ఈడ్చుకొనిపోయి తనను అవమానించిన విషయాన్ని మాత్రం ఆమె మఱవలేకపోయింది. అభూతపూర్వమైన ఆ పరాభవాగ్ని ఆమె హృదయంలో సర్వదా కనలుతూనే ఉంది. తత్కారణంగా కౌరవులతో సంధి ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భములోను ఆమె ఆ విషయాన్ని ఎత్తిచూపుతూనే వచ్చేసింది.తాను పొందిన పరాభవాన్ని, పరితాపాన్ని గుర్తుచేసి తనవారిని

యుద్ధానికి పురికొల్పుతూనే వచ్చింది. కడకు యుద్ధానికి ముందు ఒక్కసారి కౌరవుల కడకు పోయి నచ్చజెప్పి చూడాలి అనియే నిశ్చయించడం సంభవం అయింది. శ్రీకృష్ణభగవానుడు పాండవుల పక్షాన రాయబారిగా సంధిప్రసంగం చేయడానికి బయలుదేరే సమయంలో కూడ ద్రౌపది తన అవమానాన్ని మఱవలేదు. తన పొడవైన కురులను చేత బట్టుకొని చూపుతూ శ్రీకృష్ణునితో ఆమె - శ్రీకృష్ణా సంధి చేయబోవు చున్నావు. యుక్తమే. కాని నాయీ కేశాలను మాత్రం మఱవవలదు. అని అంటూ ఈమాట కూడ అతనితో నొక్కి చెప్పింది. పాండవులకు యుద్ధం చేయడం సమ్మతం కాకపోయిన పోవుగాక! నా ముదుసలి తండ్రి తన మహారథులైన పుత్రులను వెంట బెట్టుకొని పోయి కౌరవులతో పోరాటం సాగించగలడు. అభిమన్యునితో గూడి నా బలశాలులైన అయిదుగురు కుమారులు కూడ పోయి వారికి బాసటగా నిల్చి యుద్ధం చేయగలరు. ఇది ఆమె చెప్పిన మాట.

కామ్యకవనంలో దుష్టుడైన జయద్రథుడు ద్రౌపదిని బలవంతంగా తీసుకొని పోవడానికి ఉద్యమించిన సందర్భంలో ఈ ద్రౌపది నిరాయుధురాలై వానిని ఒక్క త్రోపుత్రోయగా వాడు తటాలున మొదలు నరికిన తరువువలె నేల గూలాడు. కాని అతడు తనను తాను సంబాళించుకొని లేచి బలవంతంగా ఆమెను పట్టుకొని రథంమీద కూర్చుండబెట్టుకొని తీసుకొనిపోసాగాడు. వడివడిగా వెనుకనుండి భీమార్జునులు వచ్చి వానిని పట్టుకొని చావగొట్టి బాగుగు దేహశుద్ధి చేసారు. అప్పుడు ఈమె దయ తలచి వానిని విడిపించివేసింది. ఈవిధంగా ఈమె క్రోధాన్ని ప్రదిర్శంచే చోట క్రోధాన్ని ప్రదర్శించింది. దయ వహించవలసిన సందర్భంలో దయనూ వహించింది. ఈమె యొక్క పాతివ్రత్యప్రభావం కూడ ఎంతో అపూర్వం అయినది. ఆమెను తాకిన వాడు, ఆమెతోడ దుష్టచేష్టలకు పాల్పడినవాడు ప్రతి ఒక్కడు ప్రాణాలకు దూరం కాక తప్పలేదు. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, జయద్రథుడు, కీచకుడు మొదలయినవారికి అందఱకూ ఈ గతియే పట్టింది. కష్టనష్టాలపాలు చేయబడినవాడు ఒక పతివ్రతామతల్లి, ఉసురు ఎంతటివాని అసువులనైన తీయగలదు అనడంలో సందేహం లేదు. మహాభారత యుద్ధంలో కౌరవవర్గం యొక్క సర్వనాశనానికి కారణం పతివ్రతామతల్లియైన ద్రౌపదికి కలిగించబడిన అవమానమే.

పతిభక్తిపరాయణురాలు గాంధారి

లోకంలోని పతివ్రతామతల్లులలో గాంధారి ఉన్నతశ్రేణికి చెందిన యిల్లాలు. ఈమె గాంధారదేశపు రాజైన సుబలుని కుమార్తె. శకునికి సోదరి. ఈమె కుమారిగా ఉన్న కాలంలోనే పరమశివుని ఆరాధించి తనకు భావికాలంలో నూరుగురు కుమారులు కలుగునట్లుగా అతని వలన వరం పొందింది. తన వివాహం ఒక పుట్టంధునితో జరుగనున్నదని యెఱిగిన మొదలు ఈమె తన భర్త లోకాన్ని చూడనివాడైనప్పుడు తాను మాత్రం ఎందుకు చూడాలి? అని అనుకొని తన కన్నులకు గంతలు కట్టుకొని గ్రుడ్డిదై చరించింది. నాటినుండి యీమె ఆజీవనమూ ఆ నిశ్చయం మీదనే నిలిచిపోయింది. పతికోసం ఈ విధంగా ఇంద్రియసుఖాలను పరిత్యజించడానికి సంబంధించిన ఉదాహరణం ప్రపంచచరిత్రలో ఎందునూ మఱియొకటి కానరాదు. ఈమె సర్వకాలములందునూ తన పతికి అనుకూలురాలై చరించింది. ఈమె యొక్క యీ తపస్సు, త్యాగము నిరుపమానములు అయినవి. లోకానికి అపూర్వములు అయినట్టివి. ఈమె తన అత్తవారింట అడుగుపెట్టిన వెంటనే తన సచ్చరిత్రముతోను సుగుణసంపదతోను తన భర్తను, సమస్తపరివారాన్ని ముగ్ధులను చేసింది. ఆహా! ఎంత మెచ్చదగిన పతిభక్తి యీమెది?

గాంధారియందు పతిభక్తితోపాటు, నిర్భయత్వము, న్యాయప్రీతి అనే శుభలక్షణాలు కూడ ఉన్నాయి. ఆమె సర్వదాసత్యము, ధర్మము, నీతి ఏ పక్షాన ఉంటే ఆ పక్షాన్నే సమర్థించేది. అన్యాయాన్ని ఎన్నడూ సమర్థించేది కాదు. తన తనయులు నిండు సభలో ద్రౌపదిపై సాగించిన అత్యాచారాన్ని గూర్చి ఆమె ఎంతయో మనస్తాపం పొందింది. ఈ విషయంలో ఆమె తన బిడ్డలను ఎన్నడూ మెచ్చుకోలేదు. వారి యెడల ప్రసన్నతను ప్రకటించలేదు. ఆమె భర్తయైన ధృతరాష్ట్ర మహారాజు తన కొడుకుల మాటలకులోబడి ఆమె పాండవులను రెండవమాఱు జూదమాడుటకు రావించిన సందర్భంలో కూడ విశేషంగా పరితపించింది. జూదాన్ని ప్రతిఘటిస్తూ తన భర్తతో

స్వామీ! దుర్యోధనుడు జన్మించిన వెంటనే నక్క ఊళ పెట్టి రోదించనవాడు. ఆ సమయంలో మహాజ్ఞాని అయిన విదురుడు ఆ బిడ్డను వదలివేయమని నాకు హితబోధ చేసాడు. ఆ విషయాన్ని తలచుకోగా వాడు కురువంశాన్ని నిర్మూలించి తీరుతాడు అని నాకు తోస్తోంది. ఆర్యపుత్రా! స్వకీయం అయిన దోషంతో అందరను ఆపద్గ్రస్తులను చేయకండి! దుష్టులు, పరమమూర్ఖులు అయినవారి మాటలకు లోబడకండి! అట్లు లోబడి యీ వంశనాశనానికి కారణభూతులు కావలదు. సుస్థిరమైన వ్యవస్థకు అస్థిరత కలిగించవలదు. ఆరిపోయిన అగ్ని మఱల రగులుకొంటుంది. పాండవులు శాంతస్వభావులు. వైరానికిదూరంగా ఉండేవారు. వారికి కోపం కలిగించడం మంచిది కాదు. ఈ విషయాలు మీకు తెలియనివి కావు. అయినా మీకు గుర్తు చేస్తున్నాను. దుష్టబుద్ధి గల పురుషుని చిత్తం శాస్త్రోపదేశాలచేత ప్రభావితం కాదు. కాని మీరు వృద్ధులై యుండి చిన్నపిల్లలవలె మాటలాడడం మంచిది కాదు. ఇప్పుడు మీరు పాండవులపై మీ కన్న బిడ్డలమీదను వలె ఆత్మీయతను ప్రదర్శించండి! వారు దుఃఖితులై మీకు దూరం కాకూడదు. కులకళంకభూతుడు దుర్యోధనుడు. వానిని విడిచిపెట్టడమే మంచిది. బిడ్డమీద ఉన్నమోహం కారణంగా నేను ఆనాడు విదురుని మాటను పాటించలేకపోయాను. దాని ఫలితమే యిది. శాంతి మార్గాన్ని ధర్మమార్గాన్ని తొలగని విధంగా మంత్రుల సమ్మతిని అనుసరించి మీ ఆలోచనాసరళిని పవిత్రంగా ఉంచుకొండి! ప్రమత్తులు కావలదు. అనాలోచితంగా ప్రవర్తించడమూ, ఏమయినా చేయడమూ అనేది మీకు తగదు. అది మీకు దుఃఖకారణం అవుతుంది. రాజ్యలక్ష్మి క్రూరుని చేతిలో పడితే వానినే నాశనం చేస్తుంది. గాంధారి పలికిన యీ పలుకులలో ధర్మము, నీతి, పక్షపాతరాహిత్యము ఉట్టిపడుతున్నాయి. ఈమె దుర్యోధనుని అతని అనుచితకృత్యాలకు పూనుకొన్న వేళ తగదని పర్యాయంగా హెచ్చరిస్తూ ఉండేది. అతని ఉద్దండతను, దుష్టతను నిరసించేది. అతడుచేసే అవినీతి పనులవలన ముందు కలుగబోవు పరిణామాలను వివరించి అతనిని నిరోధించిడానికి ప్రయత్నించేది. అయితే ఏమి? ఆ దుర్యోధనుని నెత్తిమీద కాలదేవత కరాళనృత్యం చేస్తూ ఉండడం చేత ఈ హితోక్తులు ఏవీ వాని తలకు ఎక్కేవి కావు.

పాండవుల పక్షాన సంధి చేయడం కోసం హస్తినాపురానికి రాయబారిగా

పోయిన శ్రీకృష్ణుడు కూడ దుర్యోధనునకు వేయి విధాల నచ్చజెప్పి విసిగిపోయాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిచి ఆమెతో ఇక నీవే నీ కొడుకునకు నచ్చజెప్పుకో! వాడు మా మాటలను పెడచెవిని పెడుతున్నాడు అని అన్నాడు. భర్త మాట విని అప్పుడు గాంధారి తన కొడుకుతో కాక భర్తతోనే ఇలా పలికింది. మహారాజా! మీరు పుత్రవ్యామోహానికి లోబడి యున్నారు. కాబట్టి యీ విషయంలో మీ దోషమే ఎక్కువ. దుర్యోధనుడు పాపి యని యెఱిగియుండి కూడ మీరు వాని బుద్ధినే అనుసరిస్తూ ఉన్నారు. కామక్రోధలోభాలు మూడు భయంకరతామసప్రవృత్తులూ వానిని దృఢంగా తమ పిడికిట బంధించి పట్టుకొన్నాయి. ఇక మీరు వానిని బలవంతంగా కూడ వాని ఇచ్ఛితమార్గంనుండి వెనుకకు మఱలించలేరు. మీరు, ఈ మూర్ఖుడు. దురాత్ముడు, దుష్టజనులతో సాంగత్యం కలవాడు, లోభగ్రస్తుడూ అయిన కొడుకు చేతులకు అనాలోచితంగా రాజ్యభారాన్ని అప్పగించి అనర్థం తెచ్చిపెట్టుకొన్నారు. దాని ఫలం అనుభవించక తప్పదు, గృహంలో కలహబీజం నాటుకొంటూ ఉంటే ఉపేక్ష వహిస్తూ వచ్చారు. అలా చేసి మిమ్ము మీరు పాండవుల దృష్టిలో హాస్యాస్పదులను చేసుకొంటున్నారు. చూడండి! సామోపాయంతోనో భేదోపాయంతోనో ఏ విపత్తును అయినా తొలగించుకోవచ్చును అని అనుకొన్నవాడు ఏ బుద్ధిమంతుడు అయినా స్వజనానికి దండనవిధిని ఎందుకు ప్రయోగిస్తాడు? గాంధారి చెప్పిన ఈ యుక్తి ఎంత నిర్భీకతను, ఎంత పక్షపాతరాహిత్యాన్ని, ఎంత హితాకాంక్షను, ఎంత నీతిని, ఎంత సత్యాన్ని ప్రకటిస్తూ ఉన్నదో చూచితిరా? పాఠకులారా!

అనంతరం ఆమె తన కుమారుని పిలిచి వానికి ఈ విధంగా హితబోధ చేసింది. "కుమారా! నా మాటవిను!" నీ తండ్రి, భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు. విదురుడు నీకు ఏమి చెప్పినా ఆ చెప్పినదానిని నీవు స్వీకరిస్తూ ఉండు! నీవు పాండవులతో పొత్తు కుదుర్చుకుంటే నిజం చెపుతున్నాను. నమ్ము! నీవు భీష్ముని, ద్రోణుని, నీతండ్రిని, నీహితం కోరేవారిని అందఱినీ సేవించిన వాడవు కాగలుగుతావు. వత్సా! రాజ్యాన్ని పడయడం, రక్షించడం, అనుభవించడం అనేది మన చేతిలో ఉండే అంశంకాదు. జితేంద్రియుడు అయినవాడు మాత్రమే రాజ్యసంరక్షణం చేయగలుగుతాడు. కామక్రోధాలు మానవుని అర్థభ్రష్టుని చేస్తాయి. ఈ అంతశ్శత్రువులను

జయించియే క్షత్రియుడు సమస్త భూమండలాన్ని జయించగలుగుతాడు. ఇదిగో! చూడు! పొగరుబోతు గుఱ్ఱాలు మార్గమధ్యంలోనే మూర్ఖుడైన సారథిని చంపివేస్తుంటాయి. అలాగే అదుపులోనికి తెచ్చుకోనినాడు ఇంద్రియాలు కూడ మానవుని నాశనం చేసివేస్తాయి. ఆ విధంగానే ఇంద్రియాలు ఎవనికి వశీభూతములు అవుతాయో, ఎవడు ముందువెనుకలు చక్కగా ఆలోచించి ఎల్లపనులూ చేస్తూ ఉంటాడో వాని దగ్గఱ సిరి చిరకాలం నిల్కడగా ఉంటుంది. బిడ్డా! మీ తాతగారైన భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు నీకు చెప్పిన మాట నిజం. వాస్తవంగా శ్రీకృష్ణుని కాని, అర్జునుని కాని ఎవరూ జయించలేరు. కాబట్టి నీవు శ్రీకృష్ణుని శరణు పొందు. అతడు ప్రసన్నుడు అయితే ఇరుపక్షాలకూ శుభం చేకూరుతుంది. నాయనా! నామాట విను! యుద్ధం సాగించడంలో శ్రేయస్సు లేదు. అందులో ధర్మమూ లేదు. అర్థమూ లేదు. ఇకసుఖం ఎలా ఉంటుంది. నీవు నీ మంత్రులతోడ రాజ్యాన్ని అనుభవించదలచుకొంటే న్యాయంగా పాండవులకు దక్కవలసిన భాగాన్ని వారికి ఇచ్చివేయి! పదమూడు ఏండ్ల పాటు పాండవులను ఇంటికి దూరంచేసి ఎక్కడో ఉండునట్లు చేసావు. అదియు తీరని అపరాధమే అయింది. ఇప్పుడు సంధికి ఒడబడి ఆ మచ్చను తుడిచివేసుకో! లోకంలో లోభవర్తనంవల్ల ఎవరికీ సంపద రాదు. కాబట్టి నీవు లోభవృత్తిని వీడి పాండవులతో సంధి కుదుర్చుకో!" ఆహా! ఎంత చక్కని సదుపదేశం ఇది? దీనిని బట్టి గాంధారి విదుషీమణి యని, కృష్ణార్జునుల మహాత్మ్యాన్ని చక్కగా గుర్తెఱిగినదని వ్యక్తం అవుతోంది.

దుష్టాత్ముడైన దుర్యోధనుని చిత్తం మీద ఈ సదుపదేశం ఈషణ్మాత్రమూ పనిచేయలేదు. అతడు తన పంతాన్ని వీడలేదు. అందులకు ఫలితంగా ఇరువంకలనుండి యుద్ధసన్నాహాలు మొదలయ్యాయి. 18 దినముల వఱకు కురుక్షేత్రపు రణరంగంలో భీషణనరసంహారకాండ సాగిపోయింది. యుద్ధకాలంలో దుర్యోధనుడు ప్రతిదినమూ తన తల్లి చెంతకు పోయి అమ్మా! నాకు యుద్ధంలో విజయం కలుగునట్లుగా దీవించుమమ్మా! అని ప్రార్థిస్తూ వచ్చాడు. గాంధారియందు పాతివ్రత్యపు తేజస్సు నిండుగా ఉంది. ఆమె తన కుమారునకు విజయం కలిగే విధంగా ఆశీర్వదించి ఉంటే ఆ ఆశీర్వచనం వమ్ము అయ్యేది కాదు. కాని ఆమె అలా

ఆశీర్వదించలేదు. దుర్యోధనుడు దురాచారుడని, అట్టివాని చేతిలో రాజ్యలక్ష్మి యెన్నడూ నిలువదని ఆమె బాగుగా ఎరుగును. అందుచేత ఆమె ప్రతిదినము తన కుమారునకు కుమారా! (యతోధర్మస్తతోజయః) ధర్మం ఏపక్షాన ఉంటే ఆ పక్షం గెలుస్తుంది. కాబట్టి నీకు విజయంకావాలి అని అనుకొంటే ధర్మాన్ని ఆశ్రయించు! అధర్మాన్ని పరిత్యజించు. అనియే బదులు చెపుతూ వచ్చింది. కాని యెన్నడూ ఆమె దుర్యోధనుని ఆలోచనలను సమర్థించలేదు. కాని తన కుమారులు నూరుగురూ కూడ యుద్ధంలో నిహతులు అయిపోయారు అని విన్నప్పుడు మాత్రం ఒక్కసారిగా ఆమెకు తీవ్ర ఆగ్రహం కలిగింది. ఆమె పాండవులను శపించివేయాలని ఆలోచించసాగింది. వేదవ్యాసభగవానుడు ఎల్ల వారల మనోగతాలను ఎఱుగగలవాడు. అతడు గాంధారి సంకల్పమును ఎఱిగి ఆమె చెంతకు వచ్చి ఊరట మాటలతో ఆమెను ఊరడించి ఆమెయొక్క దుష్టసంకల్పాన్ని నిరోధించాడు. ఆ సమయంలో పాండవులు కూడ అక్కడే ఉన్నారు. గాంధారియొక్క హృదయవేదనను పరికించి ధర్మరాజు తనను తాను చీకొట్టుకొంటూ పోయి ఆమె పాదాలమీద వ్రాలిపోయాడు. అప్పుడు గాంధారియొక్క కోపదృష్టి గంతలుగా కట్టుకొన్న వస్త్రములోపలనుండి బహిర్గతమై యుధిష్ఠిరుని గోళ్లమీద పడగా ఎప్పుడూ గులాబివన్నె కలిగి అందాలు చిందే ఆగోళ్లు అప్పటికప్పుడే మాడి నల్లబడిపోయాయి. అది చూచి అతని సోదరులు భయంతో పాఱిపోయి యిందందు దాగుకొనసాగారు. వారి తత్తరపాటును గ్రహించి గాంధారి తనకోపాన్ని శమింపజేసుకుంది. వెంటనే పాండవులను కన్నతల్లివలె ఆదరించి వారిని భయవిముక్తులను చేసింది. ఈ సంఘటన బట్టి గాంధారియొక్క పాతివ్రత్యప్రభావము అనుపమానం అయినదని తెల్లమవుతూ ఉంది. కడపట ఆమె తన క్రోధాన్ని శ్రీకృష్ణునిమీదకు మరలించింది. లేదా అంతర్యామి అయిన శ్రీకృష్ణభగవానుడే ఆమె బుద్ధిని మార్చి పాండవులను ఆమె కోపదృష్టినుండి తప్పించి ఆమె యిచ్చే అభిశాపానికి తనను తాను గురి చేసుకొన్నాడు. అని కూడ చెప్పుకోవచ్చును. గాంధారీదేవి కురుక్షేత్రానికి పోయి అచ్చటి హృదయవిదారక దృశ్యాన్ని చూచింది. తోడనే ఆమె తన శోకావేగాన్ని తట్టుకోలేకపోయింది. అప్పుడామె ఆగ్రహోదగ్రురాలై శ్రీకృష్ణునితో ఇలా పలికింది - "కృష్ణా! పాండవులు, కౌరవులు తమలోని అంతర్గతకలహంవలననే నష్టపోయారు. కాని నీవు సమర్థుడవై యుండి

కూడ నీ బందుగులను ఎందులకు ఉపేక్షించావు? నీ దగ్గఱ ఎందఱో సేవకులూ ఉన్నారు. ఎంతయో సైన్యమూ ఉంది. నీవు ఇరుపక్షాల వారిని అణచి యుంచగలవు. వారికి తగిన విధంగా నచ్చజెప్ప గలవు. కాని నీవు అలా చేయలేదు. బుద్ధిపూర్వకంగానే కౌరవసంహారం పట్ల ఉపేక్ష వహించావు. కాబట్టి దాని ఫలితాన్ని నీవు ఇప్పుడు అనుభవించెదవుగాక" నేను పతిసేవ చేసి కూడబెట్టుకొన్న తపస్సుయొక్క బలంతో ఇదే నిన్ను శపిస్తున్నాను. పరస్పరమూ యుద్ధం చేసుకొని నష్టపడుతూ ఉన్న పాండవులను, కౌరవులను ఎలా ఉపేక్షించావో అలాగే నీవు నీ సోదరులను బంధువులను కూడ ఉపేక్షించి వారి మృత్యుకారణమయ్యెదవు. నీవు కూడ అనాథునివలె నిహతుడవు అయ్యెదవు గాక! ఈనాడు తమ భర్తలను కోల్పోయి, భరతవంశపుస్త్రీలు అనాథలై యే విధంగా ఆర్తనాదాలుచేస్తున్నారో ఆ విధంగానే నీకుటుంబానికి చెందిన స్త్రీలు అందరూ తమ మగవారు అందరూ మరణించగా నెత్తి మొత్తుకొని బోరున విలపించెదరు గాక!.

గాంధారి యాడిన ఈ కఠోరవచనాలను విని శ్రీకృష్ణుడు చిఱునవ్వు నవ్వి యిలా అన్నాడు. అమ్మా! నీవు ఎలా జరగాలని శపించావో అది అలా జరగనున్నదని నేను ముందే ఎరుగుదును. నీవు శాపం ద్వారా జరగనున్నదానిని వెల్లడించావు. దైవకోపానికి గుఱియై వృష్ణి (యాదవ) వంశం అంతరించనున్నది అని అనడంలో సందేహంలేదు. దానిని నేను తప్ప మఱియెవ్వరూ అంతరింపజేయలేరు. కాబట్టి యీ యాదవులు పరస్పరకలహాలతోనే మరణిస్తారు.

యుధిష్ఠిరునకు పట్టాభిషేకం అయ్యాక గాంధారి కొంత కాలం అతని దగ్గఱనే ఉండి కడపట తన భర్తతోడ వనానికి వెడలిపోయి అక్కడ మునిజీవన విధానాన్ని అవలంబించింది. అంతమందు పతితో కూడి తన శరీరాన్ని దావాగ్నిదగ్ధం కావించుకొని తుదకు తన భర్తను అనుగమించి కుబేరలోకం పొందింది. ఈ విధంగా గాంధారి ఇహలోకంలో ఉన్నంతకాలమూ పాతివ్రత్యధర్మాన్ని అనుష్ఠించి పరలోకంలో కూడ భర్తృసాన్నిధ్యాన్ని, అతని సేవాభాగ్యాన్ని పొందింది. అలా పొందడమే పతివ్రతలు కోరుకొనే పరమలక్ష్యం. పతివ్రతాలక్షణాలను కోరుకోనే ప్రతిస్త్రీయు నిత్యమూ గాంధారి చరిత్రాన్ని మననం చేసి తద్ద్వారా తన చరిత్రమును చక్కబరచుకోవాలి.

మహానుభావుడు విదురుడు

మహానుభావుడైన విదురుడు సాక్షాత్తు ధర్మదేవత యొక్క అవతారం. మాండవ్య మహర్షి యిచ్చిన శాపం కారణంగా ఇతడు శూద్రయోనిలో జన్మింపవలసినవాడు అయ్యాడు. ఇతడు మహారాజు విచిత్రవీర్యుని దాసి కడుపున పుట్టాడు. ఈ విధంగా ఇతడు ధృతరాష్ట్రునకు పాండురాజునకు ఒక విధంగా నిజసోదరుడు అయినవాడు. ఇతడు మహాబుద్ధిమంతుడు. నీతికోవిదుడు. ధర్మవేత్త. విద్యావంతుడు. సదాచారసంపన్నుడు. భగవద్భక్తుడు ఈ గుణాల మూలంగానే ఇతనిని ఎల్లరూ విశేషగౌరవదృష్టితో చూచేవారు. ఇతడు బహు నిర్భయుడు. సామ్యవాది ఇతడు ధృతరాష్ట్రాదులకు మంచిమంచి సలహాలను ఇచ్చేవాడు. ఇతడు ధృతరాష్ట్రుని మంత్రి, దుర్యోధనుడు పుట్టగానే గాడిదలాగున ఓండ్రపెట్టడం మొదలుపెట్టాడు. అతని జన్మకాలంలో ఎన్నో అమంగళసూచకములైన ఉత్పాతాలు సంభవించాయి. అది చూచి విదురుడు బ్రాహ్మణులను తోడ్కొని ధృతరాష్ట్రుని కడకు పోయి - మహారాజా! ఈ బిడ్డ వంశనాశనకర్త అవుతాడు. కాబట్టి వానిని పరిత్యజించివేయడం మంచిది అని అతనికి తెలియజెప్పాడు. అంతేకాదు. ఆ బిడ్డ బ్రదికియుంటే కన్నవారు దుఃఖాల పాలు గావలసి వస్తుందని కులంకోసం ఒక మనుష్యుని, గ్రామంకోసం ఒక కులాన్ని, దేశంకోసం ఒక గ్రామాన్ని, ఆత్మకోసం సమస్త భూమండలాన్ని పరిత్యజింపదగునని శాస్త్రం చెపుతోంది అని కూడ వివరించాడు. ఆనాడు మోహవశమున ధృతరాష్ట్రుడు విదురుని మాటలను పెడచెవిని పెట్టాడు. దానికి ఫలితంగాను, దుర్యోధనుని మూలంగాను యావజ్జీవమూ అతడు దుఃఖం అనుభవించవలసినవాడూ, తాను బ్రదికియుండగా తన వంశనాశనాన్ని చూడవలసినవాడూ అయ్యాడు. మహాత్ములైనవారి మాటలను తిరస్కరిస్తే అనుభవములోనికి వచ్చేది దుఃఖమే.

దుర్యోధనుడు మాటమాటకి పాండవులమీద అత్యాచారాలు సాగిస్తూ ఉండడం చూచి సహజంగానే విదురుని సానుభూతి పాండవుల వైపున

ఉంది. అందులకు కారణం ఒకటి వారు పితృహీనులు. రెండు ధర్మాత్ములు. ఇతడు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడ వారిని రక్షిస్తూ ఉండేవాడు. వారికి తన సహాయసహకారాలను అందిస్తూ ఉండేవాడు. ధర్మాత్ములైన వారి మీద ధర్మదేవతకు సానుభూతి ఉండడం సహజమే. విదురుడు సాక్షాత్తు ధర్మదేవత అవతారం. పాండవుల మీద ఎన్ని కష్టాలు వచ్చిపడినా కడకు వారే జయిస్తారని అతడు ఎఱుగును. కారణం? "యతో ధర్మస్తతో జయః" అన్న శాస్త్రోక్తియే. ఆ ఉక్తికి ధర్మం ఏ పక్షాన ఉంటే ఆ పక్షం గెలుస్తుంది అనిభావం. పాండవులు దీర్ఘాయుష్మంతులు అని వారిని ఎవ్వరూ సంహరించలేరు అని కూడ అతడు ఎఱుగును. ఆటపాటల సందర్భంలో దుర్యోధనుడు భీమునిచేత విషం తినిపించి వానిని గంగానదిలోనికి త్రోసివేసాడు. అతడు ఇంటికి మఱలి రాకపోవుటతో కుంతీదేవికి చింత మొదలయింది. దుర్యోధనుడు వానికి ఏమైన హాని కలిగించాడేమో అన్న అనుమానం కూడ ఆమెకు కలిగింది. అప్పుడు విదురుడు ఆమె కడకు పోయి అమ్మా! విచారించకు! ప్రస్తుతం నీవు ఎవరి మీదను ఏ అనుమానాన్ని బహిర్గతం చేయవలదు. దుర్యోధనునిపై సందేహాన్ని ప్రకటిస్తే మఱింత ముప్పును ఎదుర్కోవలసివస్తుంది. అతనికి కోపం కలిగితే నీ మిగిలిన బిడ్డలకు కూడ హాని కలుగవచ్చును. భీమసేనుడు మరణించువాడుకాదు. అతడు శీఘ్రంగానే మఱలి వస్తాడు. అని ఆమెకు నచ్చజెప్పాడు. కుంతి విదురుడు ఇచ్చిన సలహాను మన్నించింది. అతడు చెప్పిన మాట యథార్థం అయింది. కొలది దినములలోనే భీమసేనుడు సజీవుడుగా మఱలి వచ్చాడు.

లక్కయింటినుండి నిరపాయంగా తప్పించుకొని పాఱిపోవడానికి కూడ పాండవులకు ఉపాయం చెప్పినవాడు విదురుడే. ఇతడు నీతివేత్తయే కాదు, బహుళబాషావేత్త కూడ. పాండవులు వారణావతనగరానికి వెడలుచున్న వేళ ఇతడు మ్లేచ్ఛభాషలో యుధిష్ఠిరునకు వారిపై వచ్చిపడ నున్న విపత్తును సూచించి దానినుండి తప్పించుకొనే ఉపాయం కూడ తెలియజెప్పేడు. అంతియేకాదు. ఒక సొరంగం త్రవ్వేవానిని రావించి వానిచేత ఇతడు పాండవులు లాక్షాగృహం నుండి గుప్తంగా పాఱిపోవుటకు అనువుగా సొరంగాన్ని కూడ త్రవ్వించేడు. ఆ ఖనకుడు లాక్షాగృహంలోపల నుండి భూగర్భాంతర్గతంగా పోయి ఒక అడవిలో బయల్పడునంత దూరం గుప్తమార్గం

కల్పించాడు. లాక్షాగృహానికి నిప్పుపెట్టి పాండవులు కుంతీదేవిని వెంట బెట్టుకొని ఆ గుప్తమార్గాన సాగిపోయి నిరపాయంగా అడవిలో వెలికి వచ్చారు. వారు అచ్చటనుండి గంగాతీరం చేరగా వారిని నదిని దాటించుటకై విదురుడు ముందుగానే అక్కడ ఒక నావను, నావికుని సిద్ధంచేసి ఉంచేడు. ఆ నావను ఎక్కివారు గంగానదిని దాటిపోయారు. ఈ విధంగా విదురుడు తన తెలివిని, నీతికుశలతను వినియోగించి నేర్పుగా దుర్యోధనాదులకు తెలియరాని విధంగా పాండవుల ప్రాణాలను కాపాడాడు. పాండవులు తమ తల్లితోడ లక్కయింటి మంటలలో చిక్కి దగ్ధం అయిపోయారు అనియే దుర్యోధనాదులు భావించుకొన్నారు. కేవలము శరీరబలంకాని, అస్త్రబలంకాని సర్వత్ర పనిచేయవు. ఒక్కొక్క యెడ ఆత్మరక్షణం కోసం నైతికబలం కూడ కావలసివస్తూ ఉంటుంది. మహానుభావుడు విదురుడు ధర్మమర్మాలను ఎఱిగినవాడూ, శాస్త్రపరిజ్ఞానం కలవాడూ మాత్రమే కాదు నీతిలో కూడ నిధి యయినవాడు.

విదురుడు ఏ విధంగా పాండవుల యెడల సానుభూతి, ఆదరాభిమానాలు కలిగి ఉండేవాడో ఆ విధంగానే తన అన్న అయిన ధృతరాష్ట్రుని యందు, అతని సంతానమునందును కూడ స్నేహము, ఆత్మీయత కలిగి యుండేవాడు. ఎల్ల వేళల వారి హితమును అకాంక్షిస్తూ వారికి మంచి మార్గమును సూచిస్తూ ఉండేవాడు. "హితం మనోహారి చ దుర్లభం వచః" హితకరమూ మనోహరమూ అయిన మాట దుర్లభం అయినది అన్న సూక్తిని అనుసరించి ఈ విదురుడు చెప్పేమాటలు సత్యములూ, హితకరములూ అయినా దుర్యోధనునకు కటువుగానే తోస్తూ ఉండేవి. ఆ కారణంగా దుర్యోధనుడు, వాని సహచరులూ కూడ ఎల్లవేళలా ఈ విదురుని యెడల అసంతృప్తినే వహిస్తూ ఉండేవారు. అయినా ఇతడు వారి అసంతృప్తిని కొంచెమైన పరిగణించక నిరంతరమూ వారి శ్రేయస్సునే కాంక్షిస్తూ ఉండేవాడు. పెడత్రోవలనుండి వారిని మఱలించడానికి సర్వదా ప్రయత్నిస్తూనే ఉండేవాడు. ధృతరాష్ట్రుడు కూడ దురాత్ముడైన తన కుమారునకు లోబడి యున్నవాడైన కారణంచేత ప్రతిసారి విదురుని సూచనలను అనుసరించలేకపోయేవాడు. తత్కారణంగా కష్టాల పాలవుతూ ఉండేవాడు. అయినా అతనికి విదురునిమీద మిక్కుటమైన విశ్వాసం ఉండేది. అతడు బుద్ధిమంతుడని, దూరదృష్టి కలవాడని, తన

పరమహితమును కోరేవాడని నమ్మేవాడు. తఱచుగా అతని సలహాలేకుండ ఏ పని చేసేవాడు కాదు. ప్రధానంగా పాండవులతో వ్యవహరించే వేళ మాత్రం అతని అభిమతాన్ని అడిగి తెలిసికొనేవాడు. పాండవుల విషయంలో విదురుని అభిప్రాయం పక్షపాతరహితంగా ఉంటుందని అతడు ఎఱుగును.

శకుని మామ సూచనను అనుసరించి పాండవులతో జూదం ఆడే తన ప్రస్తావాన్ని ఎఱిగించే ఉద్దేశ్యంతో దుష్టాత్ముడైన దుర్యోధనుడు తన చెంతకు వచ్చిన సందర్భంలో కూడ ధృతరాష్ట్రుడు నియమానుసారంగా ఆ విషయంలో విదురుని అభిమతాన్ని తెలిసికొనగోరి అతనిని పిలిపించాడు. తన అభిప్రాయాన్ని కాదంటే తాను తన ప్రాణాలు తీసుకొంటానని దుర్యోధనుడు తండ్రిని బెదిరించాడు. అయినా విదురునితో మంత్రణం చేయక ముందు నీకు ఎంత మాత్రమూ జూదమాడుటకు అనుమతిని ఇచ్చేది లేదని తండ్రి కొడుకుకి స్పష్టంగా బదులు చెప్పాడు. దుర్యోధనుని పాపపు తలంపును ఎఱిగి విదురుడు ఇక కలియుగం రానున్నదని భావించుకొన్నాడు. అతడు ఈ ప్రస్తావాన్ని పూర్తిగా ప్రతిఘటించాడు. అన్నా! జూదం ఆడడం వలన నీకొడుకులకు, నీ తమ్ముని కొడుకులకు నడుమ విరోధాలు ప్రబలుతాయి. దానివలన ఎవరికీ కూడ మేలు కలుగదు. కాబట్టి సర్వవిధాల ఈ జూదప్రయత్నం విరమించడమే మంచిది. అలా చేయడంలోనే ఇరుపక్షాలకు శ్రేయస్సు ఉంది అని తన అన్నకు నచ్చజెప్పాడు. ధృతరాష్ట్రుడు విదురుని, అతని అభిమతాన్ని మెచ్చుకొని జూదప్రయత్నం విరమించుమని దుర్యోధనునకు ఎంతగానో నచ్చజెప్పాడు. కాని ఎంత చెప్పినా దుర్యోధనుడు వినలేదు. అతడు ఏదో ఒక విధంగా పాండవులను జూదంలో ఓడించి అవమానించాలని పట్టుదల వహించి యున్నాడు. అతడు పాండవుల వైభవాన్ని, అభివృద్ధిని చూచి ఓర్వలేకున్నాడు. ఎన్ని విధాల చెప్పినా వినకపోవడంతో ధృతరాష్ట్రుడు అతని ప్రస్తావాన్ని అంగీకరించక తప్పలేదు. పాండవులను ఇంద్రప్రస్థం నుండి రావించడానికి విదురుని చేతనే కంబురంపడం కూడ జరిగింది. ఆ పని చేయడం తనకు ఇష్టం లేకున్నా అన్నగారి ఆజ్ఞను ఉల్లంఘించడం ఇష్టంలేక కష్టం మీద విదురుడు అందులకు సమ్మతించాడు.

పాండవుల చెంతకు అరిగి విదురుడు వారికి అన్ని విషయాలూ

వివరించి చెప్పాడు. మహారాజు యుధిష్ఠిరుడు కూడ జూదం దుర్వృత్తి అని ఎఱిగి యుండి కూడ పెదతండ్రి యాజ్ఞగా భావించి దుర్యోధనుని ఆహ్వానాన్ని స్వీకరించాడు. జూదం ఆడే సమయంలో కూడ ఈ విదురుడు అన్నా! ఇప్పుడైన నా మాట వినండి. ద్యూతప్రయత్నాన్ని విరమింపజేయండి. దుర్యోధనుని మాటలో మాట కలపడం మానండి. వంశాన్ని సర్వనాశనదశనుండి కాపాడండి. పాండవులతో విరోధం తెచ్చుకొని వారిని శత్రువులను చేసుకోవడం తగదు అని ధృతరాష్ట్రునకు పలు విధాలుగా నచ్చజెప్పాడు. పాండవులు వనంలోనికి వెడలిపోయిన తరువాత ధృతరాష్ట్రునకు ఎంతో చింత, సంతాపమూ కలిగాయి. అతడు విదురుని రావించి అతనికి తన మనోవ్యధను అంతనూ ఎఱిగించి విదురా! ఇప్పుడు ప్రజలకు మనమీద అప్రసన్నత కలుగకుండా ఉండాలి అంటే, అలాగే కుపితులై పాండవులు మనకు ఎలాంటి హాని తలపెట్టకుండా ఉండాలి అంటే మనం ఏమి చేయాలి? అని అతనిని అడిగాడు. అప్పుడు విదురుడు ఇలా బదులు చెప్పాడు - "మహారాజా! ధర్మార్థకామమోక్షాలు అనునాలుగు పురుషార్థాలలో మొదటిదాని వలననే మిగిలిన మూడు ప్రాప్తిస్తూ ఉంటాయి. రాజ్యానికి మూలం ధర్మం. కాబట్టి మీరు ధర్మనిష్ఠులై యుండి పాండవులను, కౌరవులనూ రక్షించండి. మీ కుమారులు శకుని అభిమతాన్ని అనుసరించి నిండుసభలో ధర్మాన్ని తిరస్కరించారు. వారు సత్యసంధుడైన యుధిష్ఠిరుని మాయ జూదంలో ఓడించి వారి సర్వస్వాన్ని హరించారు. అది ఎంతయో హేయమైన అధర్మాచరణం అయింది. దీనినుండి విముక్తి పొందాలి అంటే, మీ కుమారుడు పాపవిముక్తుడై కళంకరహితుడై ప్రతిష్ఠను పొందాలి అంటే అందులకు ఒకటే ఉపాయం ఉంది. అది యేమంటే మీరు హరించిన పాండవుల సొత్తును మఱల వారికి ఇచ్చివేయండి! ఎవనికి ఎంత మేరకు, హక్కు ఉంటుందో వాడు ఆ మేరతోనే తృప్తి చెందడం రాజధర్మం. పరుల హక్కును ఎన్నడూ అపేక్షించరాదు. మీకు వచ్చిన కళంకం పోవడానికి నేను చెప్పినదే తగిన ఉపాయం. దానివలన అన్నదమ్ముల నడుమ విరోధబీజాలు నాటుకోకుండా ఉంటాయి. అధర్మం జరుగకుండా ఉంటుంది. మీ కొడుకుల అదృష్టం ఏ కొంచెం శేషించి ఉన్నా సాధ్యమయినంత శీఘ్రంగా ఈ పని చేయాలి. వ్యామోహానికి లోబడి మీరు ఈ పని

చేయకుంటే కురువంశం అంతా నశించిపోక తప్పదు. మీ కుమారుడు దుర్యోధనుడు అందులకు సంతోషంగా సమ్మతిస్తే మంచిదే. అతడు సమ్మతించకపోతే కుటుంబక్షేమాన్ని, ప్రజాక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆ దురాత్ముని పట్టి వెంటనే చెఱసాలలో బంధించి యుధిష్ఠిరుని రాజ్యసింహాసనం మీద కూర్చుండబెట్టండి. యుధిష్ఠిరుని చిత్తంలో రాగద్వేషాలు లేవు. కాబట్టి అతడే ధర్మపూర్వకంగా భూపరిపాలనం చేయాలి. దుశ్శాసనుడు నిండు సభలో ద్రౌపదిని క్షమాభిక్ష వేడాలి. ఇంకనూ చెప్పేది ఏమున్నది. ఈ మేరకు చేయగలిగితే మీరు కృతకృత్యులు కాగలుగుతారు.

విదురుడు చేసిన యీ సదుపదేశం ఎంత సత్యమైనది? ఎంత హితకరమైనది? ఎంత ధర్మబద్ధమైనది? ఎంత నిర్భీకమైనది? అయిన నేమి? మరణానికి చేరువగా ఉన్నవానికి మందులు రుచించని విధంగా ధృతరాష్ట్రునకు విదురుని యీ హితోపదేశం ఈషణ్మాత్రమూ రుచించలేదు. అతడు విదురుని మీద కోపం ప్రదర్శించి విదురా! ఇక నీ ఆవశ్యకత నాకు లేదు. నీకు ఇష్టమైతే ఇక్కడ ఉండు! లేదా నీ యిచ్ఛవచ్చిన దిక్కునకు ఎందైన వెడలిపో! నేను పరికిస్తున్నాను. నీవు మాటికి మాటికి పాండవుల మీద పక్షపాతబుద్ధిని ప్రదర్శిస్తున్నావు. వాళ్లకోసం నేను నా కొడుకులను ఎలా వదులుకోగలను? అని అతనిని ఈసడిస్తూ మాటలాడాడు. అంతట విదురుడు ఇక కౌరవవంశనాశనం తప్పదు అని నిశ్చయం చేసుకొని మౌనంగా అటనుండి కదలి వచ్చి వెంటనే రథాన్ని అధిరోహించి కామ్యకవనంలో ఉన్న పాండవుల కడకు వెడిలిపోయాడు. అక్కడకు చేరి తాను హస్తినాపురంనుండి వచ్చివేయడానికి కారణం వారికి తెలియజేయడమే కాక ప్రాసంగికంగా అతడు వారికి బహుప్రయోజనకరం అయిన విషయం ఒకటి తెలియజెప్పాడు. ఇక్కడ ధృతరాష్ట్రునకు విదురుడు పాండవుల చెంతకు వెడలిపోయెనన్న వార్త వినుటతో ఎంతో పశ్చాత్తాపం కలిగింది. విదురుని సలహాను, సహకారాన్ని పొంది పాండవులు మఱింత బలవంతులు అవుతారేమో అన్న సందేహం అతనికి కలిగింది. వెంటనే అతడు సంజయునిచేత కబురంపి విదురుని వెనుకకు రావించాడు. విదురుడు రాగద్వేషాలు లేనివాడు. అతని మనస్సులో ధృతరాష్ట్రుని ఉద్దేశించి రోషం ఈషణ్మాత్రమూ లేదు. అన్నయొక్క ఆదేశమును అనుసరించి అతడు

ఎలా హస్తినాపురాన్ని వీడి వెడలిపోయాడో అలాగే వెనుకకు వచ్చివేయుమన్న ఆదేశాన్ని అనుసరించి మఱలి వచ్చివేసాడు అతడు ధృతరాష్ట్రుని సమీపించి మహారాజా! నిజం చెప్పాలి అంటే నాకు పాండవులు ఎంతయో మీ కుమారులు కూడ అంతే. నాకు ఇరువురూ సమానులే. అయినా పాండవుల అసహాయదశను చూచి వారికి సాయం చేయాలి అన్న భావన నాకు సహజంగా కలుగుతూ ఉంటుంది. అంతేకాని మీ బిడ్డల యెడల నాకు చెడ్డ తలంపులు ఏవీలేవు. అని తన మనోగతాన్ని ఎఱిగించాడు. అతడు చెప్పిన విషయం కూడ నిజమే. ధృతరాష్ట్రుడు కూడ తన అనుచితప్రవర్తనను గూర్చి అతనిని క్షమాభిక్ష వేడుకొన్నాడు. మఱల విదురుడు యథాపూర్వకంగా ధృతరాష్ట్రుని చెంతనే ఉంటూ అతనిని సేవింపసాగాడు.

ఒకనాడు ధృతరాష్ట్రునకు రాత్రివేళ నిద్ర పట్టలేదు. ఆ రాత్రియందే అతడు విదురుని తన చెంతకు పిలిపించి తనకు శాంతి లభించడానికి ఉపాయం ఏదైనా చెప్పుమని అతనిని అడిగాడు. అప్పుడు విదురుడు అతనికి ధర్మమును, నీతిని గూర్చి చక్కని సదుపదేశం చేసేడు. అది విదురనీతి అనే పేరుతో ఉద్యోగపర్వంలో 33 వ అధ్యాయం మొదలు 40వ అధ్యాయం వఱకు వివరింపబడి ఉంది. అది ప్రతివ్యక్తి చింతనము, మననము చేయవలసిన విషయం. గీతాప్రెస్,గోరఖ్‌పూర్ వారు ప్రకటించిన **"సంక్షిప్త మహాభారత్"** (హిందీలో) మరియు దాని యథాతథానువాదము విదురనీతి యని తెలుగులో ప్రచురించబడి ఉంది. చూడగోరినవారు దానిని చూడవచ్చును.

విదురుని ప్రసంగాన్ని విన్న ధృతరాష్ట్రునకు తృప్తి కలుగలేదు. అతడు ఇంకనూ ఏమో వినాలని అభిలషించాడు. అప్పుడు విదురుడు మహారాజా! నేను చెప్పదలచుకొన్నది అంతా చెప్పివేసాను. ఇక మీకు తాత్త్వికోపదేశం కావాలి. ఆ ఉపదేశం మీరు బ్రహ్మమానసపుత్రుడూ, సనాతనమహర్షివరేణ్యుడూ అయిన సనత్సుజాతుడు చేయగలడు. తాత్త్వికోపదేశం చేయడానికి నాకు అధికారం లేదు. కారణం ఏమంటే నేను శూద్రగర్భాన జన్మించినవాడను. అని ధృతరాష్ట్రునితో చెప్పి ఆ క్షణమందే సనత్సుజాతుని స్మరించాడు. వెంటనే అతడు అక్కడ ప్రకటమయ్యేను. అతడు ధృతరాష్ట్రుని ప్రశ్నలకు అన్నిటికీ సమాధానాలు చెపుతూ పరమాత్మ స్వరూపాన్ని, తత్సాక్షాత్కార

విషయాన్ని అతనికి విశదంగా వివరించి వినిపించాడు. ఈవిధంగా విదురుడు ధృతరాష్ట్రునకు నైతిక ధార్మిక విషయాలను తాను స్వయంగా ఉపదేశించడమే కాక సనత్సుజాతుని వంటి సిద్ధయోగి . ఋషిపుంగవుడూ అయినవాని చేత తాత్త్వికోపదేశం చేయించి అతని శ్రేయస్సునకు బాటను కల్పించాడు. ధృతరాష్ట్రుని, అతని కుమారులను ఉద్దేశించి విదురుడు ఏమి చేసినా వారి శ్రేయస్సును కోరియే చేస్తూ ఉండేవాడు. మహాత్ముల జీవితాలు సర్వదా అన్యుల కల్యాణార్థం ఉద్దేశింపబడినవియే కదా! విదురుడు తత్త్వవేత్తయే అయినా శూద్రుడైన కారణాన తత్త్వోపదేశం తాను స్వయంగా చేయకుండా ఉండి సనాతన మర్యాదను కాపాడాడు. ఈ విధంగా అతడు జ్ఞాని అయినవాడు కూడ శాస్త్రమర్యాదను ఉల్లంఘించరాదన్న విషయాన్ని తన ఆచరణం ద్వారా వెల్లడించాడు. సనత్సుజాతుడు చేసిన ఉపదేశం సనత్సుజాతీయము అనే పేరుతో ఉద్యోగపర్వంలో 41 మొదలు 46 వఱకు గల 6 అధ్యాయాలలో వివరించబడి ఉంది. దీని అనువాదం కూడ సంక్షిప్తమహాభారత్ - ప్రథమ ఖండములో యథాతథంగా హిందీలో ప్రచురితమై యుంది. పాఠకులు దానిని పూర్తిగా చూడాలి అని అనుకుంటే ఆ గ్రంథంలో చూడవచ్చును.

విదురుడు కేవలమూ జ్ఞానియు, తత్త్వవేత్తయు మాత్రమే కాదు. అనన్య భావంగల భగవద్భక్తుడు కూడ. ఇతనికి శ్రీకృష్ణుని చరణారవిందయుగళిపై పొచ్చెము లేని అచ్చుప్రేమ ఉంది. శ్రీకృష్ణభగవానుడు కూడ ఇతనిని విశేషంగా మన్నించేవాడు. అతడు పాండవుల పక్షాన రాయబారిగా వెడలినప్పుడు ధృతరాష్ట్రుని, అతని సభాసదులను కలిసికొని అటునుండి తిన్నగా విదురుని యింటికి పోయి అతని ఆతిథ్యాన్ని స్వీకరించాడు. అనంతరం అతడు తన మేనత్త అయిన కుంతీదేవిని కలిసికొన్నాడు. దుర్యోధనుని గృహానికి వెడలినప్పుడు తనను ఆ దుర్యోధనుడు భోజనం చేయుమని ప్రార్థించగా అతని ప్రార్థనను నిరాకరించి శ్రీకృష్ణుడు మరల ఆ విదురుని సదనానికి వెళ్లాడు. అక్కడకు భీష్ముడు, ద్రోణుడు కృపాచార్యుడు, బాహ్లీకుడు మొదలైన పూజ్యనీయులైన మహానుభావులు అందఱూ అతనిని కలిసికొనుటకు వచ్చారు. వారు అందఱూ తమ తమ గృహాలలో ఆతిథ్యం స్వీకరించుమని అతనిని అర్థించారు. కాని అతడు

అందులకు సమ్మతింపక వారిని అందఱను గౌరవపూర్వకంగా మాటలాడి వెనుకకు పంపివేసేడు. ఆనాడు విదురుని యింటనే ముందుగా బ్రాహ్మణులను భుజింపజేసి అనంతరం తాను భోజనం చేసాడు. ఈ సంఘటన వలన శ్రీకృష్ణుని యందు విదురునకు ఎంత ప్రీతియున్నదో మనం ఊహించవచ్చును. శ్రీకృష్ణుని నియమమే అట్టిది కదా!-

శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యే మే భక్త్యాప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥

(గీత. 9/26)

ప్రేమరహితంగా చేయబడే పెద్దపెద్ద యేర్పాటులు, రాజదర్పాన్ని ప్రకటించే ఆడంబరపూర్వకములైన వ్యవస్థలు ఆ భగవానుని ఆకర్షింపజాలవు. తగినన్ని ఆదరువులు లేకపోయినా ప్రేమరసపరిప్లుతమైనది ఏదో అట్టి భోజనమే అతనికి తృప్తి కలిగిస్తుంది.

భోజనం అయిన పిమ్మట నాటి రాత్రి కూడ శ్రీకృష్ణుడు అచ్చటనే విదురుని యింటనే ఉండిపోయాడు. రేయంతా ఇష్టాలాపగోష్ఠితో గడిపాడు. తెల్లవాఱిన మీదట నిత్యకర్మలను నిర్వర్తించుకొని అతడు కౌరవుల సభలోనికి మఱలి వచ్చాడు. అప్పుడు దుర్యోధనుడు అతనిని పట్టి బంధించాలని దుస్సాహసపూర్వకమైన ఆలోచన చేసాడు. ఆ సందర్భంలో విదురుడు శ్రీకృష్ణుని బలమును, మహత్త్వమును వివరిస్తూ దుర్యోధనా! ఇతడు సాక్షాత్తు సర్వతంత్రస్వతంత్రుడైన యీశ్వరుడు. ఇతనిని అవమానించాలి అనే దుస్సాహసచర్యకు పాల్పడితే అగ్నిలో పడిన మిడుత వలె భస్మం అయిపోగలవు. అని అతనికి హెచ్చరిక చేసాడు. అనంతరం శ్రీకృష్ణ భగవానుడు తన విశ్వరూపాన్ని ప్రకటించాడు. అప్పుడు అచ్చట ఉన్నవారు అందరూ భయపడి కన్నులు మూసుకొన్నారు. కేవలము ద్రోణాచార్యుడు, భీష్ముడు, విదురుడు, సంజయుడు, అచ్చట చేరియున్న మహర్షులు మాత్రమే తన విశ్వరూపాన్ని దర్శించుటు వీలుగా భగవానుడు వారికి దివ్యదృష్టిని అనుగ్రహించాడు. ఒకింత తడవు అయిన మీదట భగవానుడు తన విశ్వరూపమును ఉపసంహరించుకొని తాను ఏ ఉపప్లావ్యమునుండి పయనమై వచ్చెనో అచ్చటకే తిరిగి వెడలిపోయాడు. విదురుడు కూడ ఇతరజనులతో కూడి ఆ భగవానుని సాగనంపుటకు అతని వెంట కొంత దూరమరిగి అతని

సెలవుగైకొని వెనుకకు మఱలి వచ్చాడు.

శ్రీకృష్ణుని రాయబారం విఫలం కావడం చేత ఇరుపక్షాల యుద్ధసన్నాహాలు మొదలయ్యాయి. 18 అక్షౌహిణుల సైన్యంతో ఇరుపక్షాలవారూ కురుక్షేత్రపు మైదానంలోనికి చేరుకొన్నారు. 18 దినాలలో ఆ 18 అక్షౌహిణుల సైన్యమూ పూర్తిగా నశించిపోయింది. ధృతరాష్ట్రమహారాజు తన పుత్రపౌత్రాదులు మరణించడం వలన మహాదుఃఖం పొందాడు. అప్పుడు విదురుడు ఎంతటివారికి అయినా మృత్యువు తప్పదు అని నిరూపిస్తూ మహారాజా! యుద్ధంలో మరణించినవారికి ఉత్తమగతులు కలుగుతాయి. కావున మరణించినవారికై చింతింపరాదు అని చెప్పి ధృతరాష్ట్రుని ఊరడించాడు. అంతియేకాదు. అతడు మహారాజుతో ఇంకనూ ఇలా అన్నాడు - మహారాజా! జీవుడు ఎన్ని మాఱులు జన్మమెత్తితే అన్నిమాఱులూ వేఱువేఱు వ్యక్తులతో సంబంధాలను జోడించుకొంటాడు. ఆ సంబంధాలు అన్నీ మరణానంతరం స్వప్నం లాగున విలీనములు అయిపోతూ ఉంటాయి. కాబట్టి యీ దృష్టితో కూడ మరణించిన స్వజనాన్ని గూర్చి శోకించరాదు. సుఖాన్ని కాని, దుఃఖాన్ని కాని, సంయోగాన్ని కాని, వియోగాన్ని కాని కలిగించే సంఘటనలు ఎన్ని ఉంటే అన్నీ మనం ముందు చేసుకొన్న శుభాశుభకర్మలకు ఫలితంగా ప్రాప్తించునట్టివే అన్న విషయం మనం మఱచిపోరాదు. కర్మఫలాన్ని ఎల్లరూ అనుభవించవలసినవారే. ఇలా చెప్పిన తరువాత విదురుడు ఇంకనూ ధృతరాష్ట్రునకు సంసారం యొక్క అశాశ్వతస్థితి, దాని సారహీనత్వమూ, దాని పరివర్తనస్వభావము, జననమరణసంబంధములైన బాధలు, జీవుని అవివేకదశ, అందఱియందు మృత్యువునకు ఉండే సమతాలక్షణమూ, ధర్మాచరణంలోని మహత్త్వమూ మొదలైన జ్ఞాతవ్యవిషయాలను ఎన్నిటినో వివరించి కడపట సాంసారిక దుఃఖాలనుండి విముక్తి పొందడానికి అనుసరించదగిన ఉపాయాలను కూడ సూచించాడు.

యుధిష్ఠిరుని రాజ్యపట్టాభిషేకం పూర్తియైన మీదట ధృతరాష్ట్రుడు పాండవుల చెంతనే ఉండసాగాడు. అప్పుడు విదురుడు కూడ అతని వెంటనే ఉండి అతనికి ధర్మప్రసంగాలు వినిపిస్తూ కాలం గడిపేవాడు. అక్కడనుండి గాంధారీ ధృతరాష్ట్రులు వనంలోనికి వెడలిపోవ నిశ్చయించుకొన్న తరుణంలో ఇతడు కూడ వారిని అనుగమించి వనప్రవేశం చేసాడు.

ఇతడు కఠినమైన తపోనిష్ఠ వహించాడు. ఆ నిర్జనారణ్యంలో ఇతడు నిరాహారంగా ఏకాంతవాసం చేయ నారంభించాడు. ఆ శూన్యవనంలో అప్పుడప్పుడు జనులు కానవస్తూ ఉండేవారు. కొంతకాలం గడచిన మీదట మహారాజు యుధిష్ఠిరుడు తన సమస్తపరివారాన్ని, సైన్యాన్ని వెంట బెట్టుకొని తన పెదతల్లిని, పెద తండ్రిని, తల్లిని చూడగోరి వనంలోనికి వచ్చాడు. అక్కడ విదురుని కానక అతడు ఏమయ్యేనని ధృతరాష్ట్రుని అడుగుతూండగా అప్పుడే అతనికి దూరంలో విదురుడు కానవచ్చాడు. ఆ విదురుని తన తల జడలు కట్టింది. అతడు నోట ఱాయి పెట్టుకొన్నాడు. (మౌనవ్రత సంకేతం) దిగంబరుడై యున్నాడు. ధూళిధూసరితంగాను, దుర్బలంగానూ ఉన్న అతని శరీరంలో నాడులు పైకి పొటమరించుకొని వచ్చాయి. మురికి దేహమందు సర్వత్రా పేరుకొని యుంది. అతడు ఒక మాఱు ఆశ్రమం వంకకు చూచి మఱలిపోవసాగాడు. యుధిష్ఠిరుడు అతనిని కలిసికొనుటకై అతని వెనుక పరుగుపెట్టి బిగ్గఱగా తన పేరుచెప్పి అతనిని పిలవడం మొదలుపెట్టాడు. ఘోరారణ్యంలో ప్రవేశించి విదురుడు ఒక చెట్టుపట్టు వహించి స్థిరంగా నిలువబడ్డాడు. యుధిష్ఠిరునకు చూడగా విదురుని శరీరం అస్థిమాత్రవశిష్టంగానూ, గుర్తుపట్ట శక్యం కాని విధంగాను గోచరించింది. అతడు ఎదురుగా పోయి ఆ విదురుని పూజించాడు. విదురుడు సమాధిదశను పొంది నిర్నిమేషంగా యుధిష్ఠిరుని వంకకు చూడసాగాడు. అటుపిమ్మట అతడు యోగబలంతో తన అంగములను యుధిష్ఠిరుని అంగములందు, తన యింద్రియాలను అతని యింద్రియములందు, తన ప్రాణాలను అతని ప్రాణాలయందు సమ్మిళితం చేసి పూర్తిగా అతని శరీరంలో ప్రవిష్టుడు అయిపోయాడు. అతని శరీరం నిష్ప్రాణమై యథాతథంగా చెట్టు మ్రానునకు చేరబడి నిలిచి ఉండిపోయింది. ఈ విధంగా సాక్షాత్తూ ధర్మదేవత అవతారమూ, మహాత్ముడూ అయిన విదురుడు యావజ్జీవమూ ధర్మమయజీవనం సాగించి కడపట ధర్మమూర్తి అయిన మహారాజు యుధిష్ఠిరుని శరీరంలో విలీనం అయిపోయేడు. ధర్మదేవతా! నీకు జయము! జయము! నమస్కారము.

మంత్రివర్యుడు సంజయుడు

సంజయుడు మహారాజైన ధృతరాష్ట్రుని మంత్రి. ఇతడు జాతిచేత సూతుడు. ఇతడు మిక్కుటమైన ప్రభుభక్తి కలవాడు. బుద్ధిమంతుడు, నీతివేత్త, ధర్మమర్మవిదుడు. అంతియే కాదు. ఇతడు సత్యవాది. నిర్భయుడు కూడ. ఇతడు ధృతరాష్ట్రునకు మంచిమంచి సూచనలు చేసేవాడు. అతని హితమును కోరి అప్పుడప్పుడు నిర్భయంగాను కటువుగాను కూడ మాటలాడేవాడు. ఇతడు కడదాకా ధృతరాష్ట్రునకు సహకరించాడు. ఇతడు మహర్షి వేదవ్యాసుని కృపకు పాత్రమైనవాడు. అర్జునునియందు, శ్రీకృష్ణునియందు ఇతనికి ప్రీతిమెండు. ఇతడు దుర్యోధనుని అత్యాచారాలను ఖండించేవాడు. వానిని సమర్థించిన సందర్భాలలో ధృతరాష్ట్రుని దుయ్యబట్టేవాడు. పాండవులు రెండవ మాఱు కూడ జూదంలో ఓడి వనవాసం చేస్తూ ఉన్నకాలంలో ఇతడు దుర్యోధనుడు పాండవులతోడ సాగిస్తూ ఉన్న అనుచితప్రవర్తనను కఠినంగా విమర్శిస్తూ ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు - మహారాజా! మీకు వంశనాశనం ఎట్లునూ తప్పదు. దానితోబాటు ఏ పాపమూ ఎఱుగని ప్రజలు కూడ నశిస్తారు. భీష్ముడు, ద్రోణాచార్యుడు, విదురుడు నీ కొడుకులను ఎంతగానో వారించారు. అయినా వారి మాటలను లెక్క చేయక ధర్మపరాయణురాలైన పాండవుల ధర్మపత్ని ద్రౌపదిని సభలోనికి రావించి అవమానించారు. ఆ కార్యక్రమంలో నీ సిగ్గుమాలిన కొడుకులు దుర్యోధన, దుశ్శాసనులు ప్రముఖపాత్ర వహించారు. "వినాశకాలే విపరీత బుద్ధిః" చేటుకాలం చేరువకు వచ్చినప్పుడు మానవుల బుద్ధి భ్రష్టం అవుతుంది. అన్యాయం కూడ న్యాయం లాగా కావస్తుంది. నీ కొడుకులు అయోనిసంభవురాలై పతిపరాయణురాలై యజ్ఞవేదిక నుండి ప్రాదుర్భవించిన అసాధారణ వనితారత్నము అనదగిన ద్రౌపదిని నిండు సభలోనికి తెచ్చి దారుణంగా అవమానంచి మహాభయంకర యుద్ధానికి స్వాగతం పలికేరు. ఇలాంటి పాడు పనిని దుర్యోధనుడు తప్ప అన్యులు ఎవ్వరూ చేయలేరు. ఆహా! ఎంత చక్కని మందలింపు ఇది? ఎంత

నిర్భీకుడైన ఏ మంత్రియైనా మహారాజు సమక్షంలో యువరాజును గూర్చి ఇంతటి అప్రియసత్యాన్ని ఉగ్గడించగలడా? శాస్త్రంలో కూడ (అప్రియస్య చ పథ్యస్య శ్రోతా వక్తా చ దుర్లభః) అప్రియమైనా హితం కలిగించే మాటను చెప్పేవాడూ దొరకడు. చెప్పినా వినేవాడూ దొరకడు అని చెప్పబడి ఉంది. ధృతరాష్ట్రుడు సంజయుని మాటలు సత్యములే అని సమ్మతిస్తూ తనలో కొంత మానసిక బలహీనత ఉన్నదని, తత్కారణంగా తాను దుర్యోధనుని అత్యాచారాలను నిరోధింపలేకున్నానని బదులు చెప్పాడు.

సంజయుడు సామోపాయాన్ని విశేషంగా ఇష్టపడేవాడు. ఇతడు యుద్ధాన్ని వారించడానికి ఎంతగానో ప్రయత్నించాడు. ఇరుపక్షాలవారికి కూడ యుద్ధం వలన కలిగే అనర్థాలను తెలియజేప్పెడు. పారస్పరికవైరం యొక్క దుష్పరిణామాలను వివరించి యుద్ధప్రయత్నం మానండని ఎన్నో విధాల ఉద్బోధించాడు. పాండవులు ఇతని మాటలను మన్నించారు. కాని దుర్యోధనుడు వారి సంధిప్రస్తావాన్ని నిరాకరించాడు. తత్కారణంగా యుద్ధం అనివార్యం అయింది. దైవనిర్ణయమే అలా ఉన్నప్పుడు ఎవరు ఏమి చేయగలరు? కౌరవుల పక్షంలో భీష్మ, ద్రోణ, సంజయ, విదురుల అభిమతం తఱచు ఏకీభవిస్తూ ఉండేది. కారణం ఏమన వీరు నలుగురు ధర్మపక్షం వహించేవారు. హార్దికంగా పాండవులయందు సానుభూతి వహిస్తూ ఉండేవారు. ఈ నలుగురూ ధృతరాష్ట్రమహారాజునకు, అతని కొడుకులకు అప్రసన్నత కలుగుతుందని జంకక సత్యవచనం చెప్పడానికి ఎన్నడూ సందేహించేవారు కారు. నిజం ఎప్పుడూ చేదుగా ఉంటుంది కదా!

ధృతరాష్ట్రుడు తన పక్షాన సంజయుని రాయబారిని గావించి పాండవులతో మాటలాడడంకోసం ఉపప్లావ్యమునకు పంపాడు. సంజయుడు అక్కడకు పోయి నిజంగా పాండవులను ప్రశంసిస్తూ యుద్ధాన్ని విరమించండి అని వారికి సూచించాడు. యుద్ధంవలన అర్థం కాని, ధర్మంకాని ఏదీ సాధ్యంకాదని, సంధి కుదుర్చుకోవడమే శాంతికి సర్వోత్తమమైన ఉపాయం అని, ధృతరాష్ట్రమహారాజు కూడ శాంతినే కోరుతూ ఉన్నాడు. కృష్ణార్జునులకు ఇరువురకునూ తాను కృపాపాత్రుడు కావడం కారణంగా పాండవులు తన మాటను నిరాకరించరు అన్న దృఢవిశ్వాసం ఇతనికి ఉంది. తాను కోరితే తనకోసం అర్జునుడు ప్రాణాలనైన అర్పించగలవాడని కూడ ఇతడు

ఒకప్పుడు అర్జునుని విషయంలో పలికి యున్నాడు. దీనిని బట్టి ఇతనికి కృష్ణార్జునులమీద అనన్యప్రేమ ఉన్నట్లు వ్యక్తం అవుతోంది. యుధిష్ఠిరుడు ఎంతో ప్రేమతో ఈ సంజయుని మాటలను సమర్థించేడు. కాని ఇంద్రప్రస్థరాజ్యాన్ని తమకు ఇచ్చివేయవలెనని సంధికి ఒక నిబంధనను ప్రతిపాదించాడు. శ్రీకృష్ణభగవానుడు కూడ ఆ ప్రతిపాదనను సమర్థించాడు. అంతట సంజయుడు యుధిష్ఠిరుని సందేశాన్ని గ్రహించి హస్తినాపురానికి మఱలి వచ్చాడు. ధృతరాష్ట్రుని కడకు పోయి ముందుగా అతడు ఏకాంతంలో అతనిని ఎక్కువగా తిరస్కారవచనాలు అడేడు. అనంతరం అందరి ముందు అతనికి ఎక్కువగా తిరస్కారవచనాలు పలికాడు. అనంతరం అందరి ముందు అతనికి పాండవుల సందేశాన్ని వినిపించాడు. వారి యుద్ధసన్నాహాన్ని గూర్చి, వారి పక్షంలోని వీరుల శక్తిసామర్థ్యాలను గూర్చి విశదంగా వివరించాడు. దానితోబాటు శ్రీకృష్ణార్జునులు ఇరువురూ ఒకరితో ఒకరు కలిసిమెలసి ఎలా వ్యవహరిస్తున్నారో వివరించి వారి అభిన్నతను నిరూపించేడు. ఈ విషయంలో అతడు చెప్పిన మాటలు ఇవి. "మహారాజా! నేను శ్రీకృష్ణుణి, అర్జునుని కలియుటకు వెడలినప్పుడు వారు ఇరువురూ అంతఃపురంలో ఉన్నారు. వారున్న గదిలోనికి నకులసహదేవులకు కూడ ప్రవేశం లేదు. నేను అక్కడకు పోయి చూడగా శ్రీకృష్ణుడు తన రెండు పాదాలను అర్జునుని ఒడిలోను అర్జునుడు పెట్టుకొని యున్నారు" సంజయుడు చేసిన యీ వర్ణనను బట్టి శ్రీకృష్ణార్జునుల నడుమ భేదభావంలేదని, వ్యక్తం అవుతోంది. వారి మీద సంజయునకు అనన్యమైన ప్రేమ ఉన్నదని స్పష్టం అవుతోంది. ఏ ప్రదేశంలో అభిమన్యునకు, నకులసహదేవులకు కూడ ప్రవేశంలేదో, ఏ ప్రదేశంలో శ్రీకృష్ణార్జునులు తమ పట్టపు రాణులతోడ గూడి యేకాంతంలో బహు నిస్సంకోచంగా కూర్చుండి ఆనందపూర్వకంగా సమయం వెడలిస్తూ ఉన్నారో ఆ ప్రదేశానికి సంజయుడు నిర్నిరోధంగా వెడలిపోవడాన్ని బట్టి, వారి ఏకాంతగోష్ఠిలో అతడుకూడ పాలు పంచుకోవడాన్ని బట్టి అతడు కూడ వారితోడ అరమరికలు లేక హృదయపూర్వకంగా వ్యవహరించేవాడని తేటతెల్లం అవుతోంది.

సంజయుడు ఎట్లునూ భగవానుని యందు ప్రీతి యున్నవాడే. ఆ ప్రీతితో బాటు అతనికి భగవానుని స్వరూపపరిజ్ఞానం కూడ విశేషంగా

ఉంది. కొంత ముందునకు పోయి అతడు వేదవ్యాసమహర్షి, గాంధారి, మహానుభావుడైన విదురుడు ఎదుట ఉండగా ధృతరాష్ట్రమహారాజునకు శ్రీకృష్ణుని మహత్త్వాన్ని విశదంగా వివరించి అతడే సర్వలోకేశ్వరుడని ఎలుగజెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు సాక్షాత్తూ శ్రీకృష్ణుడు సర్వేశ్వరుడు అనే విషయం నీకు ఎట్లు తెలిసింది? అతనిని ఆ రూపంలో నేను ఏల గుర్తింపలేకున్నాను? అని సంజయుని ప్రశ్నించాడు. అప్పుడు సంజయుడు మహారాజా! నేను జ్ఞానదృష్టితోనే శ్రీకృష్ణుని గుర్తింపగలిగాను. జ్ఞానం లేకుండా ఎవ్వరూ అతని నిజరూపాన్ని తెలుసుకోలేరు అని వేదవ్యాసుని సమక్షంలోనే ధృతరాష్ట్రునకు బదులు చెప్పాడు. అంతేకాదు. నేను ఎన్నడూ కపటవృత్తిని ఆశ్రయించలేదు. మిథ్యా ధర్మాన్ని ఆచరించలేదు. ధ్యానయోగం మూలంగా నాకు అంతఃకరణం పరిశుద్ధం అయింది. అందుచేతనే నాకు శ్రీకృష్ణుని స్వరూపపరిజ్ఞానం సిద్ధించింది. అని కూడ అతడు తెలియజెప్పాడు. ఇలా పలికన మీదట సంజయుని ప్రశంసిస్తూ వేదవ్యాసుడు ధృతరాష్ట్రునితో రాజేంద్రా! ఇతనికి పురాణపురుషుడైన శ్రీకృష్ణుని స్వరూపపరిజ్ఞానం పూర్తిగా ఉంది. కాబట్టి నీవు ఇతని మాటలు వింటూ ఉంటే నిన్ను ఇతడు జననమరణరూపమైన మహాభయం నుండి అనాయాసంగా విముక్తుని చేయగలడు అని చెప్పాడు. సంజయుడు గొప్పజ్ఞాని అనడానికి ఇంతకంటె ప్రబలప్రమాణం వేఱుగా ఏమి కావాలి? అనంతరం నాయనా! నేను శ్రీకృష్ణుని తాత్త్వికంగా తెలిసికొనుటకు, తద్వారా అతని పరమపదాన్ని పొందగలుగుటకు అనువగు ఉపాయం ఏదయినా నాకు ఎఱిగింపుము! అని ధృతరాష్ట్రుడు సంజయుని కోరాడు. అప్పుడు సంజయుడు మహారాజా! ఇంద్రియాలను జయింపకున్న ఎవ్వడూ శ్రీకృష్ణుని పడయలేడు. భోగాలను వీడనిదే ఇంద్రియాలను జయించడం సాధ్యంకాదు. ప్రమాదము, హింస, భోగము - ఈ మూడింటిని పరిత్యజించడమే జ్ఞానానికి సాధనం. వీనిని వీడినప్పుడే పరమపదప్రాప్తి సంభవం అవుతుంది అని ధృతరాష్ట్రునకు ఎఱుగజెప్పి కడపట కొన్ని శ్రీకృష్ణుని నామాలను చక్కగా వ్యాఖ్యానించించి అతనికి వినిపించాడు. దీనిని బట్టి సంజయునకు గొప్ప శాస్త్రజ్ఞానం కూడ ఉన్నదన్న విషయం వ్యక్తం అవుతోంది.

ఇరుపక్షాల యుద్ధసన్నాహాలు పూర్తియై యిరు పక్షాలవారు కురుక్షేత్రపు

రణభూమికి చేరి యుద్ధసన్నద్ధులై యున్న తరుణంలో వేదవ్యాసమహర్షి సంజయునకు దివ్యదృష్టిని ప్రసాదించి ధృతరాష్ట్రునితో ఇలా అంటాడు - రాజేంద్రా! ఈ సంజయుడు ఎప్పటికప్పుడు నీకు యుద్ధవార్తలను తెలియజేస్తూ ఉంటాడు. సమస్త యుద్ధభూమియందు ఇతడు చూడలేని, తెలిసికొనలేని విషయం ఏదీ ఉండదు. ఇతడు దివ్యదృష్టి సంపన్నుడూ, సర్వజ్ఞుడునూ అయిపోతాడు. ప్రత్యక్షవిషయమూ, పరోక్షవిషయమూ, పగటివేళ సంఘటిల్లిన విషయమూ, రాత్రివేళ సంఘటిల్లిన విషయమూ, మనస్సులో పరులు ఆలోచించుకొన్న విషయమూ సర్వమూ ఇతనికి తెలియగలదు. అంతేకాదు. శస్త్రాలు ఇతనిని ఖండింపజాలవు. పరిశ్రమవలన ఇతనికి ఆలసట కలుగబోదు. యుద్ధస్థలంనుండి యితడు నిరపాయంగానూ, సజీవంగానూ వెలికి వచ్చివేయగలడు.

ఈ విధంగా చెప్పినది మొదలు వేదవ్యాసుని కృపవలన సంజయునకు దివ్యదృష్టి ప్రాప్తించింది. అతడు అక్కడనే కూర్చుండి యుద్ధభూమిలో జరిగే సంఘటనలను ప్రత్యక్షంగా చూచినట్లు తెలిసికోగలిగేవాడు. ఎప్పటి కప్పుడు తాను తెలిసికొన్న విషయాలను ధృతరాష్ట్రునకు తెలియజెప్పేవాడు. అతడు ఉన్న తావునుండి కొన్నిక్రోసుల దూరంలో ఉంది కురుక్షేత్రపు యుద్ధభూమి. అక్కడ 18 అక్షౌహిణుల సైన్యం పరస్పరమూ పోరాటంసాగిస్తూ ఉంది. అక్కడ ఎప్పుడు ఏ వీరుడు ఎవరితో తలపడుతూ ఉన్నాడో, ఎప్పుడు ఎవడు ఏయే అస్త్రాలను ఎన్నింటిని ఎవరిమీద ప్రయోగిస్తూ ఉన్నాడో, ఎవడు ఎన్నిమాఱులు ఏవిధమైన విక్రమ క్రమాలను ప్రదర్శిస్తూ ఉన్నాడో, ఎవడు ఏవిధంగా శత్రుప్రహారాలకు బదులు చెపుతూ ఉన్నాడో, ఎవడు ఏ వేషం వేసి యే వాహనాన్ని అధిష్ఠించి యున్నాడో ఎప్పటికప్పుడు సంజయుడు తాను ఉన్నచోటునుండియే ప్రత్యక్షంగా చూచుచున్నవానివలె తెలిసికోగలిగేవాడు. అంతేకాదు శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు భగవద్గీతను ఏవిధంగా ఉపదేశించాడో, అది అంతా ఇతడు తన చెవులార విన్నాడు. (గీత. 18/74-75) కేవలమూ వినడమే కాదు ఉపదేశం చేసేవేళ శ్రీకృష్ణభగవానుడు ఏ రూపంలో ఉన్నాడో, ఎలాంటి భావభంగిమను ఎలాంటి ముఖముద్రను వహించి యున్నాడో ఆ విషయాలన్నీ కూడ ఇతడు ప్రత్యక్షంగా చూడగలిగేవాడు. అంతేకాదు. ఏ విశ్వరూపాన్ని అంతకు ముందు ఎవ్వరూ

చూచి యుండలేదో, ఏవిశ్వరూపాన్ని వేదాలను పఠించినా, యజ్ఞాలను ఆచరించినా, అధ్యయనాలు చేసినా, దానాలు కావించినా, ఇతరక్రియలను నిర్వర్తించినా, ఉగ్రతపపశ్చర్యలకు పూనుకొన్నా మానవులు చూడజాలరని భగవానుడు అర్జునునకు స్వయంగా తెలిపాడో (గీత. 11-48) ఆ విశ్వరూపాన్నే శ్రీకృష్ణుడు అర్జునునకు చూపినప్పుడు దూరాన ఉండి కూడ సంజయుడు యథాతథంగా చూడగలిగాడు. అనంతరం భగవానుడు తన విశ్వరూపాన్ని ఉపసంహరించుకొని చతుర్భుజరూపుడుగా ఏ దివ్యరూపాన్ని చూపాడో, ఏ దివ్యరూపాన్ని చూచే భాగ్యం దేవతలకు కూడ కలుగజాలదో, ఏ దివ్యరూపాన్నియజ్ఞతపోదానాది విధులచేత కూడ సందర్శించగల భాగ్యం మానవులకు కలుగనేరదని స్వయంగా భగవానుడే తెలిపియున్నాడో (గీత. 11/53) ఆ దివ్యరూపాన్ని కూడ సంజయుడు హస్తినాపురంలో ఉండియే చూడగలిగాడు. ఆ సందర్భంలోనే భగవానుడు కేవలమూ ఒక్క అనన్యభక్తివలన మాత్రమే యీ రూపాన్ని సందర్శించగలగడం సాధ్యం అవుతుందని కూడ అర్జునునితో అంటాడు. (గీత. 11/54) దీనిని బట్టి సంజయుడు కూడ భగవానునియందు అనన్యభక్తి కలవాడని, ఆ కారణంగానే అతనికి భగవానుని దివ్యరూపసందర్శనభాగ్యం కలిగిందని మనం సహజంగానే ఊహించగలం. భగవద్గీతను ఆలకించిన తరువాత భగవానుని స్వరూపస్మృతి సంజయునకు ఒక దివ్యానందానుభూతికి సాధనం అయింది. అతడు తన ఉల్లాసభరితం అయిన దశను వివరిస్తూ ఇలా అన్నాడు - (గీత. 18/76-77)

శ్లో॥ రాజన్ సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్ ।
కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥
తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః ।
విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునః పునః ॥

అనగా రాజేంద్రా! అద్భుతమై పుణ్యప్రదమైన యీ కేశవార్జునుల సంవాదమును మాటిమాటికీ స్మరించి పరమహర్షం పొందుతున్నాను. భగవానుని ఆ అత్యద్భుతరూపాన్ని కూడ మళ్లీమళ్లీ సంస్మరించి పరమాశ్చర్యాన్ని పొందుతున్నాను. పరమానందాన్ని పొందుతున్నాను అని భావం.

దీనిని బట్టి సంజయునకు శ్రీకృష్ణార్జునుల మీద శ్రద్ధాభక్తులు విశేషంగా ఉండడం, అతడు భగవానుని యథార్థప్రభావాన్ని కూడ ఎఱిగినవాడు కావడం ఈ రెండు విషయాలను బట్టి అతడు బహు వివేకశాలియని తేటతెల్లం అవుతోంది. అతడు యుద్ధానికి ముందే భగవానుని విజయాన్ని ఉగ్గడిస్తూ ఇలా అన్నాడు -

శ్లో॥ యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీర్విజయో భూతి ర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥

(గీత. 18/78)

అనగా యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ధనుర్ధారిగా అర్జునుడు ఎక్కడ ఉంటే అక్కడ సిరి, విజయము, భూతి (ఐశ్వర్యము) ఉంటాయి. ఇది ధ్రువమైన నీతి. ఇది నా నిశ్చితాభిప్రాయం. అని భావం.

యుద్ధం ముగిసిన మీదట కొన్ని నాళ్లు మహారాజైన యుధిష్ఠిరుని దగ్గర ఉండి గాంధారి ధృతరాష్ట్రులు వనవాసానికి పయనం అవుతూ ఉన్నవేళ సంజయుడు కూడ వారిని అనుగమించాడు. వనంలో కూడ ఇతడు తన ప్రభువునకు సర్వవిధసేవలను అందించాడు. కుంతీదేవితో గాంధారితో సహా ధృతరాష్ట్రుని దావాగ్ని చుట్టుముట్టగా ఆ ధృతరాష్ట్రుని ఆజ్ఞానుసారం సంజయుడు వారి మరణవార్తను మహర్షులకు తెలియజేయడం కోసం వారిని వీడి ఆశ్రమంలోనికి మఱలి వచ్చాడు. అనంతరం అక్కడనుండి కదలి హిమాలయాలదిక్కుగా వెడలిపోయాడు. ఈ విధంగా సంజయుని జీవితం కూడ ఒక మహత్తర జీవితమే అయింది. ఆ మహాభాగుని జీవితాన్ని బట్టి మనకు తెలియవచ్చే విషయం ఏమంటే మానవుడు ఏ జాతివాడు, ఏ వర్ణం వాడు అయినా భగవదనుగ్రహంతో ఎంతటి వాడైన కాగలడు. ఇది నిజం.

వేదవ్యాస భగవానుడు

భగవానుడైన వేదవ్యాసుడు పరాశరుడను మహర్షి కుమారుడు. ఇతడు దాశరాజుయొక్క పెంపుడు కుమార్తె అయిన సత్యవతి కడుపున జన్మించినవాడు. ఇతడు అలౌకికశక్తియుక్తులు గల మహాపురుషుడు. ఇతడు గొప్ప కారణ పురుషుడు. ఈ మహానుభావుడు ప్రజలలో ధారణాశక్తి క్షీణించిపోతూ ఉండడాన్ని పరికించి వేదాలను ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము అను పేర నాలుగు భాగాలుగా విభజించి తన శిష్యులలో ఒక్కొక్కని చేత ఒక్కొక్క సంహితను అధ్యయనం చేయించాడు. ఒక్కొక్క సంహితకు మఱల ఎన్నో శాఖలను, ఉపశాఖలను కల్పించాడు. ఈ విధంగా ఈ మహాభాగుని వలననే వైదికవాఙ్మయం బహుధా విస్తరించగలిగింది. "వ్యాస" శబ్దానికి విస్తారము అని అర్థము. వేదాలను విస్తరింపజేసినవాడు అయిన కారణంగా ఇతడు వేదవ్యాసుడు అను పేర ప్రసిద్ధి చెందాడు. ఇతడు ఒక ద్వీపమునందు జన్మించేడు. ఇతడు నల్లని దేహచ్ఛాయ గలవాడు. అందుచేత ఇతడు కృష్ణద్వైపాయనుడు అని కూడ పేర్కొనబడ్డాడు. బదరీవనంలో నివాసం చేసినవాడైన కారణాన ఇతనికి బాదరాయణుడు అని కూడ మఱియొక పేరు కలిగింది. ఈ మహానుభావుడు 18 పురాణాలను, మహాభారతాన్ని రచించి ఉపనిషత్తుల తత్త్వం అవగతం కావడానికి వీలుగా బ్రహ్మసూత్రాలను రచించాడు. అనంతరం అనేక ఆచార్యవర్యులు ఆవిర్భవించి ఆ సూత్రాలపై తమ భాష్యాలను రచించి స్వకీయంగా మతాలను స్థాపించారు. వ్యాసస్మృతి అనే పేరుతో ఈ మహానుభావుడు రచించిన ఒక స్మృతిగ్రంథం కూడ లభ్యం అవుతోంది. ఈ విధంగా భారతీయవాఙ్మయపరంగాను, హిందూసంస్కృతి పరంగాను మనం ఈ మహాపురుషునకు ఎంతో ఋణపడియున్నాము. శ్రుతిస్మృతి పురాణాలలో ప్రతిపాదింపబడిన సనాతన ధర్మానికి ఈ వ్యాసభగవానుని ఒక గొప్ప వ్యాఖ్యాత యని చెప్పవచ్చును. ఇతడు చేసిన ఉపకారానికి బదులు ఏమి చేసినా హిందూజాతి యితని

ఋణాన్ని తీర్చుకోలేదు. హిందూజాతి, భారతీయసంస్కృతి లోకంలో నిలిచియున్నంతకాలము చరిత్రలో వ్యాసుని పేరు అమరమై నిలుస్తుంది. ఈ మహానుభావుని లోకానికి అంతకూ ఒక గొప్ప మార్గదర్శకునిగాను, శిక్షకునిగాను ఎన్నవచ్చును. ఈ కారణంగానే జగద్గురువు అని పిలువబడే అదృష్టం ఈ మహానుభావునకు ప్రాప్తించింది. గురుపూర్ణిమనాడు (ఆషాఢశుద్ధపూర్ణిమ) ఆస్తికుడు అయిన ప్రతి హైందవగృహస్థుడూ కూడ ఈ వ్యాసభగవానుని పూజ చేస్తాడు. చేయాలి కూడ. ఈ మహానుభావుడే శ్రీకృష్ణభగవానుని అమరమైన ఉపదేశాన్ని (భగవద్గీత) తన మహాభారతగ్రంథంలో గ్రథితం చేసి లోకానికి సులభం చేసి మహోపకారం చేసాడు.

ఈ వేదవ్యాసమహర్షి త్రికాలద్రష్ట. స్వేచ్ఛాగమనం కలవాడు. ఇతడు ఎల్లర మనోగతాలను ఎఱుగగలవాడు. సంకల్పమాత్రాన ఎక్కడకైన చేరగలవాడు. ఇతడు జన్మించినది ఆదిగా తల్లియొక్క సెలవుగొని తపస్సు చేసుకోవడం కోసం వనంలోనికి వెడలిపోయాడు. అలా వెడలు చున్నవేళ ఇతడు తన తల్లితో అమ్మా నేను కావాలి. రావాలి అని అనుకొన్నప్పుడు నీవు నన్ను స్మరించు! వెంటనే నీ దగ్గఱకు వస్తాను అని చెప్పాడు.

విదురుడు చెప్పిన ఉపాయాన్ని అనుసరించి పాండవులు లాక్షా గృహంనుండి బయల్పడి ఏకచక్రపురం చేరి అక్కడ నివసిస్తూ ఉన్నకాలంలో ఒక పర్యాయం వ్యాసభగవానుడు వారిని కలిసికొనుటకై వారి చెంతకు వచ్చాడు. అప్పుడు అతడు ప్రాసంగికంగా వారికి ద్రౌపదియొక్క పూర్వజన్మవృత్తాంతాన్ని వినిపించి ఆ కన్య ఆదినుండియు మీకొఱకే నిశ్చయింపబడినట్టిది అని తెలియజెప్పాడు. ఆ మాట వినగా పాండవులకు ఎంతో ప్రసన్నత, ఔత్సుక్యమూ కలిగాయి. వారు ద్రౌపదీస్వయంవరంలో పాల్గొన నెంచి పాంచాలనగరానికి పయనమయ్యారు. ఆ నగరం చేరిన మీదట అర్జునుడు అక్కడ స్వయంవరసంబంధమైన నిబంధనను పూర్తిచేసి ద్రౌపదిని గెలుచుకొన్నాడు. తమ తల్లి ఆజ్ఞను అనుసరించి పాండవులు అయిదుగురూ ఆమెను పెండ్లి యాడగోరారు. అందులకు ద్రుపదుడు సమ్మతించలేదు. అప్పుడే వ్యాసుడు అక్కడకు వచ్చి ద్రుపదునకు ద్రౌపది జన్మవృత్తాంతం తెలియజెప్పి అతని కూతురిని అయిదుగురు అన్నదమ్ములూ

పెండ్లి యాడుటకు అతనిని సమ్మతింపజేసాడు.

మహారాజు యుధిష్ఠిరుడు ఇంద్రప్రస్థపురంలో రాజసూయయజ్ఞం చేసిన సందర్భంలో కూడ వ్యాసభగవానుడు ఆ యజ్ఞంలో పాల్గొనుటకై తన శిష్యబృందంతో అక్కడకు విచ్చేసాడు. యజ్ఞం ముగిసిన మీదట సెలవు గొనుటకై అతడు యుధిష్ఠిరుని కడకు వెళ్లాడు. అప్పుడు అతడు ప్రాసంగికంగా ధర్మరాజునకు - వత్సా! నేటినుండి 13 ఏండ్లు అతిక్రమించిన మీదట క్షత్రియలోకం యొక్క మహాసంహారకాండ జరుగుతుంది. దానికి దుర్యోధనుడు చేసిన అపరాధం కారణంగా నీవే నిమిత్తమాత్రుడవు అయ్యెదవని యెఱుగజెప్పాడు.

పాండవుల సర్వస్వాన్ని హరించి వారిని 12 ఏండ్ల దీర్ఘకాలపర్యంతంగా వనములకు పంపివేసినా దుర్యోధనునకు తృప్తి కలుగలేదు. అతడు పాండవులను వనంలోనే మట్టుపెట్టాలని ఆలోచించడం మొదలుపెట్టాడు. తన మామయైన శకునితోను, కర్ణునితోనూ, దుశ్శాసనునితోను మంత్రణం చేసి మౌనంగాను, ఆకస్మికంగాను పాండవుల మీద దాడి చేయడానికి నిశ్చయించుకొన్నాడు. ఎల్లరూ శస్త్రాస్త్ర సన్నద్ధాలైన రథాలను అధిరోహించి వనం దిక్కుగా పయనం అయ్యారు. వ్యాసభగవానుడు తన దివ్యదృష్టిచేత వారి యీ దురుద్దేశ్యాన్ని తెలుసుకొన్నాడు. అతడు వెంటనే వారి దగ్గఱకు వచ్చి వారి ఆ దుష్ప్రయత్నాన్ని వారించాడు. అనంతరం ధృతరాష్ట్రుని కడకు వచ్చి అతనికి ఇలా ఉద్బోధం చేసాడు - రాజేంద్రా! నీవు జూదంలో ఓడించి పాండవులను అడవులకు పంపివేసావు. ఈ విధంగా నీవు చేసినది మంచిపని కాదు. దీని పరిణామం శుభదాయకంగా ఉండదు. నీవు నీ క్షేమాన్ని, నీ బిడ్డల క్షేమాన్ని అభిలషించేవాడవు అయితే ఇప్పుడైనా నిన్ను నీవు సంబాళించుకో! దురాత్ముడైన దుర్యోధనుడు రాజ్యకాంక్షతో పాండవులను చంపివేయుటకు యత్నిస్తున్నాడు. ఇదేమి అన్యాయము? నేను నీకు మఱీమఱీ నొక్కి చెపుతున్నాను. నీ యీ ముద్దుల కొడుకు దురాగతాలను వారించు! మౌనంగా వాడు ఇంట కూర్చుండునట్టి యేర్పాటు చెయ్యి. వాడు పాండవుల ప్రాణాలను హరింప యత్నిస్తే స్వయంగా తానే తన ప్రాణాలకు దూరం అయిపోతాడు. నీవు నీకొడుకులోని ద్వేషబుద్ధిని తొలగించే ప్రయత్నం చేయకుంటే మహానర్థం ప్రాప్తిస్తుంది. దుర్యోధనుడు ఒక్కడూ పోయి వనంలో పాండవుల దగ్గఱ

ఉండాలి అన్నది నా అభిప్రాయం. అలా చేస్తే పాండవులతోడి సత్సాంగత్యం వలన వానిలో ద్వేషభావం అంతరించి ప్రేమభావం ఉదయించవచ్చును. కాని అలా జరగడం చాల కష్టం. కారణం ఏమంటే పుట్టుకతో ఉన్న సంస్కారస్వభావాలలో మార్పురావడం సులభం కాదు. నీవు నీ కురువంశాన్ని రక్షించుకోవాలని కోరుకొంటున్నావా? లేదా? నీవంశం వారు జీవించియుండాలని అభిలషిస్తున్నావా? లేదా? అభిలషిస్తూ ఉన్నవాడవు అయితే పాండవులతో సుహృద్భావం కలిగియుండుడని నీ కొడుకులతో చెప్పు! ఇలా అన్న తరువాత వ్యాసుడు - రాజేంద్రా! మఱొక్క విషయం చెపుతున్నాను. విను! కొన్ని క్షణాలలో మైత్రేయమహర్షి యిక్కడకు రానున్నాడు. అతడు పాండవులతో పొత్తు కలిగియుండుడని నీ కొడుకులకు హితమును ఉపదేశించనున్నాడు. అతడు ఎలా చెపితే అలా తప్పకుండా చేయండి! అతని మాటను పాటించకుంటే అతడు కుపితుడై మిమ్ము శపించివేయగలడు అని కూడ ధృతరాష్ట్రునకు హెచ్చరిక చేసాడు. కాని దురాత్ముడైన దుర్యోధనుడు అతని మాటలను చెవిని బెట్టలేదు. తత్ఫలితంగా అతడు ఆ మైత్రేయ మహర్షి కోపానికి గుఱి కావలసివచ్చింది.

వ్యాసమహర్షి త్రికాలద్రష్ట యగుటతో బాటు అద్భుతమైన సామర్థ్యం కూడ కలవాడు. పాండవులు వనంలో ఉన్న కాలంలో ఒకనాడు అతడు వారి దగ్గఱకు వచ్చి యుధిష్ఠిరుని ద్వారా అర్జునునకు స్మృతివిద్యను ఉపదేశించాడు. తత్ఫలితంగా వారికి దేవతలను దర్శించగల యోగ్యత ప్రాప్తించింది. అంతే కాదు. ఆ వ్యాసుడే సంజయునకు దివ్యదృష్టిని ప్రసాదించాడు. దాని ప్రభావంతో సంజయునకు యుద్ధసమాచారాల పరిజ్ఞానం మాత్రమేకాక భగవానుని విశ్వరూపాన్ని, దివ్యమైన చతుర్భుజరూపాన్ని దర్శించగల దేవదుర్లభమైన యోగ్యతకూడ ప్రాప్తించింది. అంతేకాదు సాక్షాత్తూ భగవానుడైన శ్రీకృష్ణపరమాత్మయొక్క ముఖారవిందంనుండి వినిర్గతమైన దివ్యమైన భగవద్గీతోపదేశాన్ని కూడ యథాతథంగా ఆలకించగలిగాడు. ఆ ఉపదేశం ఒక్క అర్జునుడు తప్ప తదితరులు ఎవ్వరూ వినగలుగునట్టిది కాదు. ఏ దివ్యదృష్టి ప్రభావంతో సంజయునకు ఇంతటి అసాధారణయోగ్యత ప్రాప్తించిందో ఆ దివ్యదృష్టిని ప్రసాదించినవాడగు వేదవ్యాసుని సామర్థ్యం ఎంతటిదో ఎవరు ఊహించగలరు? ఆ మహాభాగుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని అంశవలన ఆవిర్భవించినవాడే కదా! "వ్యాసో నారాయణో

హరిః" కదా సూక్తి?

గాంధారీ ధృతరాష్ట్రులు వనంలో నివసిస్తూ ఉన్న కాలంలో ఒక మాఱు మహారాజైన యుధిష్ఠిరుడు కూడ వారిని కలిసికొనుటకు సపరివారంగా వనంలోని వారి యాశ్రమానికి వచ్చాడు. ఆ సందర్భంలో వ్యాసభగవానుడు కూడ అక్కడకు విచ్చేసాడు. అతడు గాంధారీ ధృతరాష్ట్రులు అప్పటికి ఇంకనూ పుత్రశోకాన్ని విస్మరించలేక బాధపడుచుండుటను కుంతి పుత్రవియోగవేదనతో కుములు చుండుటను పరికించాడు. అప్పుడు అతడు ధృతరాష్ట్రునితో తనను ఏదయినా ఒక వరం కోరుకొమ్మన్నాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు గడచిన మహాభారతయుద్ధంలో మరణించిన తన కుటుంబమువారికి, మిత్రులకు ఎలాంటి గతులు కలిగినవో తెలుపుడనియు, ఒక్కమాఱు వారిని చూడాలని ఉన్నది. కావున చూపుడనియు వ్యాసుని కోరాడు. వ్యాసుడు అతని కోరికను తీర్చుటకు సమ్మతించి గాంధారితో అమ్మా నేటి రాత్రియందే మీరు అందఱూ మీ మరణించిన బంధువులను అందఱను నిద్రనుండి మేలుకొన్నవానిని చూచేవిధంగా చూడగలరు అని చెప్పాడు. సాయంసమాయన నిత్యకృత్యాలు నిర్వర్తించుకొని వ్యాసుని ఆజ్ఞానుసారం వారు ఎల్లరూ గంగాతీరానికి చేరుకొన్నారు. వ్యాసుడు పవిత్రమైన గంగానదిలో ప్రవేశించి యుద్ధంలో మరణించిన యిరుపక్షాల యోధులను ఆహ్వానించాడు. తోడనే గడచిన యుద్ధకాలంలో కురుక్షేత్రపు భూభాగం మీద ఇరుపక్షాల సైనికులు ఏకత్రితులైన తరుణంలో ఎలాంటి కోలాహలధ్వని వినవచ్చిందో అలాంటి ధ్వనియే జలంలోపలనుండి వినవచ్చింది. అనంతరం భీష్మద్రోణులను ముందు పెట్టుకొని గతయుద్ధంలో వీరగతి నందిన రాజులు, రాజకుమారులు ఎల్లరూ నీటిలోపలనుండి వెలికి వచ్చారు. యుద్ధకాలంలో ఏ వీరుడు ఏ వేషాన్ని ధరించి యున్నాడో, ఏ పతాకను దాల్చియున్నాడో, ఏ వాహనాన్ని అధిష్ఠించియున్నాడో ఆ వీరుడు ఆవేషంతోనే, ఆ పతాకంతోనే, ఆ వాహనంతోనే యథాతథంగా చూపట్టాడు. వారు అందఱూ దివ్యమాల్యాంబరధారులై యున్నారు. ఎల్లరూ నిగనిగలీను కుండలాలను ధరించి యున్నారు. అందఱి శరీరాలు దివ్యప్రభాభాసమానములై తేజరిల్లుతూ ఉన్నాయి. ఎల్లరూ నిర్వైరులుగా, నిరభిమానులుగా, అక్రోధనులుగా, ఈర్ష్యాద్వేషరహితులుగా కానవచ్చారు. గంధర్వులు వారి కీర్తిని గానం చేస్తున్నారు. వందిమాగధులు స్తోత్రపఠనాలు చేస్తూ ఉన్నారు. ఆ సమయంలో

వ్యాసుడు ధృతరాష్ట్రునకు దివ్యనేత్రాలను అనుగ్రహించాడు. వానితో అతడు యోధులను అందఱను చూడగలిగాడు. అప్పటి యాదృశ్యము అత్యద్భుతమూ, అచింత్యమూ, రోమాంచకరమూ అయి భాసించింది. గంగాతీరానికి చేరిన జనులు అందఱూ ఆ దృశ్యాన్ని నిర్నిమేషనయనాలతో చూచారు. అనంతరం బహిర్గతులైన యోధులు అందఱూ క్రోధమూ, వైరమూ వీడి తమతమ బంధుబాంధవులను ఎల్లరనూ కలిసికొన్నారు. ఈ విధంగా ఆ రేయంతా ప్రేమికుల ప్రేమపూర్వకమైన పరస్పర సమాగమానందంతో సాగిపోయింది. అనంతరం ఆగతులైన వారు అందఱూ ఎలా వచ్చినవారు అలా మఱల గంగాజలంలో ప్రవేశించి తమతమ లోకాలకు తరలిపోయారు. అప్పుడు వేదవ్యాసుడు గత యుద్ధంలో వీరగతిని పొందినవారి భార్యలను ఉద్దేశించి తల్లులారా! తమ తమ భర్తలు వెళ్ళినలోకాలకు పోవాలని అభిలషించే స్త్రీలు మీలో ఎందఱు ఉంటే అందఱూ గంగాజలంలోనికి దిగి మునగండి! అని పలికాడు. ఆ మాట విని ఎందఱో స్త్రీలు వెంటనే నీటిలో ప్రవేశించి తమతమ మానవదేహాలను వీడి తమతమ భర్తలు వెళ్ళినలోకాలకు వెడలిపోయారు. వారివారి భర్తలు ఎలాంటి దివ్యమాల్యాంబరాభరణాదులను ధరించి వచ్చారో అలాంటి వానినే తాము కూడ ధరించి విమానాలు ఎక్కి తమ తమ అభీష్టస్థానాలకు వెడలిపోయారు.

ఇక్కడ జనమేజయమహారాజు వైశంపాయనుని నోట యీ అద్భుతచరిత్ర అంతా విన్నాడు. మానసికంగా అతనికి ఎంతో కుతూహలం కలిగింది. అతడు కూడ దివంగతుడైన తన తండ్రిని పరీక్షిన్మహారాజును చూడాలని అభిలషించాడు. ఆ సమయంలో వ్యాసుడు అక్కడే ఉన్నాడు. అతడు జనమేజయుని కోరికను తీర్పనెంచి పరీక్షిన్మహారాజును అక్కడకు ఆహ్వానించేడు. జనమేజయుడు తాను యజ్ఞదీక్షాంతస్నానం చేస్తూ తన తండ్రిచేత కూడ ఆ స్నానం చేయించాడు. అనంతరం పరీక్షిత్తు అచ్చటనుండి వెడలిపోయాడు. ఈవిధంగా వేదవ్యాసమహర్షి తన అలౌకికసామర్థ్యాన్ని అనేక సందర్భాలలో వెల్లడించాడు. నిజం చెప్పాలి అంటే అతడొక అద్భుతశక్తి యుక్తులుకల మహాపురుషుడు. మహాభారతాన్ని రచించిన ఆ మహానుభావుని పావన చరణారవిందయుగళిపై శిరమువంచి నమస్కారం చేస్తూ ఉన్నాము.

మహాభారత పఠనశ్రవణముల మహాత్మ్యం

శ్లో॥ యథా సముద్రో భగవాన్ యథా చ హిమవాన్ గిరిః ।
ఖ్యాతావుభౌ రత్ననిధీ తథా భారతముచ్యతే ॥ 65 ॥
కార్ష్ణం వేదమిమం విద్వాన్ శ్రావయిత్వార్థమశ్నుతే ।
ఇదం భారతమాఖ్యానం యః పఠేత్ సుసమాహితః ।
స గచ్ఛేత్ పరమాం సిద్ధిమితి మే నాస్తి సంశయః ॥ 66 ॥
ద్వైపాయనౌష్ఠపుటనిఃసృతమప్రమేయం
పుణ్యం పవిత్రమథ పాపహరం శివం చ ।
యో భారతం సమధిగచ్ఛతి వాచ్యమానం
కిం తస్య పుష్కరజలైరభిషేచనేన ॥ 67 ॥
యో గోశతం కనకశృంగమయం దదాతి
విప్రాయ వేదవిదుషే సుబహుశ్రుతాయ ।
పుణ్యాం చ భారతకథాం సతతం శృణోతి
తుల్యం ఫలం భవతి తస్య చ తస్య చైవ ॥ 68 ॥

(మహాభారతం - స్వర్గారోహణపర్వం.)

సముద్రము, హిమాలయపర్వతము - ఈ రెండూ రత్నాల నిధులు అని చెప్పబడ్డాయి. అలాగే మహాభారతం కూడ (భగవద్గీతవంటి) రత్నాలకు గని. ఈ భారతము కృష్ణద్వైపాయనమహర్షి చేత రచింపబడిన పంచమవేదం. దీనిని నిత్యమూ ప్రవచించి పరులకు వినిపించే పండితునకు సర్వార్థాలు సిద్ధిస్తాయి. ఏకాగ్రచిత్తంతో ఈ మహాభారతగ్రంథాన్ని నిత్యమూ పఠనం చేసేవానికి నిస్సందేహంగా మోక్షరూపమైన పరమసిద్ధి ప్రాప్తిస్తుంది. కృష్ణద్వైపాయన భగవానుని ముఖారవిందమునుండి వినిర్గతమైన యీ మహాభారతం బహు పుణ్యప్రదమూ, పవిత్రమూ, పాపహరమూ, మంగళ మయమూ అయినట్టిది. దీని మహత్త్వానికి మేరలులేవు. ఈ మహాభారత

గాథను ఆలకించి హృదయంగమం చేసుకొన్నవాడు తీర్థక్షేత్రవరిష్ఠమైన పుష్కరతీర్థజలంలో మునుగనక్కఱలేదు. శాస్త్రాలలో పుష్కరస్నానానికి ఏ మహత్త్వం చెప్పబడిందో అది యీ భారతకథను ఆలకించడం వలననే ప్రాప్తిస్తుంది. వేదవేత్త, సమస్తశాస్త్రపరిజ్ఞాతయు అయిన బ్రాహ్మణునకు బంగారు తొడుగులతో అలంకరించబడిన కొమ్ములు గల నూరు గోవులను దానం చేసినవాడూ, నిత్యమూ పుణ్యప్రదమైన మహాభారతకథను ఆలకించినవాడూ - ఈ యిరువురూ సమానఫలాన్ని పొందుతారు.

అమూల్యవచనాలు

కేవలం భగవత్ప్రాప్తి ఒక్కటియే ఇచ్ఛవలన సాధ్యం అయ్యేది. అయితే ఆ ఇచ్ఛమాత్రం అనన్యంగాను, యథేష్టంగాను, తీవ్రంగాను ఉండాలి. అలా ఉంటే భగవానుడు లభించి తీరుతాడు. భగవానుడు ఒక్కడూ తక్క తక్కిన వస్తువులు ఏవీ కూడ ఇచ్ఛవలన ప్రాప్తించేవికావు. సుఖమే కావాలి. దుఃఖం వలదు అని లోకంలోని సమస్తప్రాణులూ కోరుకొంటాయి. అయినా వానిలో అధికాంశం ప్రాణులకు వలదనుకొన్న దుఃఖమే ప్రాప్తిస్తుంది. కాని కావాలనుకొన్న సుఖంరాదు. కాబట్టి జడపదార్థాలకోసం ఇచ్ఛవహించడం నిరర్థకం. మూర్ఖత్వమూను. ఇచ్ఛవలన జడపదార్థాలు ప్రాప్తించవు. అవి ప్రాప్తించాలి. అంటే పూర్వజన్మకృతములైన కర్మల ఫలం రూపంలో ప్రారబ్ధం అపేక్షితం అవుతుంది. అది మన చేతిలోని విషయం కాదు. కాని భగవానుని విషయం అట్టిది కాదు. తీవ్రమైన ఇచ్ఛ వహించినప్పుడు అతడు తప్పక లభిస్తాడు. కాబట్టి భగవానుని పొందాలి అని తీవ్రంగా కాంక్షించాలి. ఆ కాంక్షను యథేష్టంగాను, అనన్యంగాను, తీవ్రంగాను ఉండునట్లు చేసుకొనుటకు ప్రయత్నించాలి.

ధర్మము

(1) 'ధర్మ'శబ్దము "ధృ" ధాతువు నుండి ఏర్పడుతుంది. దానికి అర్థము సమస్త బ్రహ్మాండమును ధరించునదే ధర్మము-

శ్లో॥ ధారణాత్ ధర్మమిత్యాహు: ధర్మేణ విధృతా: ప్రజా: ।
య:స్యాత్ ధారణసంయుక్త: స ధర్మ ఇతి నిశ్చయ: ॥

(మహాభార-శాంతి-109-11)

'కణాదమహర్షి' ధర్మలక్షణం ఇలా అంటారు -

"యతో-భ్యుదయ ని:శ్రేయసా సిద్ధి: సధర్మ:" (1-2)

"దేనివలన ఈ లోకమున అభ్యుదయము మరియు పరమకళ్యాణ రూపమగు మోక్షము ప్రాప్తించునో అదే ధర్మము"

(2) వేద స్మృతి సదాచారము మరియు తన రుచి ననుసరించి పరిణామమును హితము చేయునది - ఇది నాల్గు విధాలుగా ధర్మానికి లక్షణము. మనువు కూడా ఇలాగే అన్నారు-

శ్లో॥ వేద: స్మృతి: సదాచార: స్వస్యచ ప్రియమాత్మన: ।
ఎత చ్చతుర్విధం ప్రాహు: సాక్షాద్ధర్మస్యలక్షణం ॥ (2-12)

"ధరించడానికి యోగ్యత కల్గినదే ధర్మము. సమస్త విశ్వమును ధరించునది. సర్వశక్తి వంతమైనది. మిక్కిలి సమర్థవంతమైన భగవంతుని న్యాయము మరియు చట్టము, అన్యాయాన్నిలేక చట్టాన్ని తెలుసుకొని దానిని అనుసరించి ప్రవర్తించడమే ధర్మాన్ని ఆచరించడమౌతుంది."

(3) ఈశ్వరుని శాసనమున్ననుసరించి ప్రవర్తించేవాడు సంసారము నందు అన్నివిధాల సుఖిస్తాడు. మరియు చివరికి ముక్తిని కూడా పొందుతాడు. కాని దీనిని వ్యతిరేకించెడివాడు ఎదురుదెబ్బ తిని పడిపోతాడు.

(4) ఈశ్వరుడు అనాది అయినట్లుగానే ఈ ఈశ్వరీయన్యాయం కూడా అనాదిదైయున్నది. కాన దీనిని సనాతనమైనదని అంటారు. ప్రాణిమాత్రునికి హితము చేయడమే మానవుని కర్తవ్యము. అందుకు ఈశ్వరీయ చట్టము లేక ధర్మము.

(5) పరమేశ్వరుని మరియు పరమేశ్వరుని చట్టప్రభావాన్ని తెలుసుకొన్నవాడు, దానికి వ్యతిరేకంగా ఎన్నటికి ఆచరించడు. అతను చేయు సమస్తకార్యములు సహజంగానే పరమేశ్వరుని చట్టానికి అనుకూలంగానే వుంటాయి. అతని ద్వారా ఏచరాచర ప్రాణికి కూడా ఏకాలంలోను ఏస్థితిలోను ఏవిధంగాను అహితము జరగనే జరగదు.

(6) ధరించడానికి తగినధర్మము ఏమిటి ?-
ఈ లోకములన మరియు పరలోకమున కళ్యాణము చేయునటువంటి మహాపురుషుల ద్వారా ప్రసాదించబడిన విద్య.

(7) ఈ లోకమున మరియు పరలోకమున కళ్యాణము చేయునదే ధర్మమంటారు. లోక-పరలోకముల రెండింటికి అహితకరమైనది, మేలు చేయునదికాదు, కీడు చేయునదే అవుతుంది. పురస్కారము కాదు, గొప్ప కష్టమే అవుతుంది.

(8) ధైర్యము, క్షమ, మనోనిగ్రహము, చౌర్యము చేయకుండుట, బాహ్య-అభ్యంతరశుద్ధి, ఇంద్రియ సంయమము, సాత్త్వికబుద్ధి, అధ్యాత్మవిద్య, సత్యభాషణ, మరియు క్రోధము లేకుండుట, ఈ పది -ధర్మమునకు లక్షణములుగా చెప్పబడినవి.

(9) అహింసా, సత్యము, అస్తేయ, బ్రహ్మచర్య, అపరిగ్రహ, శౌచ, సంతోష, తప, స్వాధ్యాయము, ఈశ్వరభక్తి, జ్ఞాన, వైరాగ్య, మనోనిగ్రహము, ఇంద్రియదమనము, తితిక్ష, శ్రద్ధ, క్షమ, వీరత్వము, దయ, తేజస్సు, సరళతా, స్వార్థత్యాగము, అమానిత్వము, అదంభిత్వము, అపైశునత్వము, నిష్కపటము, వినయము, ధృతి, సేవ, సత్సంగము, జపము, ధ్యానము, నిర్వైరత్వము, నిర్భయత్వము, సమత్వము, నిరహంకారత్వము, మైత్రి, దానము, కర్తవ్య పరాయణాత మరియు శాంతి - ఈ నలుబది గుణములలోనుండి ఏమతమున ఎన్ని ఎక్కువ గుణములు ఉండునో ఆమతమే అన్నిటికన్న ముఖ్యమైనది మరియు శ్రేయస్కరమైనదిగా తెలుసుకొనదగినది.

(10) సద్గుణముల మరియు సదాచారముల వేరే ధర్మము.

(11) ఏధర్మమునకు లక్ష్యము చాలా గొప్పదో, నిత్యమైనదో, నిర్బాధమైనదో,

ఆనందము కలగచేయునదో ఎందులో అందరికి అధికారము కలదో అదే అన్నిటికన్న ఉత్తమమైన సార్వభౌమ ధర్మమని అనిపించుకోగలదు.

(12) పరమకళ్యాణమును ప్రాప్తింపచేయునదే సర్వోత్తమ ధర్మము. ఇలాంటి ధర్మము నాదృష్టిలో అది వైదికసనాతన ధర్మమే అవుతుంది.

(13) హిందూ సనాతన ధర్మములో అతిస్వల్పకార్యము నుండి మహాత్కార్యములన్నిటికి ధర్మముతో సంబంధం ముడిపడియున్నది.

(14) హిందూ శబ్దానికి భావము -
హిందూస్థానమున (ఆర్యావర్తమున) జన్మించుట, మరియు హిందూస్థానములోని ఒకానొక ఆచార్యుని నడిపించిన మతమును స్వీకరించుట.

(15) తనను హిందువుగా భావించెడి వాడే హిందువు అవుతాడు.

(16) ఒక్క హిందూ ధర్మమే అన్నివిధాలా పరిపూర్ణమైన ధర్మము. మానవుని ఈ సంసారమునకు చెందిన తాపత్రయాగ్నుల విముక్తిని గావించి, అతనిని అనంత సుఖస్థితి వరకు చేర్చి, అనుక్షణం ఆనందమయునిగా చేయుటయే దాని యొక్క అంతిమలక్ష్యము.

(17) హిందూధర్మము యొక్క పవిత్రసందేశమును స్వీకరించి పలుసమయములందు ఈ జగత్తుకు చెందిన దుఃఖ, దగ్ధ, అశాంత జీవులు పరమశాంతిని పొందినవి. మరియు నేటికి జగత్తుకు చెందిన గొప్పగొప్ప భావుక పురుషులు అత్యంత ఉత్సుకతతో ఈ సందేశమును స్వీకరించడానికి తహతహ లాడుతున్నారు. ఏ ధర్మానికి ఇంతటి మహత్తుకలదో అది అనాది కాలమునుంచి ప్రచలితమైన పవిత్రమైన మరియు గంభీర ఆశయము కల్గిన ధర్మాన్ని పాటించుజాతి వ్యామోహము చేత జగత్తు లోని అనన్య మతముల నాశ్రయించి ఈనాడు అజ్ఞాన సరితాప్రవాహములో కొట్టుకుపోవాలనుకొంటున్నది. ఇది చాలా దుఃఖించవలసిన విషయము

(18) ఏ మానవుడు ఏ వర్ణమున జన్మించునో, అతనికి స్వాభావిక కర్మయే అతనికి స్వధర్మము. భారతవర్షమునకు చెందిన సువ్యవస్థిత వర్ణవ్యవస్థయే దీనికి పరమ ఆదర్శము. ఈ వర్ణవ్యవస్థను ఛిన్నాభిన్నం చేయడానికి ప్రయత్నించెడివారు పెద్దపొరపాటు చేస్తున్నారు. ఈజగత్తులో భేదము

అనునది ఎన్నటికి నశించదు. ఇలా ప్రయత్నించినందున వ్యవస్థవిధిగా తారుమారవుతుంది. - ఇదీ మరీ దుఃఖాన్ని కలిగించెడి విషయము.

(19) ఈ సంఘము విరాఢ్రూప భగవంతుని శరీరము. బ్రాహ్మణులు సంఘరూపశరీరానికి ముఖము లేక మస్తక స్థానీయులు. క్షత్రియులు బాహువులు. వైశ్యులు ఊరువులు(జంఘములు) మరియు శూద్రులు పాదములు.

(20) మస్తిష్క కార్యము బుద్ధిద్వారా శరీరాన్ని నడిపించడం, భుజముల కార్యము భౌతిక ఆపదలనుండి రక్షించడం. ఊరువులపని సుస్థిరంగా వుంచడం. మరియు పాదముల పని దానిని నడిపించడం దాని పనులన్నిటిని చేయడం. శరీరమునకు పైన చెప్పబడిన అవయవముల ఉపయోగము ఏవైతే వున్నదో అదే సంఘం కోసం నాల్గువర్ణములకు చెందినదౌతుంది.

(21) జగత్తునకు జ్ఞానమును ప్రసాదించుట, పథ ప్రదర్శనము చేయుట, లేక హితమునకు వ్యవస్థ చేయుట, చట్టములను తయారు చేయుట బ్రాహ్మణుల కర్తవ్యము.

(22) అస్త్రశస్త్రములతో రాష్ట్రమును దురాక్రమణములనుండి మరియు దొంగలు, దోపిడిదొంగల నుండి రక్షించుట, సముచితన్యాయ వ్యవస్థను కల్పించుట, దురాచారులను అణచివేయుట, బ్రాహ్మణులు నిర్దేశించిన మార్గముపైన ప్రజలను నడిపించుట క్షత్రియుల కర్తవ్యము.

(23) కృషి, వాణిజ్యము, గోరక్షణద్వారా సమాజమునందు సుఖసమృద్ధిని విస్తరింపచేయుట, రాష్ట్రసంపదను పెంపొందించుట ద్రవ్యాన్నార్జించి దానిని లోకోపకార కార్యములందు వినియోగించుట మరియు ఈ విధంగా సమాజమును పోషించుట వైశ్యులకర్తవ్యము.

(24) శిల్పము, కళలు, మరియు కుటీర పరిశ్రమలద్వారా సమాజముయొక్క విభిన్న అవసరములను పూర్తికావించుట, సేవచేయుట, మరియు సమాజమును సుఖంగా వుంచుట శూద్రులకర్తవ్యము.

(25) ఎవరికోసం ఏ సమయమున ఏకర్మ ఏవిధంగా చేయడం సమంజసమో మరియు ఈ కర్మకౌశలము చేత హిందువు తన ఇహలోక జీవనమును సుఖమయంగా గడిపి తనకర్మలనన్నిటిని భగవంతునికి

అర్పించి చివరికి మానవజీవిత పరమలక్ష్యమగు పరమాత్మను పొందగలడని వర్ణాశ్రమ ధర్మము మనకు బోధిస్తున్నది.

(26) వర్ణాశ్రమ ధర్మమునకు వున్న దృఢత్వమే హిందూజాతిని కాపాడింది. వర్ణాశ్రమ ధర్మము లేకపోతే మరియు దానిపట్ల హిందూజాతికి వెనుకటి శతాబ్దాలలో జరిగిన దురాక్రమణలచేత మరియు విజేతల ప్రభావంచేత మన హిందూజాతి ఎపుడో నశించి పోయివుండేది.

(27) ఈ దేశములో వర్ణాశ్రమధర్మము శ్రద్ధగా పాటించబడుతున్నంతవరకు దేశం స్వతంత్రంగా వుండెను. మరియు ఇక్కడ తరచుగా అన్ని విధాల సుఖసమృద్ధి వుండెడిది. వర్ణాశ్రమ ధర్మపాలనపట్ల హేయభావము కల్గినప్పటినుండి మన పరిస్థితి దిగజారిపోసాగింది.

(28) హిందువుని జీవితం ధర్మబద్ధమైనది. అతని జన్మమరణములు, భోజన పానీయములు, నిద్రించుట, మేల్కొనుట, ఇచ్చిపుచ్చుకొనుట, ఉపార్జించుట, మరియు త్యజించుట ఇతని ధర్మబద్ధంగానే కొనసాగాలి.

(29) పాశ్చాత్య శుభ్రతను అనుకరించడం మనకు ఏవిధంగా హితకరం కాదు. ఇందువలన మన ధార్మికభావాలు పూర్తిగా నశిస్తాయి. మరియు మనము కేవలము భౌతిక ప్రగతి వెనుక పరుగిడి యదార్థలాభం నుండి వంచితులం కావల్సివుంటుంది.

(30) తన వేష-భాషలను, భోజన-పానీయములను, మరియు ఆచార్యవ్యవహారములను త్యజించడం చేత ఆజాతి పూర్తిగా నశిస్తుంది.

(31) పరదేశీయ మరియు పరధర్మీయుల సభ్యతను, భాషను, ఆచార-వ్యవహారములను, రీతి-రివాజులను, దుస్తులు, మొదలగు వానిని అనుసరించడం వర్ణాశ్రమ ధర్మమును శిథిలపరచడంలో మిక్కిలి సహాయపడినది.

(32) సనాతన వైదిక వర్ణాశ్రమ ధర్మపరిరక్షణకు కారణభూతమైన బ్రాహ్మణత్వమును మరియు పరమధర్మ రూపమగు సంస్కృత గ్రంథములను మరియు సంస్కృత భాషను రక్షించడం ప్రతిఒక్క ధార్మికుని కర్తవ్యము.

(33) ధర్మగ్రంథములను మరియు సంస్పృత భాషను రక్షించడం చేతనే సనాతన ధర్మరక్షణ కొనసాగ కలదు.

(34) సంస్కృతము అనాది భాషయని, మరియు సర్వాంగ పూర్ణమైనదని జ్ఞాపకం వుంచుకోవాలి. సంస్కృతంతో సమానమగు భాష మరొకటి లేనేలేదు.

(35) మనప్రాచీన మహర్షులు, మునుల ద్వారా ఆచరింపబడిన రీతిరివాజులను, వేషభాషలను మరియు స్వభావసభ్యతలను మనము విధిగా అనుసరించాలి. స్వధర్మాన్ని త్యజించడం ఎట్టిస్థితిలోను మంచిదికాదు.

(36) ధర్మమునకు అనుకూలంగా ప్రవర్తించడంలోనే మానవుని మానవత్వము, ఔన్నత్యము మరియు మిక్కిలిలాభముంటుంది. ప్రతికూలంగా ప్రవర్తించడం చేత మానవత్వము నుండి పతితుడౌతాడు. అవనతిని పొందుతాడు. మరియు మిక్కిలి హాని కల్గుతుంది.

(37) ప్రాణములు పోయినప్పటికి ధర్మమును త్యజించకుండా వుండటమే మానవుని కర్తవ్యం. కారణం ధర్మం నిమిత్తం మరణించువాడు ఉత్తమగతిని పొందుతాడు.

(38) గురుగోవింద సింగ్ కుమారులు తమప్రాణంను త్యజించి సుస్థిరకీర్తిని మరియు ఉత్తమ గతిని పొందిరి.

(39) పరుల గుణయుక్త ఉత్తమధర్మంకన్న, గుణరహితమైనప్పటికి స్వధర్మమే తనకు శ్రేష్ఠమయినది, మరియు ఆచరించదగినది. స్వధర్మమును అనుష్ఠించడం చేత మానవునకు పాపం అంటు కాదు.

(గీత-18-47)

(40) తనకళ్యాణము నిమిత్తిం మానవమాత్రుడు నిత్యము నిరంతరము ధర్మమును అనుసరించాలి.

(41) ధర్మమును అనుష్ఠించు వానిని ధర్మము తప్పనిసరిగా రక్షించుకోవాల్సివుండదు.

(42) ధర్మము ఎవరిని వదలదు, ప్రజలే దానిని వదిలేస్తారు.

(43) ధర్మమును నశింపచేయువానిని లేక త్యజించువానిని ధర్మంకూడా నశింపచేస్తుంది. కాని ధర్మమును రక్షించువానిని ధర్మం కూడా రక్షిస్తుంది.

"ధర్మయేవ హతో హంతి ధర్మోరక్షతి రక్షితః"

(44) ధర్మమే మానవునికి జీవనము, ప్రాణము మరియు ఈ లోకమున మరియు పరలోకమున కళ్యాణమును కలుగచేయునది.

(45) పరలోకమునందైతే ఒక్కధర్మమే వెంటవస్తుంది. స్త్రీపుత్ర మరియు బంధువులు మొదలగు వారెవరూ కూడా అక్కడ సహాకరించరు.

(46) ఘోర ఆపదవచ్చినప్పటికి కామ,క్రోధ,లోభ, భయ మరియు వ్యామోహాములకు వశీభూతులై ధర్మమును ఎన్నటికి త్యజించకుండా వుండడమే మానవులకర్తవ్యము.

(47) మానవులందరు తమ-తమ స్వభావములను అనుసరించి కర్మలను ఆచరిస్తూవుంటారు. ఇందుకు పట్టుదల వ్యర్థము. ప్రతి ఒక్క ఇంద్రియ భోగమునందు ఏరాగద్వేషరూప శత్రువులు దాగివున్నవో పాపకర్మలను చేయుటకు ఏవి ప్రోత్సహించుచున్నవో వాటికి వశం కాకుండా మరియు ధర్మమును అనుష్ఠించుటయందు సుస్థిరంగా వుండడమే మానవుని కర్తవ్యము.

(48) ఒకవేళ ఏమానవుడైనా ఒకానొక విధర్మియునిద్వారా ధర్మత్యాగనిమిత్తము అణచివేయబడినచో అక్కడ ధర్మరక్షణ కోసం తన ప్రాణాలను సైతం వదలవలసి వస్తే వదిలేయాలి. కాని ధర్మమును మాత్రం వదలరాదు. ఇందులోనే మానవుని కళ్యాణమున్నది.

(49) ధర్మమును అనుష్ఠించడం చేత గొప్ప ఆత్మికస్వారాజ్యము లభించగలదు. అలాంటప్పుడు ఈసామాన్య స్వారాజ్య విషయం ఏమంత గొప్పది. అది మిక్కిలి సునాయాసంగానే లభించగలదు.

(50) అహింసా, సత్యము, ఆస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము, శౌచము, సంతోషము, తపము, స్వాధ్యాయము, ఈశ్వరప్రణిధానము మున్నగునవి శ్రుతి, స్మృతి ప్రతిపాదిత విధివాక్యధర్మములు. ధర్మమును త్యజించి అన్యాయము చేయువాడు చివరికి నాశనమౌతాడు. కంసుడు, రావణుడు మొదలగువారు అన్యాయకారణం చేతనే నశించారు.

(51) ధర్మ మార్గము మిక్కిలి సూక్ష్మమైనది. కాబట్టి మహాపురుషులు పయనించిన మార్గమే మార్గము. అంటే అట్టి మహాపురుషుల మార్గమును అనుసరించడమే ధర్మము.